TS-11-0036701

# నేటి చర్చ

జాతీయ తెలుగు దిన పత్రిక

తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 31 ఆదివారం, ఫిబ్రవరి 01, 2026 , పేజీలు - 12 వెల : 2/-

అరిస్తే
గెలిచినట్టు కాదు
మౌనంగా ఉంటే
ఓడినట్టు కాదు
సమయానికి తగ్గట్టుగా
ఉండడమే
మనిషి గొప్ప లక్షణం

## విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

# గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ టిక్కెట్లు

- స్థానికంగా గెలిచే వారికే పార్టీ అండ
- రెబల్స్ బెడద లేకుండా చూసుకోండి
- కాంగ్రెస్ నేతలకు సూచించిన సిఎం రేవంత్



**హైదరాబాద్,జనవరి 31 :** మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నేతలను కోరారు. ఈ మేరకు పలు సూచనలు చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు, నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం వద్దు. భాజపా, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలి. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే. రెబల్స్ విషయంలో మాట్లాడి సమన్వయం చేసుకోవాలి. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక మిగతా2లో...



## మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణం

- శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నిక
- కార్యక్రమానికి దూరంగా శరద్ పవార్, సుప్రియా సూలె
- అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ

**ముంబై,31 :** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ, దివంగత అజిత్ పవార్ సతీమణి సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా శనివారంనాడు ప్రమాణ స్వీకారం చేశారు. ముంబైలోని లోక్‌భవన్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమె చేత ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, మరో ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, మహాయుతి మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఎన్సీపీ నేతలు శరద్ పవార్, ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. సునేత్ర పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో రాష్ట్రంలో ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె గుర్తింపు పొందారు. అజిత్ పవార్ ఇటీవల విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన స్థానంలో డిప్యూటీ సీఎం పగ్గాలను సునేత్ర చేపట్టారు. విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్ ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎంపీ అయిన ఆమె శనివారం ఉదయం ముంబైలోని విధాన్ భవన్‌కు మిగతా2లో...

## గోదావరి పుష్కరాలకు సిద్ధం కండి

- పుష్కరఘూట్లు, రహదారుల విస్తరణపై దృష్టి
- రాష్ట్రంలో రోడ్ల నిర్వహ; మరమ్మత్తులకు పెద్దపీట
- 2036 ఒలింపిక్స్ నాటికి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దాలి
- విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్ష



**హైదరాబాద్,జనవరి 31 :** వచ్చే సంవత్సరం జరిగే గోదావారి పుష్కరాలకు పుష్కర ఘూట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల కల్పనకు తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. గోదావారి నది తీరంలో దాదాపు 69 ప్రాంతాలలో 74 పుష్కర ఘూట్లను గుర్తించామని అధికారులు తెలిపారు. త్వరితగతిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి తగు ప్రతిపాదనలు మిగతా2లో...



## అంబటి రాంబాబుకు జగన్ ఫోన్

- దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ సిఎం

**గుంటూరు,జనవరి 31 :** అంబటి రాంబాబుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ చేశారు. టీడీపీ దాడికి గురైన అంబటిని పరామర్శించి ధైర్యం చెప్పిన వైఎస్ జగన్.. రాష్ట్రం జంగిల్‌రాజ్‌గా మారిపోయిం దన్నారు. చంద్రబాబు ఆటవిక రాజ్యాన్ని నడుపుతున్నారని వైఎస్ జగన్ మిగతా2లో...

## నేడు పార్లమెంట్ ముందుకు కేంద్ర బడ్జెట్

- ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రసంగం
- ప్రవేశ పెట్టనున్న నిర్మలాసీతారామన్
- ఆదాయపు పన్ను మినహాయింపులపైనే అందరి చూపు




## మేడారం జాతరలో పోలీసుల పనితీరు భేష్

- అధునిక టెక్నాలజీతో సమర్థంగా విధులు
- రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడి




**ములుగు,జనవరి 31 :** అదివాసీల సహకారంతో పోలీసులు జాతరలో ఉత్సాహంగా విధులు నిర్వహించారని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. వనదేవతలను దర్శించుకున్న డీజీపీ.. కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించిన సీసీ పుటేజీల్లో మిగతా2లో...

## ముగిసిన జనజాతర

- గద్దెలు వీడిన అమ్మవార్లు
- చిలకలగుట్ట చేరిన సమ్మక్క
- జయజయధ్వానాలతో వీడ్కోలు
- ఇళ్లకు పయనమైన భక్త జనం




## సుప్రీం మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులు

- నందినగర్ ఇంటికి నోటీసులు ఎలా అతికిస్తారు
- అయినా మీకు విచారించే అధికారం లేదు
- ఎర్రవెల్లిలో అందుబాటులో ఉంటానని చెప్పాను
- నేరుగా నోటీసులు ఇవ్వకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారు
- ఎసిపికి తనను విచారించే అధికారమే లేదు
- జూబ్లీహిల్స్ ఎసిపికి మాజీ సిఎం కెసిఆర్ లేఖ
- నేటి విచారణకు అందుబాటులో ఉంటానని వెల్లడి



**హైదరాబాద్,జనవరి 31 :** జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదని మాజీ సిఎం కేసీఆర్ పేర్కొన్నారు. నోటీసుల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు ఆరు పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. క్రైమ్ నంబర్ 243/2024 విచారణకు సంబంధించి తన వివరణను ఈ లేఖలో వివరించారు. ముఖ్యంగా నందినగర్ నివాసం గోడపై నోటీసు అతికించడంపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం మిగతా2లో...

## కెసిఆర్ లేని ఇంటికి నోటీస్ ఎలా అంటిస్తారు

- పోలీసుల అత్యుత్సాహం ఎవరి కోసం
- తెలంగాణ తెచ్చిన పెద్దాయననే అవమానిస్తారా
- ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్




## కరీంనగర్ మేయర్ సీటు మాదే

- కేంద్రమంత్రి బండి సంజయ్ ధీమా




## బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలి

- గతంలో లాగా కాకుండా కేటాయింపులు పెరగాలి
- అన్యయాం జరిగితే బిజెపి ఎంపిలదే బాధ్యత
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్



# గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ టిక్కెట్లు

(మొదటి పేజీ తరువాయి)

దృష్టి పెట్టాలి. నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలి' అని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికల సర్వే నివేదికలను టీపీసీసీ చీఫ్ సీఎంకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ 90 శాతం స్థానాలను కైవసం చేసుకోవాలని రేవంత్ రెడ్డి టార్గెట్ నిర్దేశించారు. రెబల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. ఫిబ్రవరి 3 నుంచి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు.తెలంగాణలో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో జీహెచ్ఎంసీకి మినహాయింపునిచ్చారు. మొత్తం 2,996 వార్డులకు పోటీ జరగనుంది. ఈనెల 28 నుంచి ప్రారంభమైన నామినేషన్ల పక్రియ శుక్రవారంతో ముగిసింది. శనివారం నాడు నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఫిబ్రవరి మూడున నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఆ రోజు ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన వచ్చాక పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించి మున్సిపల్ ఎన్నికలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఆపై ఫిబ్రవరి 3 నుంచి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్న సీఎం.. పలు జిల్లాల్లో నిర్వహించే ప్రచార సభల్లో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

# గోదావరి పుష్కరాలకు సిద్ధం కండి

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా ఈ రోజు రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీస్ లు, రవాణా, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఉన్నతాధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. దేవాదాయ శాఖ పరిధిలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధి, సౌకర్యాల కల్పన, పరిపాలన వ్యవస్థ పై సమీక్షించారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. రాష్ట్రంలోని ఇతర ప్రముఖ దేవాలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు అందిస్తున్న వసతులు, భద్రత, పారిశుద్ధ్యం, ప్రసాదాల పంపిణీ, రవాణా సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా యాదగిరిగుట్ట, వేములవాడ, భక్తుల రద్దీ ఉండే ఇతర ఆలయాల్లో దర్శనక్యూల నిర్వహణ, పార్కింగ్, త్రాగునీరు, టాయిలేట్స్, పరిసరాల పరిశుభ్రత నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా చేనేత కళాకారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించాలని సూచించారు. రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ సమీక్షా సమావేశంలో భూ భారతి రికార్డుల నిర్వహణ, రైతులకు అందిస్తున్న సేవలు, భూ సర్వేలు, సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయ భవనాల నిర్మాణం, ఇ-ఫైలింగ్, లైసెన్స్డ్ సర్వేయర్లు, 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యసాధన, తదితర అంశాలపై సమీక్షించారు. క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, సెట్విన్, రాష్ట్ర మ్యూజియమ్స్ అభివృద్ధి, ఆయా శాఖల పనితీరుపై సి.ఎస్ సమీక్షించారు. ప్రస్తుత కార్యక్రమాల అమలు స్థితి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల, తెలంగాణ 2047 విజన్ లక్ష్య సాధన పై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో రాబోయే 2036 ఒలింపిక్స్ నాటికి రాష్ట్రంలో అంతర్జాతీయ క్రీడాకారులను అధిక సంఖ్యలో తయారు చేసే విధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆ విధంగా క్రీడల అభివృద్ధికి యువతను గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల వైపు మరింత ఆకర్షించే విధంగా విధానాలను రూపొందించాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. యువజన సర్వీసులు శాఖ ద్వారా అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ శిక్షణ, యువత సంక్షేమ కార్యక్రమాలు లక్ష్య సాధనలో ఉండేలా పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ, కోచింగ్ సదుపాయాలు, ప్రోత్సాహకాలు, అవార్డులు, ఆర్థిక సహాయంపై సమీక్ష జరిపి ప్రతిభావంతులైన క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా సీఎం కప్ వాట్సాప్ యాప్ ను ఆవిష్కరించారు. పర్యాటక రంగంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించాలని అన్నారు.

# మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నారు. అక్కడ ఎన్సీపీ ఎమ్మెల్యేలతో సునేత్రా పవార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజ్యాంగం ప్రకారం శాసన సభ లేదా శాసన మండలికి ఎన్నిక కాని వ్యక్తి కూడా మంత్రి పదవి చేపట్టవచ్చు. అయితే ఆ వ్యక్తి ఆరు నెలల్లోగా శాసనసభ సభలేదా శాసనమండలి సభ్యుడిగా ఎన్నికవ్వాలి. దీనికి ముందు, శనివారం ఉదయం ఎన్‌సీపీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర పవార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లెజిస్లేటివ్ బిల్డింగ్‌లో జరిగిన సమావేశంలో సునేత్ర పేరును ఎమ్మెల్యే దిలీప్ వాల్సే పాటిల్ ప్రతిపాదించగా, ఎన్‌సీపీ మంత్రి ఛగన్ భుజ్‌బల్ బలపచారు. అనంతరం ఏకగ్రీవంగా పార్టీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర ఎన్నికయ్యారు. సునేత్ర పవార్ డిప్యూటీ సీఎం పదవితో చేపట్టంతో అజిత్ పవార్ చేపట్టిన శాఖలను కూడా ఆమెకు అప్పగించనున్నారని తెలుస్తోంది. అయితే అజిత్ పవార్ చేతిలోని ఆర్థిక శాఖను మాత్రం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తన వద్దే ఉంచుకోనున్నారని, దీనికి బదులుగా మరో శాఖను ఆమెకు అప్పగిస్తారని తెలుస్తోంది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సునేత్ర పవార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, దివంగత అజిత్‌దాదా పవార్ కలలను సాకారం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తారనే నమ్మకం తనకుందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# అంబటి రాంబాబుకు జగన్ ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు దుర్మార్గాలు రోజురోజుకూ పెరిగిపోయాయన్న వైఎస్ జగన్.. ఉద్దేశపూర్వకంగానే హత్యాయత్నం, దాడులకు దిగారన్నారు. ప్రజలన్నీ చూస్తున్నారు. ఈ అరాచకపాలనను ప్రజలు సహించబోరు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు ప్రేక్షకుల్లా వ్యవహరించారు. అంబటికి పార్టీ మొత్తం అండగా ఉంటుంది' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. అంబటిపై టీడీపీ గూండాల హత్యాయత్నాన్ని వైఎస్సార్‌సీపీ సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేసింది. లడ్డూ విషయంలో సిట్ ల్యాబ్ రిపోర్టుల ఫలితాలతో అడ్డంగా దొరికిపోవడంతో బాబు హింసను రాజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. దాంట్లో భాగంగానే వరుస దాడులు జరుగుతున్నాయన్న వైఎస్సార్‌సీపీ.. పథకం ప్రకారమే అంబటిపై హత్యాయత్నం చేశారని పేర్కొంది. అంబటిపై హత్యాయత్నాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి వైఎస్సార్‌సీపీ తీసుకెళ్లనుంది. కేంద్ర హోంశాఖకు వైవీ సుబ్బారెడ్డి లేఖ రాయనున్నారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలి

**హైదరాబాద్,జనవరి 31** కేంద్ర ప్రభుత్వం నేడు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో తెలంగాణను నిర్లక్ష్యం చేయొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వానికి వివక్ష ఉందన్నారు. దానిని సరిదిద్ది కేటాయింపులు చేయాల్సి ఉందన్నారు. తెలంగాణపై బడ్జెట్‌లో వివక్షత చూపిస్తే బీజేపీ ఎంపీలే బాధ్యత వహించాలని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఈ పౌర్ణమి తెలంగాణకు వెలుగులు తెస్తుందా..? , చీకటి ఇస్తుందా..? చూడాలని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిసారీ తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా తెలంగాణకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటు, ఉద్యమం పట్ల ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకత ఉందన్నారు. రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన వంటి తెలంగాణ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ విషయంపై కేంద్రానికి, బీజేపీకి చివరిసారిగా గుర్తు చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర విద్యాసంస్థల స్థాపనకు మోదీ ప్రభుత్వం సహకరించాలని కోరారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు తెలంగాణకి వస్తే తాము గౌరవంగా కలుస్తున్నామని ప్రస్తావించారు. పక్క రాష్ట్రాలకి నిధులు కేటాయిస్తే తాము తప్పు పట్టడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# నేడు పార్లమెంట్ ముందుకు కేంద్ర బడ్జెట్

**న్యూఢిల్లీ,జనవరి 31 :** కేంద్రమంత్రి నిర్మలా సీతరామన్ ఆదివారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఈ వార్షిక బడ్జెట్ ఎప్పటిలాగే కొన్ని మెరుపులు, మరికొన్ని విరుపులు ఉండేలా ఉంటుం దన్న చర్చ సాగుతోంది. పెద్దగా ప్రభావితం కాకపో వచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉద యం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే లోక్‌స భలో బడ్జెట్ ప్రవేశ పెడతారు. బడ్జెట్ ప్రసంగం అనం తరం సభ వాయిదా పడుతుంది. అయితే ఆదివారం ప్రవేశ పెట్టనున్న కేంద్ర ఆర్థిక బ్జడెట్ 2026 కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులు తమకు ఊరట లభించేలా బ్జడెట్ ఉంటుందనే ఆశతో ఉన్నారు. వారి ఆశలు నిజం చేసే దిశగానే కేంద్రం బ్జడెట్ ఉండనుందని సమాచారం. పన్నుల విషయంలో కీలక మార్పులు జరగవచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్ 2026లో ఆదాయపు పన్ను నిబంధనలో పలు మార్పులు రానున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు, సీనియర్ సిటిజన్లకు లాభం చేకూరేలా ఈ మార్పులను కేంద్రం తీసుకువస్తుందని సమాచారం. పన్ను నిర్మాణాన్ని సరళీకృతం చేయడం, పన్ను విషయంలో భారాన్ని తగ్గించడం, పారదర్శకత, డిజిటల్ పన్ను వ్యవస్థను ఎంచుకోవడానికి ఎక్కువ మందిని ప్రోత్సహించడమే లక్ష్యంగా బడ్జెట్ ఉండనుందన్న వార్తలు వస్తున్నాయి. పాత ఆదాయపు పన్ను చట్టం 1961 నుంచి.. కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025 వరకు సరళమైన పరివర్తనలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. సత్వర పన్ను వాపసులు, సరళీకృత సమ్మతి కీలక లక్ష్యాలుగా ఉండనున్నాయని సమాచారం. వార్షిక సమాచార ప్రకటన, పన్ను చెల్లింపుదారుల సమాచార సారాంశం వంటి వ్యవస్థలు పన్ను దాఖలును సులభతరం చేశాయి. డిజిటల్ వ్యవస్థను మరింత నమ్మదగినదిగా, పారదర్శకంగా మార్చడంపై బడ్జెట్ 2026 దృష్టి సారించే అవకాశముంది. ఏఐని సరిగ్గా ఉపయోగించినట్లయితే పన్ను రిటర్న్‌లను ఆటోమేటిక్‌గా దాఖలు చేయొచ్చని, లోపాలను తగ్గించవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పన్ను వాపసుల కోసం రియల్‌టైమ్ ట్రాకింగ్ వ్యవస్థ కూడా సాయపడనుంది. ఆదాయపు పన్ను కేసుల వేగవంతమైన పరిష్కారంపై ప్రాధాన్యం, క్రిప్టో, డిజిటల్ ఆస్తులపై స్పష్టమైన నియమాలకు ఉపయోగ పడుతుంది. మరోవైపు.. కొత్త పన్ను విధానం వచ్చినప్పటికీ కొన్ని అంశాల్లో పాత పన్ను విధానం అందుబాటులో ఉంటుందని సమాచారం. ముఖ్యంగా గృహ రుణాలు, బీమా ప్రీమియంలు, పదవీ విరమణ పొదుపులు, ఇతర పెట్టుబడులకు సంబంధించిన పన్ను తగ్గింపులకు సంబంధించి పాత విధానాలే ఉంటాయని తెలుస్తోంది. బాగా పన్ను రాయితీ కలిగిన వారు పాత పన్ను విధానం నుంచి ప్రయోజనం పొందడం కొనసాగించవచ్చు. అయితే తక్కువ పన్ను మినహాయింపులు ఉన్న వ్యక్తులు కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా భావించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సరైన విధానాన్ని ఎంచుకోవడం ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒక ముఖ్యమైన నిర్ణయం అవుతుంది. విద్యా, గృహ ఖర్చులు, రోజువారీ జీవన వ్యయాలను నిర్వహించే కుటుంబాలకు ఈ మార్పులు ఆర్థికంగా ఊపిరి పీల్చుకునే అవకాశాన్ని అందించవచ్చు. 2026లో ఆదాయపు పన్ను నియమాల మార్పు నుంచి సీనియర్ సిటిజన్లు కూడా ప్రయోజనం పొందవచ్చు. ముఖ్యంగా పెన్షన్ ఆదాయం, వాటి వడ్డీ ఆదాయాలపై సరళీకృత పన్ను విధించడం ద్వారా పన్ను దాఖలును సులభతరం చేస్తాయి. ఏది ఏమైనప్పటికీ.. ట్యాక్స్ ప్లేయర్లకు కేంద్రం శుభవార్త చెప్పనుందని ఆర్థిక నిపుణులు బలంగా చెబుతున్నారు. గత సంవత్సరం ప్రవేశ పెట్టిన పన్ను విధానంపెద్దగాప్రయోజనకారిగాలేదన్నవిమర్శలు వచ్చాయి.

# కెసిఆర్ లేని ఇంటికి నోటీస్ ఎలా అంటిస్తారు

**హైదరాబాద్,జనవరి 31** :మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ రెండోసారి నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసును నందినగర్‌లోని ఆయన నివాసం గోడకు అతికించడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. తెలంగాణ సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి? కేసీఆర్ స్వయంగా తానుంటున్న నివాసం చిరునామాతో పోలీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత కూడా.. ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందడం దారుణం. ఇది అహంకారం కాకపోతే మరేమిటి! 65 ఏళు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దే విచారించాలన్న నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అసలు పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మల్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కేసులన్నీ ఛేదిస్తామని.. ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ కొనసాగిస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు సిట్ అధికారులు నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గేటుకు నోటీసులు అంటించి.. పైశాచిక ఆనందం పొందడం దారుణం' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.ఇది కేవలం 'పైశాచిక ఆనందం' పొందడమేనని కేటీఆర్ విమర్శించారు. చట్టం, న్యాయంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, అక్రమ కేసులను ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి చేస్తోన్న ప్రతి తప్పుడు పనిని ప్రజల ముందు పెడతామని, సమయం వచ్చినప్పుడు ప్రజలే బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు.

# ముగిసిన జనజాతర

**మేడారం,జనవరి 31 :** మేడారం గద్దెపై కొలువై.. మూడు రోజులుగా పూజలందుకున్న సమ్మక్క తల్లిని భక్తుల జయజయధ్వానాల నడుమ పూజారులు వన ప్రవేశం చేయించారు. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. అమ్మవారిని సాగనంపే క్రతువులో గిరిజన సంప్రదాయ సంగీత వాయిద్యాల చప్పుళ్లు.. కొమ్ముబూర శబ్దాలకు భక్తులు నృత్యాలు చేస్తుండగా.. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. మిగతా గద్దెలపై కొలువై పూజలందుకున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను సైతం ఆయా గొట్ల పూజారులు తమ ప్రాంతంలోని గుళ్లకు తీసుకెళ్లారు. సమ్మక్కను బయటకు తీసుకొచ్చిన సందర్భంలో భక్తులంతా 'సమ్మక్క తల్లికి జై.. అందరినీ సల్లంగ చూడమ్మ'.. అని వేడుకుంటూ భక్తిపారవశ్యంతో ఓలలాడారు. అనంతరం రాత్రి 7 గంటల సమయంలో డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ దేవతల వనప్రవేశం కార్యక్రమం ఆరంభమయ్యింది. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే ఈ మహాఘట్టం జనవరి 28 నుంచి 31వరకు జరుగగా.. శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి తరలివచ్చారు.

# సుప్రీం మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధంగా నోటీసులు అతికించడం రాజ్యాంగ విరుద్ధమని కేసీఆర్ స్పష్టం చేశారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను.. వారి నివాసం వద్దే విచారించాలని చట్టం చెబుతోందని గుర్తు చేశారు. తాను ప్రస్తుతం ఎర్రవల్లి నివాసంలో ఉంటున్నానని, అక్కడే విచారణ జరపాలని పోలీసులకు స్పష్టంగా తెలిపారు. ఈ సందర్భంగా సతేందర్ కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ కేసు తీర్పును లేఖలో ఉటంకించారు. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న చిరునామాకు, సీఆర్పీసీ సెక్షన్ 160 కింద జారీ చేసే నోటీసులకు ఎలాంటి సంబంధం లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం నివసిస్తున్న చిరునామాలోనే విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం స్పష్టంగా చెబుతోందని తెలిపారు. హరీష్ రావుకు జారీ చేసిన నోటీసుల విషయంలో పోలీసులు వేర్వేరు ప్రమాణాలు పాటిస్తున్నారని కేసీఆర్ విమర్శించారు. ఈ తరహా చర్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయని హెచ్చరించారు. పోలీసుల తీరు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బాధ్యతాయుతమైన పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు పూర్తి సహకారం అందిస్తానని కేసీఆర్ వెల్లడించారు. ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నందినగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. 'తదుపరి నోటీసులన్నీ కూడా ఎర్రవల్లిలోని నా నివాసానికే పంపాలని చెప్పాను. కానీ, ఇది చెప్పిన తర్వాత కూడా గుర్తుతెలియని వ్యక్తులు మీ సంతకంతో ఉన్న లేఖను రాత్రి 9 గంటలకు నందినగర్ నివాసంలోని మా ఇంటి గోడకు అతికించినట్లు తెలుస్తోంది.వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదని, చట్టం నిర్దేశిరచిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలి. కానీ మీరు కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది' అని కేసీఆర్ తన లేఖలో సూచించారు.'భవిష్యత్తు నోటీసులన్నీ ఎర్రవల్లికే పంపాలని చెప్పినప్పటికీ మీరు దాన్ని విస్మరించారు. కాబట్టి మీరు ఇచ్చిన రెండో నోటీసు చట్టబద్ధంగా అందలేదు, అది చెల్లదు. మీరు ఇచ్చిన నోటీసు నా రాజ్యాంగబద్ధ హక్కులను ఉల్లంఘించడమే. నేను మీ పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ, పొరుగు పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ నివసించడం లేదు. కాబట్టి మీకు నోటీసు ఇచ్చే అధికార పరిధి లేదు. ఈ నోటీసుతో నన్ను కట్టడి చేసే అధికారం లేదు. ఎలక్షన్ అఫిడవిట్‌లో, అసెంబ్లీ రికార్డులో ఉన్న అడ్రస్ ఆధారంగా ఎర్రవల్లిలో విచారించలేమని మీరు చెప్పడం సరికాదు. నోటీసు ఇచ్చే సమయానికి వ్యక్తి ఎక్కడ నివసిస్తున్నారు అన్నదే ముఖ్యం. నేను కొన్ని సంవత్సరాలుగా ఎర్రవల్లిలో నివసిస్తున్నాను అన్నది నిర్వివాద అంశం. అక్కడే నా స్టేట్‌మెంట్ రికార్డ్ చేయవలసిన బాధ్యత మీపై ఉన్నది' అని పేర్కొన్నారు.


## మేడారం జాతరలో పోలీసుల పనితీరు భేష్

(మొదటి పేజీ తరువాయి)

జాతరలో భక్తుల రద్దీ, జాతరకు వచ్చే దారుల్లో ఉన్న ట్రాఫిక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే జాతరలో పిల్లలు, వృద్ధులు తప్పిపోతే అచూకీ తెలుసుకోవడానికి గత జాతరల్లో జాప్యం జరిగేదని, కానీ ఈ జాతరలో కొత్తగా చైల్డ్ ట్రాక్ మేనేజ్‌మెంట్ సిస్టం అనే కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టి పిల్లలు, వృద్ధుల చేతులకు హ్యాండ్ బ్యాండ్ పెట్టడం ద్వారా క్యూఆర్ కోడ్ ద్వారా తప్పిపోయిన పిల్లలు, వృద్ధులను కనుక్కోవడం సులువ గా మారిందన్నారు తద్వారా బాధితులతో పాటు పోలీస్‌శాఖకు సంతృప్తిని కల్గించం దన్నారు. డ్రోన్ లను ఏర్పాటు చేయడం ద్వారా జాతరలో ప్రతీ మూలకు జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలిం చేందుకు అనువుగా మారిందన్నారు.

# కరీంనగర్ మేయర్ సీటు మాదే..: కేంద్రమంత్రి బండి సంజయ్ ధీమా

**కరీంనగర్,జనవరి 31 :** కరీంనగర్ మేయర్‌తో పాటు మూడు చైర్మన్ పీఠాలు తమవేనని బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం,కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంచార్జ్‌లు, కన్వీనర్లు, కో కన్వీనర్లు సమావేశంలో బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడమే మా లక్ష్యం. గెలిచే చోట కార్యకర్తలకే సీట్లు ఇస్తున్నాం. గెలిచే అవకాశం లేనిచోట మాత్రమే ప్రత్యామ్నాయ నేతలకు టిక్కెట్లుటిక్కెట్ రాని వారికి నామినేటెడ్, పార్టీ పదవులతో న్యాయం చేస్తాం. తొందరపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. తప్పుడు ప్రచారాలు నమ్మకండి. డివిజన్లలో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీని గెలిపించండి' అని పిలుపునిచ్చారు. ఇదిలావుంటే కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన పక్రియ కొనసాగింది. శనివారం డివిజన్ల వారీగా వచ్చిన నామినేషన్లను వేరు చేసి ఒక్కొక్కటిగా రిటర్నింగ్, సహాయ అధికారులు పరిశీలించారు. మొత్తం 1,257 నామినేషన్లు వచ్చాయి. దీనికి 736 మంది దరఖాస్తు చేశారు.



# తమ వృత్తిని తెలిపే వెడ్డింగ్ కార్డు

- టాబ్లెట్ షీట్ రూపంలో వెడ్డింగ్ కార్డు ముద్రణ...
- వినూత్న రీతిలో వివాహ ఆహ్వానం పలుకుతున్న వధూవరులు...




**చర్చ, సత్తుపల్లి:** ఆ ఇద్దరు ఇష్టపడ్డారు... వారిద్దరి ప్రొఫెషన్ కూడా ఒకటే.. ఒకే రంగంలో పనిచేస్తున్న వారు ఒకే విధంగా ఆలోచిస్తారనే దానికి నిదర్శనం ఈ వెడ్డింగ్ కార్డు. తాము ఏ వృత్తిలో స్థిరపడ్డామనే విషయాన్ని అందరికీ తెలిసేలా ఏదో ఒకటి చేయాలి అని అనుకొని వినూత్నంగా ఆలోచించారు. తమ ఆలోచన విధానానికి అనుగుణంగా తమ వృత్తిని తెలిపే వెడ్డింగ్ కార్డును తయారు చేశారు. అది చూసిన వారంతా టాబ్లెట్ షీట్ అనుకున్నారు కానీ మొత్తం క్షుణ్ణంగా చదివితే కానీ అది వివాహ ఆహ్వాన పత్రిక అని అర్థం కాదు.. వధూవరులు ఇద్దరు ఫార్మా రంగంలో పనిచేస్తూ ఉండడం.. ఇష్టమైన వృత్తి ఒకవైపు, మరోవైపు ఇద్దరి మధ్య అనురాగం కలిపి వినూత్న రీతిలో ఆహ్వానం పలికేందుకు వారు ప్రత్యేకంగా తయారు చేసుకున్న పెళ్లి పత్రిక ప్రజల్లో ఆసక్తిని కలిగిస్తోంది. జూలూరుపాడు మండల పరిధిలోని కాకర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు తన పెళ్లి పత్రికను వినూత్నంగా, తాను చేస్తున్న వృత్తికి గౌరవంగా రూపొందించి అందరినీ ఆకట్టుకునే విధంగా రూపొందించాడు. ఆ పెళ్లి పత్రికను చూసిన ప్రతి ఒక్కరూ ముందుగా టాబ్లెట్ షీట్ అని భ్రమ పడేవిధంగా ఉంది. ఈ వెడ్డింగ్ కార్డ్ ఇప్పుడు సోషల్ మీడియాలో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కాకర్ల గ్రామానికి చెందిన కిన్నెర భాస్కర్, ధనమ్మ దంపతుల కుమారుడు కిన్నెర నవీన్ ఎంబీఏ పూర్తి చేసి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. వేంసూరు మండలం కందు కూరు గ్రామానికి చెందిన శిరీషతో వివాహం నిశ్చయమైంది. శిరీష కూడా ఎం.ఫార్మసి పూర్తి చేసి ఫార్మసిస్ట్‌గా పనిచేస్తోంది. వధూవరులిద్దరూ ఫార్మా రంగానికి చెందిన వారు కావడంతో, తమ వివాహ ఆహ్వాన పత్రిక కూడా అదే శైలిలో ఉండాలని ఆలోచన చేశారు.

# చనిపోయే వరకు ప్రజల మధ్యనే ఉంటాను

- ప్రజా ప్రభుత్వంలో నాలుగు హామీలు అమలు చేస్తున్నాం..
- మరో రెండు హామీలు నేరవేర్చుతాం..
- కేసీఆర్ దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వలేదు..
- డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదు..
- ధర్మపురి మున్సిపాల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్







**చర్చ :-కరీంనగర్ బ్యూరో :** ధర్మపురి ప్రజల ఆశీర్వాదంతో ప్రజా ప్రతినిధిగా ఎన్నికై ప్రజలకు సేవ చేసే అదృష్టం కలిగిందని మీరు ఇచ్చిన ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజా సేవ చేయడంతో పాటు చనిపోయే వరకు ప్రజల మధ్యే ఉంటునాని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మున్సిపాలిటిలోని 15వ వార్డు లో శనివారం ఎన్నికల ప్రచారంలో మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గతంలో ధర్మపురి ప్రజలు అధికారం ఇచ్చిన నాయకులు ఒక్క రోజు ప్రజల సమస్యలు పట్టించుకోలేదని ఆరోపించారు. అధికారంలో ఉన్న సమయంలో ప్రజల సమస్యలు మరిచిపోయి విలాసవంతమైన జీవితం గడిపారని మంత్రి అన్నారు. తాను ఎన్నికల్లో గెలిచిన ఓటమి చెందిన ప్రజల మధ్యనే ఉన్నానని మంత్రి తెలిపారు. ధర్మపురి ప్రజలు ఇచ్చిన అవకాశంతో మంత్రి అయ్యే అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పించిందని అన్నారు. తాను బ్రతికి ఉన్నంత కాలం ధర్మపురి ప్రజల మధ్య ఉంటానని స్పష్టం చేశారు.

హామీలు మరచిన కేసీఆర్..తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 2018లో ఎన్నికల ప్రచారానికి ధర్మపురి వచ్చిన సందర్భంగా అనేక హామీలు ఇచ్చారని మంత్రి గుర్తు చేశారు. దళితులకు మూడు ఎకరాల భూమి, అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి ఒక్కటి నేరవేర్చాలేదని మంత్రి అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారంటిల్లో ఇప్పటికే నాలుగు గ్యారంటిలు అమలు చేస్తుందని రానున్న రోజుల్లో మిగిలిన రెండు హామీలు నేరవేర్చుతామని మంత్రి అన్నారు. రెండు హామీలు నేరవేర్చిన తరువాతనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురిలో రెండేళ్లలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు.. ధర్మపురి పట్టణంలో గడిచిన రెండు ఏళ్లగా అనే అభివృద్ధి సంక్షేమ పథకాలకు శ్రీకారం చూట్టామని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఇందులో భాగంగా 695 మంది కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. 154 మంది ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేయడంతో పాటు ఇప్పటి వరకు రూ. 7 కోట్ల 70 లక్షలు చెల్లించామని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 327 మందికి రూ. 93 కోట్ల 75వేలు అందజేశామని మంత్రి తెలిపారు. కళ్యాణ లక్ష్మి పథకం ద్వార 206 పేదలకు రూ. 2 కోట్ల6లక్షల 23వేలు అందజేశామని అలాగే గృహ జ్యోతి పథకం ద్వార 2,783 మంది లబ్దిదారులకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందజేస్తున్నమని తెలిపారు. పట్టణంలో 542మంది రైతులకు రూ. 4 కోట్ల 2లక్షల 58 వేల రుణ మాఫీ చేశామని అన్నారు. 15కుల సంఘాలకు కోటి 85లక్షలతో కమ్యూనిటి హాల్స్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అలాగే టీఎఫ్ఐడీసీ మరియు రూరల్ డెవలప్మెంట్, స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ మరియు సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

వార్డు అభివృద్ది కోసం కాంగ్రెస్ కు మద్దతు..

15వ వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన వడ్లూరి సునిల్ తన నామినేషన్ ఉపసంహరించుకుంటున్నట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో ప్రకటించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పిన మంత్రి సునిల్ ను మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. మసీద్ రాజేష్ తో పాటు మరి కొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# కరీంనగర్‌లో ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం




**చర్చ :-కరీంనగర్ బ్యూరో :** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంపాటు విశేష సేవలందించిన ఐదుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం శనివారంనాడు కరీంనగర్ కమీష నరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కరీంనగర్ పోలీసు కమీషనరేటు కార్యాలయం నుండి ఏవో వై.వి. మునిరామయ్య, మహిళా పోలీసు స్టేషన్ నుండి ఎస్సై చల్ల రాజన్న, ట్రాఫిక్ పి.ఎస్. నుండి మహమ్మద్ ముస్తఫా, ఏ.ఆర్. పోలీస్ హెడ్ క్వార్టర్స్ విభాగం నుండి, ఏఆర్ ఎస్సైలు ఖలీల్ , మహమ్మద్ బాషు పదవీ విరమణ పొందారు. కరీంనగర్ అడిషనల్ డీసీపీ పరిపాలన వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ, అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని, ఆ సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తు చేశారు. పదవీ విరమణ తర్వాత అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసు కోవాలని సూచించారు. అడిషనల్ డీసీపీ స్వయంగా పదవీ విరమణ పొందిన ఇరువురికి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లు వెంకటరమణ , సిఎస్బి ఏసీపీ శ్రీనివాస్ , సిఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రిజర్వు ఇన్స్పెక్టర్ అడ్మిన్ రజినీకాంత్, కరీంనగర్ పో లీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై శ్రీ మామిడి సురేందర్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నాంపల్లి మండలం కేతపల్లి గ్రామంలో దారుణం







**నల్గొండ జిల్లా :** మునుగోడు నియోజకవర్గం అక్రమ సంబంధంతో పెట్రోల్ పోసి తగలబెట్టిన వైనం. కుందేలు నగేష్ యాదవ్ మీసాల సుజాత తో అక్రమ సంబంధం కొనసాగి స్తున్నారు. సుజాత వాళ్ళ చెల్లి తో కూడా అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తూ ఉండడంతో ఇద్దరిలో ఒకరిని పెళ్లి చేసుకొని ఒత్తిడి చేయడంతో నీకు నాకు సంబంధం లేదని తెగేసి చెప్పిన నగేష్ ఆ కోపంతో నగేష్ ఇంటికి వెళ్లి తన భార్య మమత పై బాబు కు పాలిస్తుండడంతో వెనక నుండి వెళ్లి పెట్రోల్ మీద పోసి అంటించిన సుజాత దీంతో మమత పూర్తిగా కాలిపోయి మృతి చెందిన మమత బాబు ను దూరంగా పడేయడం తో సగం కాలి చావు బతుకుల మధ్య 6నెలల బాబు స్టేషన్కు వెళ్లి లొంగిపోయిన సుజాత కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

## మేడారంలో గవర్నర్‌కు ఘనస్వాగతం పలికిన కరీంనగర్ సీపీ



**చర్చ :- కరీంనగర్ :** మేడారం సమ్మక్క–సారలక్క వనదేవతల దర్శనార్థం విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ కు పూల మొక్కను అందజేసి వారు సాదరంగా ఆహ్వానించారు. అమ్మవార్ల దర్శనానికి వచ్చిన గవర్నర్ వెంట, మంత్రి సీతక్క, జిల్లా ఉన్నతాధికారులు మరియు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## సీఎం కప్ పోటీల విజేతలకు బహుమతులు

### క్రీడలతో విద్యాభివృద్ధి




**చర్చ, సత్తుపల్లి:** ప్రతిభగల క్రీడాకారులను పల్లె స్థాయి నుంచి జాతీయస్థాయి పోటీలకు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పల్లె ,పట్టణ స్థాయిలో " సీఎం కప్ " పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 2 రోజు లు పాటు సత్తుపల్లి పట్టణ స్థాయి పోటీలు ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహించారు. శనివారం సాయంత్రం వివిధ పోటీల లో విజేతలకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ నరసింహ, మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు, ప్రభుత్వ పాఠశాలల హెడ్మాస్టర్లు నాగేశ్వరరావు,సొందు, లైన్స్ క్లబ్ బాధ్యులు మందపాటి ప్రభాకర్ రెడ్డి , గోగడ రవికుమార్, విశ్వశాంతి ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. క్రీడలతో విద్యాభివృద్ధి..క్రీడలను ప్రోత్సహించడం వలన విద్యార్థుల హాజరు శాతం పెరగడంతోపాటువారు చదువులో మంచి ఫలితాలను సాధిస్తారని పంపిణీ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అతిథులు పేర్కొన్నారు. ఆటల పోటీల వలన శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటారని, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## జిల్లా స్థాయిలో సంచలనం సృష్టించిన టాలెంట్ స్కూల్ విద్యార్థులు

- ఈనాడు ప్రతిభ పాఠవ క్విజ్ పోటీలలో జిల్లా ప్రథమ, ద్వితీయ,తృతీయ ర్యాంకుల సాధించిన టాలెంట్ స్కూల్ విద్యార్థులు
- వ్యాసరచనలో ద్వితీయ స్థానం సాధించిన షేక్ ఆస్పియా



**చర్చ, సత్తుపల్లి:** ఖమ్మం– భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల( 10 డివిజన్ లు) స్థాయిలో నిర్వహించిన ఈనాడు క్విజ్ పోటీలలో స్థానిక సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థి ముప్పాల కావ్య ప్రథమ బహుమతి, చిన్నంశెట్టి లాస్యశ్రీ ద్వితీయ బహుమతి, కొట్టె మౌనిష తృతీయ బహుమతిని, వ్యాసరచన పోటీలో ద్వితీయ స్థానం షేక్ ఆసిఫియా సాధించి ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి ధనసిరి పుల్లయ్య గారు, మరియు ఈనాడు బృందం చేతుల మీదుగా బహుమతులు అందుకోవడం జరిగింది. విజేతలను ఈనాడు సత్తుపల్లి కోఆర్డినేటర్ గాదే నరసింహారెడ్డి, టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, స్కూల్ ఇంచార్జ్ శంకర్, ఉపాధ్యాయ బృందం అభినందించడం జరిగింది.

## టెట్ రద్దు కై చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణలి



**చర్చ, జగిత్యాల, జనవరి 31:** ఎఐజాక్టో పిలుపు మేరకు పి.ఆర్.టి.యు.టి.ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినిపెల్లి ఆనంద్ రావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5 న సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని కోరుతూ "చలో ఢిల్లీ' పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య హక్కు చట్టం 2009 లోని సెక్షన్ 23 ను సవరించి2010 కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు. ఈ సందర్భంగా ధర్నాకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమములో పంచాయతీరాజ్ ఉపాధ్యాయ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యులు ఎ వి న్ రాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బాసిత్, రాష్ట్ర కార్యదర్శి అనూజ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీదేవి, బాధ్యులు హరీష్, ఆత్మ చరణ్ రావు, అనిల్ రావు, శ్రీనివాస్, రాజశేఖర్, గంగారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


## సొంత గూటికి చింతల సతీష్



**చర్చ,గోదావరిఖని:** బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాంట్రాక్టర్ చింతల సతీష్ బిఆర్ఎస్ పార్టీని వీడి తన సొంత పార్టీ ఐన కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని శాసన సభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. మల్లికార్జున నగర్ తొలి కౌన్సిలర్ కవ్వంపల్లి కనకలక్ష్మి దేవేందర్ కూడా ఈరోజు బిఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నెలకంటి రామ్ ని కార్పొరేటర్ గా గెలిపించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్లు, మాజీ కార్పొరేటర్ బొమ్మక రాజేష్ శైలజ, 38వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి నెలకంటి రామ్, సింహాచలం, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కనకలక్ష్మి, వాణి, అఖిల్, రాహుల్ శ్రీనివాస్, నీలం అమర్నాథ్, తలారి వెంకటేష్, దాసరి వెంకట్, తూడిచెర్ల సతీష్, బొమ్మకు రాము, కోడం కిరణ్, తలారి కిరణ్, దార రాకేష్, గుల్లయోగి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో రెపరెపలాడేది కాంగ్రెస్సే..

- బీఆర్ఎస్ బిజెపి భూస్థాపితమే
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు
- కాంగ్రెస్ లో చేరిన పలువురు నాయకులు





**చర్చ :-కరీంనగర్ బ్యూరో :** కార్పొరేషన్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి నగరపాలక సంస్థపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ బిజెపి భూస్థాపితం కావడం ఖాయమైందని విమర్శించారు. ఆ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు.
కరీంనగర్లో శనివారం రాజేందర్ రావు సమక్షంలో 34 డివిజన్ నుండి పూర్ణచందర్, 47 నుండి బండి సురేందర్ గౌడ్,49 డివిజన్ నుండి పద్మశ్రీ కాంగ్రెస్ లో చేరారు. బీఆర్ఎస్ నుంచి జేల్లోజు జ్యోతి శ్రీనివాస్ నుంచి కాంగ్రెస్లో చేరారు. వారందరికీ రాజేందర్ రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ బిజెపి కార్పొరేషన్ ఎన్నికల్లో కుమ్మక్కు అయ్యాయని ఆరోపించారు. ప్రజలు వారిని నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కష్టపడి పని చేయాలని రాజేందర్ రావు సూచించారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన బిజెపి బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని పేర్కొన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అభ్యర్థులంతా మంచి మెజార్టీతో విజయం సాధించబోతున్నారని రాజేందర్ రావు తెలిపారు. కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందన్నారు.

# చంద్రబాబు జపం చేయందే పూట గడవని బిఆర్ఎస్ నేతలు

**- వంచ శ్రీనివాస్ రెడ్డి**

**చర్చ :-కరీంనగర్ బ్యూరో :** తెలంగాణ ఏర్పడి 11 సంవత్సరాలు దాటిన, రాజకీయ ఇబ్బంది ఎదురైన ప్రతిసారి మా నాయకుడు చంద్రబాబు నాయుడుని బూచిగా చూపించి, జపం చేస్తూ పూట గడుపుకుంటున్న బిఆర్ఎస్ నేతలు ఎంతకాలం సెంటిమెంటుతో తెలంగాణ ప్రజలను మోసం చేస్తారని తెలుగుదేశం పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు వంచ శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా దుయ్యబట్టారు. సాగునీటి ప్రాజెక్టులు గురుదక్షిణ కింద చంద్రబాబు నాయుడుకు రేవంత్ రెడ్డి అప్పనంగా ధారబోస్తున్నాడని, తెలంగాణ నదీ జలాలను చంద్రబాబు నాయుడు దోచుకెళుతున్నాడని బిఆర్ఎస్ నేతలు ఆరోపించడం సిగ్గుచేటు అన్నారు. బిఆర్ఎస్ నేతలకు చంద్రబాబు నాయుడుని బూచీగా చూపించడం కొత్త కాదని, తెలంగాణ సెంటిమెంట్ కనుమరుగైతే బిఆర్ఎస్ నేతలకు పుట్టగతులు ఉండవని రాజకీయ వ్యూహంలో భాగంగా చంద్రబాబు నాయుడుని ముడి సరుకుగా వాడుకోవడం బిఆర్ఎస్ నేతలకు అలవాటైందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో అగ్గిపుల్ల దొరకలేదని బ్రతికి బయటపడ్డ హరీష్ రావు కూడా చంద్రబాబు నాయుడుని



విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లించడమే అవుతుందన్నారు. రెండుసార్లు తెలంగాణ కోసం లేఖలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు ఏ విధంగా తెలంగాణకు అన్యాయం చేసిండో హరీష్ రావు సమాధానం చెప్పాలన్నారు. నోటికి వచ్చింది తడవుగా మాట్లాడితే తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు.పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు పెండింగ్ ప్రాజెక్టుల గురించి మాట్లాడకుండా, వాటిని పూర్తి చేయకుండా, కమిషన్ల కోసం కొత్త ప్రాజెక్టులను తెరపైకి తెచ్చి ఎకరా పారించకుండా రైతులను మోసం చేసింది బి ఆర్ ఎస్ ప్రభుత్వం కాదా? సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నేతలకు లేదని గ్రహించాలి. రాష్ట్రాన్ని దోచుకున్నారు. దాచుకున్నారు.ఎన్నో అరాచకాలు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఇప్పుడు డైవర్షన్ రాజకీయాల కోసం నీతులు చెబుతున్నారని వంచ శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో కుటుంబ పాలన సాగించి ప్రజలకు తీరని నష్టం చేసిన బిఆర్ఎస్ నేతలు ప్రజలకు హరికథలు చెప్పడం కాదు, నిజాలు చెప్పాలి. అబద్దాలతో సెంటిమెంట్ రగిలించి తెలంగాణ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తే తెలంగాణలో ఉనికి లేకుండా బి ఆర్ ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయ మన్నారు. చంద్రబాబు నాయుడుని విమర్శించి మీ ఉనికిని కోల్పోతున్నారని, మీ విష ప్రచారం తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఎదగకుండా ప్రాంతీయ విభేదాలు, కుట్రలు చేస్తే భవి ష్యత్తులో బిఆర్ఎస్ పార్టీకి శంకరగిరి మాన్యాలు తప్పవు అన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ పాటించడం మనందరి గురుతరమైన బాధ్యత..

- భారం అనుకోవద్దు..
- మన కుటుంబంతో పాటు ఇతర కుటుంబాలకు నష్టం జరగకుండా చూసుకోవాలి..
- అజాగ్రత్త నిర్లక్ష్యం వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు
- ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలి..
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం ముగింపు సమావేశానికి హాజరు..





**చర్చ :-కరీంనగర్ బ్యూరో :** ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మనందరి గురుతరమైన బాధ్యత అని భారం అనుకోవద్దని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. వాహనదారులతో పాటు ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణం సాగించాలని సూచించారు. సురక్షితమైన ప్రయాణం ద్వారా మన కుటుంబంతోపాటు ఇతరుల కుటుంబాలకు నష్టం కలగకుండా చూసుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. శనివారం తిమ్మాపూర్ లోని ఆర్టిఏ కార్యాలయంలోని జువ్వాడి చొక్కా రావు (సారధి) చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ఆడిటోరియంలో జరిగిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం ముగింపు సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారుల అజాగ్రత్త నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఎవరికివారు తమ బాధ్యతగా భావిస్తూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎక్కడా వాటిని బ్రేక్ చేయవద్దని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా పాఠశాలల విద్యార్థులు తల్లిదండ్రులు చుట్టుపక్కల వారికి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. తిమ్మాపూర్ సారధి చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ లో ఇప్పటివరకు దాదాపు 22,000 మంది విద్యార్థులు ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు తిమ్మాపూర్ చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ను సందర్శించి రూల్స్ పై శిక్షణ పొందాలని సూచించారు. అడిషనల్ డిసిపి వెంకట రమణ ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. అతివేగము నిర్లక్ష్యం అజాగ్రత్త తో నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. పోలీస్ శాఖ ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల భాగస్వా మ్యంతోనే పూర్తిగా రోడ్డు ప్రమాదాలు నియంత్రించవచ్చు న్నారు. ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, డిటిఓ శ్రీకాంత్ చక్రవర్తి మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా నెలరోజులపాటు జిల్లాలో ట్రాఫిక్ నియమ నిబంధనలపై వివిధ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. పోలీస్ శాఖ ఆర్ అండ్ బి శాఖ వైద్యశాఖ వివిధ శాఖలతో కలిసి ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. నెలలో ఒకరోజు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన తరగతులు నిర్వహించాలని ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ సూచించారు. రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ అవేర్నెస్ లో భాగంగా నిర్వహించిన క్విజ్ రంగోలి పోటీల్లో ప్రథమ చూపిన పలు పాఠశాలల విద్యార్థులకు మహిళలకు బహుమతులు ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ డిటిఓ శ్రీకాంత్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ ఆర్ అండ్ ఈ ఈ నరసింహ చారి ఎంవీఐ రవికుమార్ తిమ్మాపూర్ సిఐ సదన్ కుమార్ ఏఎంవీఐ లు స్రవంతి, హరిత చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్క్ ఇన్స్ట్రక్టర్ హారిక తో పాటు పలువురు అధికారులు ఆర్టిఏ పోలీస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నియమాలు పాటిస్తే ప్రాణాలు సురక్షితం

- చిన్న తప్పిదం... పెద్ద ప్రమాదం
- రోడ్డు భద్రత అధికారుల బాధ్యత మాత్రమే కాదు
- మైనర్లు వాహనాలు నడపకూడదు
- సత్తుపల్లి ఏం .వి. ఐ శ్రీనివాసరావు
- సత్తుపల్లి లో రోడ్డు భద్రత అవగాహన ప్రదర్శన

**చర్చ, సత్తుపల్లి:** రోడ్డు భద్రత అధికారుల బాధ్యత మాత్రమే కాదు. అది రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరి బాధ్యత.. రోడ్డు నియమాలు పాటిస్తే ప్రాణాలు సురక్షితమని సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జే .ఎన్. శ్రీనివాసరావు అన్నారు.
బాధ్యత గల వ్యక్తిగా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తానని ప్రతిజ్ఞ చేయించారు.జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలు( జనవరి 1 నుంచి 31 వరకు) ముగింపులో భాగంగా శనివారం సత్తుపల్లిలో రవాణా శాఖఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అవగాహన ప్రదర్శన జరిగింది.వివిధ పాఠశాలల విద్యార్థులు, యాజమాన్యాలు, వారి డ్రైవర్లు , గంగారం బెటాలియన్ పోలీసులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు శ్రీనివాసరావు, రాజశేఖర్ రెడ్డి, సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు మాటాడుతూ... మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధం. ఇలా చేస్తే వారి భవిష్యత్తుతో పాటు ఎదుటివారి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదం
అనేక కుటుంబాలకు తీరని శోకం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం





# శోభాయాత్ర ఏర్పాట్లు పరిశీలించిన సుడా చైర్మన్

- అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి దర్శనం చేసుకోవాలన్న సుడా చైర్మన్

**చర్చ :-కరీంనగర్ బ్యూరో :** మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల చివరి ఘట్టం శోభాయాత్ర ఆదివారం సాయంత్రం 7 గంటలకు మార్క్ ఫెడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమై మార్కెట్ రోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు అత్యంత వైభవోపేతంగా సాగుతుందని ఈ శోభాయాత్ర లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని స్వామి వారి కృపకు పాత్రులు అయ్యే అవకాశం పొందాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కోరారు. మార్క్ ఫెడ్



గ్రౌండ్ లో ఏర్పాట్లను పరిశీలించి ఎండోమెంట్ మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు.వంశపార ట్రస్టు సభ్యులు చకిలం గంగాధర్,జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్,



ఉత్సవ కమిటి సభ్యులు సిరిపురం మనోజ్,కోమళ్ళ శిరీష, ఉప్పల బాలాజి,స్వప్న,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన ఇద్దరు పోలీసు అధికారులను ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు







చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి శనివారం తో పదవీ విరమణ పొందిన ఒక ఏఎస్సై, ఒక ఏఆర్ఎస్సై ను ఈ రోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఘనంగా సత్కరిం చారు. 43 సంవత్సరాలు పోలీసు శాఖలో పని చేసి ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్ నందు విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఏఎస్సై మంచా నాయక్ ను,41 సంవత్సరాలు తమ సేవలను అందించి జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఏఆర్ఎస్సై సూర్యనారాయణ లు శనివారం పదవీ విరమణ పొందడం జరిగింది. పదవీ విరమణ పొందిన ఈ ఇద్దరు అధికా రులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శాలువాలతో మరియు పూలమాలతో ఘనంగా సత్కరించడం జరిగింది.అనంతరం పోలీస్ శాఖలో వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.ఎంతో కాలంగా పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.పోలీసు శాఖ నుండి పదవీ విరమణ పొందిన అధికారులు మరియు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.తమ దైనందిన కార్యక్రమాలలో వ్యాయామం ,యోగా, ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అనంతరం పదవీ విరమణ పొందిన ఇద్దరు అధికారులకు ప్రశంసా పత్రా లను అందజేశారు.పదవీ విరమణ అనంతరం వారికి ప్రభుత్వం నుంచి అందవలసిన ప్రతిఫలాలు త్వరితగతిన అందేలా చూడాలని కార్యాలయ అధికారులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో అడ్మిన్

# పుర పోరు ప్రచారంలో 19 వార్డులో దూసుకెళ్తున్న గులాబీ,ఎరుపు

- సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తా:పాకలపాటి లక్ష్మీ(19 వార్డు సీపీఎం కౌన్సిలర్ అభ్యర్థిని)





చర్చ, సత్తుపల్లి: ఖమ్మంజిల్లా సత్తుపల్లి పట్టణ పుర పోరులో బిఆర్ఎస్ పార్టీ(గులాబీ) బలపరిచిన 19 వ వార్డు సీపీఎం (ఎరుపు) అభ్యర్థిని పాకలపాటి లక్ష్మీ దళం ప్రచారంలో దూసుకెళ్తుంది.శనివారశీ నాటికి వార్డులో ప్రతి ఓటరును మూడు సార్లు ప్రత్యక్షంగా కలసి ఓటును సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు వేయాలని అభ్యర్థించారు.సుమారు 40 మంది ఇరు పార్టీల నేతలతో కాలినడకన గడప గడపకు వెళ్తూ ఓటర్లను అప్యా యంగా పలకరిస్తూ కరచాలనం చేస్తూ వార్డులో సమస్యలను అడిగి తెలుసుకుశీటున్నారు.ముమ్మర ప్రచారం చేస్తున్నా రు. సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తామని లక్ష్మీ వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు.ప్రధానంగా వార్డులో ఉన్న సైడ్ డ్రైన్ ల నిర్మాణం,అంతర్గత రహదారుల నిర్మాణం,పెన్షన్లు,పక్కా ఇండ్లు,పట్టణ పేదలకు ఉపాధి హామీ అమలు తదితర అంశాలపై ప్రభుత్వంపై గళం విప్పుతానని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో: సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కొలిక పోగు సర్వేశ్వరరావు,బిఆర్ఎస్ నాయకులు కంచర్ల నాగేశ్వ రరావు,నాగార్జున వెంకటా చారి,పరిమి వెంకటేశ్వరరావు,కొత్తపల్లి నరసింహా రావు, మోరంపూడి వెంకటేశ్వరరావు,రాగం సత్యనా రాయణ, శ్రావణ్, సీపీఎం కార్యకర్తలు రావుల రాజబాబు ,మల్లూరు చంద్రశేఖర్ ,పాకలపాటి ఝాన్సీ,మోరంపూడి వెంక టేశ్వ రరావు,పాకలపాటి శ్రీను, మల్లికార్జునరావు,చప్పిడి భాస్కర్, రాయల రాణీ రుద్రమ్మదేవి, జాజిరి జ్యోతి,చీకటి అజిత

# వన దేవతల పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్

- బీ.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థులకు సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదం ఇవ్వాలి
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



చర్చ,గోదావరిఖని:వన దేవతల పోరాట స్ఫూర్తితోనే కేసీఆర్,, తెలంగాణ రాష్ట్రం సాధించారని పదేళ్ల కేసీఆర్ పాలనలో సుభిక్షంగా తెలంగాణ రాష్ట్రం ముందుకు సాగిందని,, ప్రతి ఇంటికి సంక్షేమ పథకం ప్రతి ముఖంలో అనందం నింపినా ఘనత కేసీఆర్ దని,, యావత్తూ తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అమ్మవార్లను దర్శిం చుకున్నారు. జాతర కమిటి స్వాగతం పలికి శాలువాతో సన్మాని ంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తోలి సిఎం కేసీఆర్ పాలనలో ప్రజలంతా సుభిక్షంగా వర్ధిలారన్నారు. రెండేళ్ల రెవంత్ రెడ్డి పాలనలో ప్రజలకు కష్టాలు తప్ప చేసింది ఎమి లేదని అబద్దాల హామిలిచ్చి ప్రజలను మట్టసం చేసిన ఘనత రెవంత్ దక్కుతుందన్నారు. రామగుండం నియోజకవర్గం లో రాక్షస పాలన సాగుతోందని అభివృద్ధి సాకుతో విధ్వంసం సృష్టించారని చిరు వ్యాపారులు దుకాణాలు కుల్చి వారి జీవితాలను రోడ్డుపై పడేశారన్నారు. రెండు సంవత్సరాల కాలంగా అభివృద్ధి సాకుతో కుల్చువేతలు కమీషన్ల కోసం పాలకులు పనిచేస్తున్నరని ఇక్కడ జరిగిన అభివృద్ధి శున్యం అన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రజల కష్టాలు ఇబ్బందులు తోలగాంటే ఇక్కడ బీ.ఆర్.ఎస్ పార్టీ మేయర్ పీఠం గెలువాల్సిన అవసరం ఉందన్నారు. బీ.ఆర్.ఎస్ పార్టీ ఈ ప్రాంతానికి శ్రీరామ రక్ష అని, కార్పోరేషన్ ఎన్నికల్లో బీ.ఆర్.ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను ప్రజలు గెలిపించి దుర్మారపు పాలనకు చరమగీతం పాడా లన్నారు. రామగుండం నియోజకవర్గం లోని సకల జనులందరికి సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల ఆశీస్సులుండాలనీ ప్రజలందరు సుఖ సంతోషాలతో వర్ధిలాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూల విజయ రెడ్డి, పి.టి. స్వామి, నడిపల్లి మురళీధర్ రావు, కల్వచర్ల కృష్ణవేణీ, జనగామ కవిత సరోజిని, బాదె అంజలి, నారాయణదాసు మారుతి, అచ్చే వేణు, బోడ్డుపల్లి శ్రీనివాస్, కరవెద శ్రీనివాస్ రెడ్డి, తోకల రమేష్, ఆర్శనపల్లి శ్రీనివాస్, కోలుగూరి సాయి కుమార్ (చింటూ), ఇరుగురాళ్ల శ్రావన్ తదితరులు పాల్గొన్నారు.

# బీ-ఫారం ఎవరికి ఇప్పటికీ ప్రశ్నార్థకమే

- ముగిసిన కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ
- 54 అభ్యర్థుల నామినేషన్ లు స్వీకరణ



చర్చ, సుజాతనగర్:మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సుజాతనగర్ మండలంలో పూర్తయ్యింది. మండల పరిధిలోని 20, 21, 22, 23 డివిజన్లకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీల నుంచి మొత్తం 54 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, అదే సంఖ్యలో అభ్యర్థులు పోటీకి ఎంపిక కావడం విశేషంగా మారింది .డివిజన్ వారీగా చూస్తే 20వ డివిజన్‌లో 8 నామినేషన్లు, 21వ డివిజన్‌లో 10, 22వ డివిజన్‌లో అత్యధికంగా 19, 23వ డివిజన్‌లో 17 నామినేషన్లు దాఖలయ్యాయి.అయితే నామినేషన్ల ఉపసంహరణ (విత్‌డ్రాయల్) గడువును ఈ నెల 3వ తేదీగా ఎన్నికల అధికారులు ఖరారు చేశారు. అదే లోపల రాజకీయ పార్టీలు తమ అధికారిక అభ్యర్థులను ప్రకటిస్తూ సంబంధిత మండల అధికారులకు బీ–ఫారం ద్వారా డిక్లరేషన్ చేయాల్సి ఉండటంతో, బీ–ఫారం ఎవరికి కేటాయించబడుతుందో, ఎవరు పార్టీ అధికారిక అభ్యర్థులుగా బరిలో నిలుస్తారో అన్నది ఇప్పటికీ స్పష్టత రాకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.బీ–ఫారం కేటాయింపుపై పార్టీలలో అంతర్గత చర్చలు కొనసాగుతున్నాయని, చివరి నిమిషం వరకు ఉత్కంఠ నెలకొనే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# చేపల కాలనీలో "గోపు" సతీమణి ప్రచారం



చర్చ :- మానకొండూర్ :నగర పాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోపు మల్లారెడ్డి సతీమణి గోపు సరిత శనివారం చేపల కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఇంటింటి వెళ్లి ప్రజల మద్దతు కోరారు. సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉంటూ గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న తన భర్త గోపు మల్లారెడ్డిని కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిపించాలని సరిత అభ్యర్థించారు. ఈ ప్రచారంలో గోపు సరితతోపాటు ముంజ స్వాతి, ఐతం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలోకి 20 కుటుంబాల చేరిక



చర్చ,కొత్తగూడెం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరికల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం కాంగ్రెస్ మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఎండీ ఖాజా బక్ష్ ఆధ్వర్యంలో సుమారు 20 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ శ్రీమతి తోట దేవి ప్రసన్న కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, మైనార్టీలు, బలహీన వర్గాలకు అండగా నిలిచే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కోనేరు చిన్ని, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, కొత్తగూడెం కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ గౌస్ ఉద్దీన్ పాల్గొన్నారు.
అలాగే క్రిస్టియన్స్ నాయకులు పి.ఆర్. వాట్సన్, పి. నాని మోజోస్, ఆర్. భరత్, ఎస్. కిమ్ కుమార్, ఎస్. గౌతమ్, ఎల్.జె. ప్రవీణ్ కుమార్, పి. శశి కిరణ్, ఏ. స్వాగత్, కే. పవన్, టీ. కార్తీక్, ఐ. రాబిన్ రత్నకర్, ఎస్. ధర్మరాజ్, డి. సురేష్, ఎస్. సంపత్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# పనిచేసే ప్రదేశం లో మహిళలపై లైంగిక వేధింపుల ను అరికట్టుటకు అంతర్గత ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చేయాలి: స్వర్ణలత లెనీనా



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్ని కార్యాలయాలు, సంస్థలు, ప్రభుత్వం మరియు ప్రైవేటు రంగాలకు చెందిన సంస్థలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం–2013 ప్రకారం తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదు కమిటి ఏర్పాట్లు చేయవలసింధిగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా సూచించారు. ఏర్పాటు చేయని లేదా ఐసీసీ వివరాలు పోర్టల్ లో నమోదు చేయని సంస్థల పై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. కావున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రైవేటు సంస్థలు , వ్యాపార సంస్థలు , పరిశ్రమలు వెంటనే అంతర్గత ఫిర్యాదు కమిటినీ ఏర్పాట్లు చేసి పూర్తి వివరాలు షీ బాక్స్ పోర్టల్ లొ నమోదు చేయాలని కోరారు. అంతర్గత ఫిర్యాదు కమిటీ సభ్యుల వివరాలు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం లో అందించాలని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మరియు విద్యా సంస్థల యాజమాన్యాలకు తెలియజేశారు.కమిటీ సభ్యులు ఈ విధంగా ఉండేలాగా చూసుకోవాలని చెప్పారు 1 అధ్యక్షురాలు (ప్రెసిడింగ్ ఆఫీసర్) సీనియర్ మహిళా ఉద్యోగి2.కనీసం 2 సభ్యులు మహిళా హక్కులు / సామాజిక సేవలపై అవగాహన ఉన్న ఉద్యోగులు3.బాహ్య సభ్యుడు ఎన్‌జీఓ / మహిళా సమస్యలపై అనుభవం ఉన్న వ్యక్తి
కమిటీలో కనీసం 50% మహిళలు ఉండాలి

## వాస్తు ప్రకారం ఇంటి సింహద్వారం ఇలా ఉంటే లక్ష్మీ దేవి సంతోషంగా వస్తుంది



వాస్తు ప్రకారం ఇల్లు నిర్మించినా, వాస్తు ప్రకారమే అందులోకి వస్తువులు తెచ్చినా ఎక్కడో ఒకచోట లోపం కనపడుతుంటుంది. అయితే లక్ష్మీదేవి ఇంట్లోకి ప్రవేశించాలంటే కొన్ని నియమాలున్నాయి. ఇంటి ప్రధాన ద్వారం ఆ ఇంటి స్థితిగతులను తెలియజేస్తుంది. వాకిలిని చూడగానే ఆ ఇల్లు ఎలా ఉందో ఇట్టే అర్థమైపోతుంటుంది. అందుకే తులపును ఎప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. వాస్తు ప్రకారం ఇంకా ఏమేం అనుసరించాలో తెలుసుకుందాం. లక్ష్మీదేవిని సంతోషంగా మన ఇంట్లోకి ఆహ్వానిద్దాం.హిందూ సాంప్రదా యంలో ప్రధాన ద్వారానికి ప్రత్యేకమైన స్థానం ఉంది.ఇంటి ముఖద్వారం లక్ష్మీదేవికి ఆహ్వానం పలికేలా ఉండాలి.ప్రధాన తలుపు గడపను ఆ ఇంటి ఆడపడుచుగా భావిస్తారు.మనం ఎక్కడ, ఏ పని కోసం వెళ్లినా తిరిగి ఇంటికి వస్తాం .మన చివరి మజిలీ ఇల్లు.ఇంటికి వచ్చినప్పుడు మనసు ప్రశాంతంగా ఉండాలి.చిరునవ్వును, నిశ్చింతను కలిగించాలి.లక్ష్మీదేవి నివాసం ఉండటం తోపాటు మనకు ఆహ్వానం పలికే చోటు ప్రధాన ద్వారం.ఇంటి ముఖ ద్వారం పక్కన ఒక చిన్న అద్దం అమర్చాలి. అద్దాలు దేవతలకు స్వాగతం పలుకుతాయి.

అంతే కాదు దుష్టశక్తులను దరిచేరనివ్వకుండా చేస్తాయి.ఒక చిన్న పాత్రలో నీళ్లు నింపి దానిలో కొద్దిగా గులాబి రేకులు వేసి ముఖద్వారం పక్కన ఉంచాలి.దీనివల్ల అందంతోపాటు సానకూల శక్తి వస్తుంది.ఒక చిన్న పన్నీరు బుడ్డిలో రోజ్ వాటర్ నింపాలి.ఇంట్లోకి అతిథులు వచ్చిన వెంటనే వారి మీద కాస్త చిలకరిస్తే వారికి మర్యాదగా ఆహ్వానం పలికినట్టు ఉంటుంది.పసుపు లేదా కుంకుమతో ఇంటి ముఖద్వారాన్ని చక్కగా అలంకరిం చుకోవాలి. దీనివల్ల లక్ష్మీదేవి ఇంట్లోకి నడిచివస్తు ంది. ఇంట్లోకి సానుకూల శక్తి కూడా సింహద్వారం నుంచే వస్తుంది.మనకు సంపద నిస్తుంది. వృద్ధిలోకి తెస్తుంది.అందుకే ముఖద్వా రం ఎంత శుభ్రంగా, అందంగా ఉంటే అంతగా కలిసివస్తుంది.స్వస్తిక్, ఓమ్ వంటి పవిత్ర చిహ్నాలను ఇంటి ముఖద్వారానికి అలంకరించాలి.ఈ చిహ్నాలు ఇంట్లోకి దుష్టశక్తులు రాకుండా అడ్డుకుంటాయి.ప్రశాంతంగా ఉండే వాతావ రణం లక్ష్మీదేవికి ఆహ్వానం పలుకుతుంది.ఇంటి గడప దగ్గర దీపం ఉంచాలి. లేదంటే లైటు అయినా ఉండాలి.ఇలా వెలుతురు ఉంటే లక్ష్మీదేవికి ఆహ్వానం పలికినట్లే. చీకటిని పారద్రోలి,

అజ్ఞానాన్ని అంతం చేస్తుంది.ఇంటి ముఖద్వారానికి గంట లేదా శంఖాన్ని అలంకరించాలి.గంట శబ్దం, శంఖం శబ్దం లక్ష్మీదేవికి ఆహ్వానం పలుకుతాయి.

## కరీంనగర్ మేయర్, 3 ఛైర్మన్ పీఠాలు బీజేపీవే

- అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడమే మా లక్ష్యం
- గెలిచే చోట కార్యకర్తలకే సీట్లు ఇస్తున్నాం
- గెలిచే అవకాశం లేనిచోట మాత్రమే ప్రత్యామ్నాయ నేతలకు టిక్కెట్లు
- టిక్కెట్ రాని వారికి నామినేటెడ్, పార్టీ పదవులతో న్యాయం చేస్తాం
- తొందరపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
- తప్పుడు ప్రచారాలు నమ్మకండి
- డివిజన్లలో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీని గెలిపించండి
- కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంఛార్జీలు, కన్వీనర్లు, కో కన్వీనర్ల సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



**చర్చ:-కరీంనగర్ బ్యూరో :**కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠంతోపాటు 3 మున్సిపాలిటీల్లో ఛైర్మన్ స్థానాలను బీజేపీ విజయం కైవసం చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సర్వేల్లో వెల్లడైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీని నమ్ముకుని కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకే టిక్కెట్ల విషయంలో అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ కార్పొరేషన్ లో 80 శాతంపైగా టిక్కెట్లు వారికే ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గెలిచే అవకాశం లేని మిగిలిన



స్థానాల్లో మాత్రమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆయా చోట్ల టిక్కెట్లు రాని బీజేపీ కార్యకర్తలు బాధపడాల్సిన అవసరం లేదన్నారు. నామినేటెడ్ పోస్టులతోపాటు పార్టీ పదవులిచ్చి వారికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. తొందరపడి ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈరోజు కరీంనగర్ లోని శుభం కన్వెన్షన్ లో కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంఛార్జీలు, కన్వీనర్లు, కో కన్వీనర్ల సమావేశం జరిగింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి, పార్టీ సీనియర్ నేతలు సాయిని మల్లేశం, గుజ్జ శ్రీను, ఇనుగొండ నాగేశ్వరరెడ్డి తదితరులు హాజర య్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కరీంనగర్ లో జరిగిన అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులవల్లనేనని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ఆగకూడదంటే బీజేపీకి ఓటేసి ఆశీర్వదించాలని కోరుతూ ఇంటింటికీ ప్రచారం చేయాలని కోరారు. మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తానని చెప్పారు. కరీంనగర్ కార్పొరేషన్ పై కాషా య జెండాను ఎగరేసే బాధ్యత కార్యకర్తలదేనన్నారు. టిక్కెట్ ఆశించి భంగపడిన కార్యకర్తలను

సముదాయించి డివిజన్ లో బీజేపీ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేసేలా చూడాలని కోరారు.

## శక్తివంతమైన షడష్టక యోగం.. వీరికి జాక్ పాట్ ఖాయం



వేద జ్యోతిషశాస్త్రంలో జనవరి 31వ తేదీన తెల్లవారుజామున బుధుడు మరియు బృహస్పతి ఒకదానికొకటి 150 డిగ్రీల దూరంలో ఉంటారు. దేవతల గురువుగా పరిగణించబడే బృహస్పతిని సంపదకు, అదృష్టానికి, వివాహానికి, శ్రేయస్సుకు సూచనగా భావిస్తారు. ఇక తెలివితేటలు, కమ్యూనికేషన్, వ్యాపారం వంటి వాటికి మార్గదర్శక శక్తిగా పరిగణించబడే గ్రహాలకు యువరాజు బుధుడు.షడష్టక యోగంతో వీరికి జాక్ పాట్ఈ రెండు గ్రహాల స్థానాలలో మార్పులు ద్వాదశ రాశుల వారి పైన ప్రభావాన్ని చూపిస్తాయి. బృహస్పతి ప్రస్తుతం మిధున రాశి లోను, బుధుడు మకర రాశిలోనూ ఉన్నారు. ఈ రెండు గ్రహాలు 150 డిగ్రీల వద్ద సంయోగం చెంది షడష్టక యోగాన్ని ఏర్పరుస్తాయి. దీని కారణంగా కొన్ని రాశుల వారికి అదృష్టం కలిసి వస్తుంది. వారికి జాక్పాట్ తగులుతుంది. ఆ రాశులను తెలుసుకుందాం.కర్కాటక రాశిక ర్కాటక రాశిలో బృహస్పతి 6వ ఇంట్లోను, బుధుడు ఏడవ ఇంట్లోనూ ఉన్నారు. దీని కారణంగా ఏర్పడిన షడష్టక యోగం అనేక రంగాలలో ఉన్నవారికి ప్రయోజనాలను తెస్తుంది. ఈ రాశి వారికి చాలా కాలంగా పెండింగ్లో ఉన్న పనులు పూర్తవుతాయి. ఆర్థిక లాభాల వనరులు వేగంగా పెరుగుతాయి. కర్కాటక రాశి వారు విదేశాలకు వెళ్లే అవకాశం ఉంది. ఈ రాశి వారు ఉన్నత విద్యను అభ్యసించాలనే కల నెరవేరుతుంది. జీవితంలో సంతోషం ఉంటుంది.కుంభరాశి

కుంభ రాశి వారికి బృహస్పతి మరియు బుధుల సంయోగం వల్ల ఏర్పడే షడష్టక యోగం కారణంగా లబ్ధి చేకూరుతుంది. వీరి ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. వ్యాపారంలో విజయాలు సాధిస్తారు. వ్యక్తిగత జీవితంలో మార్పులు వస్తాయి. పిల్లలకు సంబంధించిన సమస్యలు తొలగిపోతాయి. ఆధ్యాత్మికత పెరుగుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. సమాజ శ్రేయస్సు కోసం మంచి పనులు చేసే అవకాశం ఉంది.తులారాశితులా రాశి వారికి షడష్టక యోగం మంచి ఫలితాలను ఇస్తుంది. తులా రాశిలో బృహస్పతి 9వ ఇంట్లో, బుధుడు నాలుగవ ఇంట్లో ఉండడం వల్ల వీరికి అదృష్టం కలిసి వస్తుంది. ఈ సమయంలో తులా రాశి జాత కులు ఏ పని చేసిన విజయాలను సాధిస్తారు. బాకీలు తీరుతాయి. ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. విదేశాలకు వెళ్లే అవకాశం ఉంది. వ్యాపారాలు చేసే వారికి లాభాలు వస్తాయి. కుటుంబంతో నాణ్యమైన సమయాన్ని గడపవచ్చు. ఈ సమయంలో మీ ఆరోగ్యం బాగుంటుంది. ఈ సమయంలో మీ జీవనశైలిని, చూసుకోవాలి.

## జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ భాగంగా 58 మంది బాలకార్మికులకు విముక్తి : ఎస్పీ రోహిత్ రాజు

**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్లో భాగంగా 01.01.2026 నుండి 31.01.2026 వరకు జిల్లా వ్యాప్తంగా 05 ప్రత్యేక బృందాల ఆధ్వ ర్యంలో జిల్లాలోని వివిధ పరిశ్రమలు,వ్యాపార సముదాయాలలో దాడులు నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం ఐదు బృందాలను ఈ దాడులను నిర్వహించడానికి ఏర్పాటు చేయడం జరిగిందని,నెల రోజుల పాటు జరిగిన ఈ దాడులలో భాగంగా మొత్తం 58 మంది బాలకార్మికులను పట్టుకొని వారికి విముక్తి కలిగించడం జరిగిందని తెలిపారు .ఇందులో 09 మంది బాలికలు ఉండగా 49 మంది బాలురు ఉన్నారు.ఇందులో ఇతర రాష్ట్రాలకు చెందిన 04 బాలికలు, 27




మంది బాలురలను గుర్తించినట్లు తెలిపారు.బాలబాలికలను పనిలో పెట్టుకున్న యాజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.జిల్లాలో మొత్తం 36 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.ఆపరేషన్ స్మైల్ బృందం పట్టుకున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించడం జరిగిందని తెలియజేసారు.అనంతరం పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని వెల్లడించారు.జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనబడితే వెంటనే డయల్ 100 నకు గానీ 1098కి గానీ ఫోన్ చేసి పోలీస్ వారికి సమాచారం ఇవ్వగలరని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఆపరేషన్ స్మైల్ నకు డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి నోడల్ అధికారిగా వ్యవహ రించారు. ఆపరేషన్ స్మైల్ బృందంలో పనిచేసి బాలకార్మికులకు విముక్తి కలిగేలా బాధ్యతలు నిర్వర్తించిన షీటీం ఇన్స్పెక్టర్ రాము,ఆరెఎస్సై రమాదేవి,ఎస్సైలు విజయ, సతీష్ ,శ్రావణ్, రాఘవ య్య, సమ్మిరెడ్డి,లక్ష్మణ్,ఏఎస్సై నాగయ్య,పీసీలు మల్లికాంబ,రాంబాబులను ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలి..

- బీఎల్ఓలు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి
- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
- జిల్లాలో త్వరలోనే మ్యాపింగ్ పూర్తి చేస్తాం..
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి..

**చర్చ :-కరీంనగర్ బ్యూరో :**ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లాలని తద్వారా సత్వరమే మ్యాపింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ, తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా కలెక్టరేటు కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు.రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. 2002 వివరాలతో, ప్రస్తుత వివరాలు సరి పోల్చి మ్యాపింగ్ ప్రక్రియను తర్వాతగతిన పూర్తి చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ లు) తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. బిఎల్ఓ లు రోజువారీగా







చేపట్టి ప్రోజెని మ్యాపింగ్ వివరాలను తమకు అందిస్తూ ఉండాలని పేర్కొన్నారు. బిఎల్ఓ లకు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎబిఎల్ఓ లు సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా పోలింగ్ బూత్ లలో ఈ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురైతే సంబంధిత బూత్ లకు చెందిన బిఎల్ఓ లు అందరూ సమన్వయం చేసుకుంటే ఇబ్బందులు తొలుగుతాయని చెప్పారు. నిర్ణిత గడువులోగా ఈ ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియలో తప్పులు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 2002 ఓటర్ లిస్టు ప్రకారం కొత్త ఓటర్ లిస్టు మ్యాపింగ్ త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బిఎల్వోలతో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమై ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ పై సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ అర్బన్ లో మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎక్కడైతే మ్యాపింగ్ చేసుకొని వారు ఉంటారో వారిని వెంటనే మ్యాపింగ్ చేసుకునే విధంగా ప్రోత్సహిం చాలన్నారు. బి ఎల్ వో సూపర్వైజర్లు మ్యాపింగ్ తక్కువ ఉన్నచోట బీఎల్ఓ లతో కలిసి డోర్ టు డోర్ విజిట్ చేస్తూ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. మ్యాపింగ్ ప్రక్రియ లక్ష్యసాధనకు అధికారులంతా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్ కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కుందారపు మహేష్, రమేష్ బాబు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 1 నుంచి కొత్త రూల్స్

క్రెడిట్ కార్డుల వినియోగంపై బ్యాంకులు క్రమంగా కఠిన వైఖరి అవలంబిస్తున్నాయి. ముఖ్యంగా డిజిటల్ పేమెంట్లు, వినోదం, రవాణా, ఆన్లైన్ గేమింగ్ వంటి విభాగాల్లో పెరుగుతున్న ఖర్చులు, రిస్క్ను దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరి 1, 2026 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకురానున్నాయి. ఈ మార్పులు లక్షలాది క్రెడిట్ కార్డ్ యూజర్ల జేబుపై నేరుగా ప్రభావం చూపనున్నాయి. అయితే, అన్ని బెనిఫిట్స్ రద్దు కాలేదు. కొన్ని కీలక ఫీచర్లు యథాతథంగా కొనసాగనున్నాయి.

ఎంపిక చేసిన క్రెడిట్ కార్డులపై అందిస్తున్న కాంప్లిమెంటరీ మూవీ టిక్కెట్ బెనిఫిట్స్ను నిలిపివేస్తున్నట్లు ఐసీఐసీఐ బ్యాంక్ ప్రకటించింది. ఇప్పటి వరకు బుక్మైషో ద్వారా ఫ్రీ లేదా డిస్కౌంట్తో సినిమా టిక్కెట్లు పొందిన యూజర్లకు ఇక ఆ సౌకర్యం ఉండదు. ముఖ్యంగా వంటి కార్డులపై ఈ ఫీచర్ పూర్తిగా తొలగించనున్నారు.జతీవసఊ ఝుతీస రివార్డ్ పాయింట్లు కట్..క్యాబ్లు, మెట్రో, రైల్వే, ఇతర ట్రాన్స్పోర్ట్ సేవలకు క్రెడిట్ కార్డును వాడే వారికి కొత్త పరిమితులు విధించారు. ప్రీమియం కార్డులైన రూబిక్స్, సఫిరో, ఎమరాల్డ్ వంటి వాటిపై నెలకు గరిష్టంగా రూ. 20 వేల వరకు మాత్రమే రివార్డ్ పాయింట్లు లభిస్తాయి. ఇతర కార్డులపై ఈ పరిమితి రూ. 10 వేల వరకుగా నిర్ణయించారు. ఆ మొత్తాన్ని మించి ఖర్చు చేసినా, అదనపు రివార్డ్ పాయింట్లు మాత్రం రావు.ఇన్సూరెన్స్ చెల్లింపులపై ఊరటఅయితే, ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపుల విషయంలో మాత్రం యూజర్లకు రిలీఫ్ ఉంది. ×జ×జ× న్రూజా ాబజూవతీ ఝుజవతీ




జతీవసఊ ఝుతీస వినియోగదారులు గతంలో మాదిరిగానే రూ. 40 వేల వరకు బీమా ప్రీమియం చెల్లింపులపై రివార్డ్ పాయింట్లు పొందవచ్చు. ఈ విభాగంలో ఎలాంటి కోత లేదు.డ్రీమ్11, విూూ, రమ్మీ కల్చర్ వంటి ఆన్లైన్ గేమింగ్ ప్లాట్ఫామ్లకు క్రెడిట్ కార్డు ద్వారా డబ్బు జమ చేస్తే ఇప్పుడు అదనపు భారం పడనుంది.జనవరి 15, 2026 నుంచి ప్రతి గేమింగ్ లావాదేవీపై 2 శాతం ఛార్జీ వసూలు చేయనున్నారు. భవిష్యత్తులో మరిన్ని గేమింగ్ యాప్స్ను కూడా ఈ జాబితాలో చేర్చే అవకాశం ఉంది.క్రెడిట్ కార్డు ఉపయోగించి పేటీఎం, ఫోన్పే, అమెజాన్ పే, మొబిక్విక్, ఫ్రీఛార్జ్, ఓలామనీ వంటి వాలెట్లలో డబ్బు లోడ్ చేస్తే అదనపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

# మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కామెంట్స్

**చర్చ, ఖమ్మం:**ఖమ్మం నగరం 6, 7 డివిజన్లో రూ.150.00 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ఖమ్మం నగరం సుమారు 5 లక్షల జనాభాతో వేగంగా విస్తరిస్తోంది.రహదారులు, డ్రైనేజీ ప్రధాన సమస్యలని గుర్తించి అమృత్ పథకం కింద రూ.200 కోట్లు, యూజీడీ కింద రూ.250 కోట్లు మంజూరు చేశామని తెలిపారు.కొత్తగా విలీనమైన పంచాయతీల్లో రహదారులు, డ్రైన్లు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.రహదారుల విస్తరణ, డ్రైనేజీ పనులు పక్కాగా దీర్ఘకాలం ఉపయోగపడేలా చేస్తామని చెప్పారు.ఖాళీ స్థలాల్లో నీరు నిలవకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలను కోరారు.ఖమ్మాన్ని శుభ్రమైన పట్టణంగా, సౌకర్యాలున్న నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు.ఖమ్మంలో స్వామినారాయణ పాఠశాల ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.త్వరలో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు.



పేద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.ప్రతి ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.విద్య, వైద్యం మెరుగ్గా ఉండటంతో ఇతర జిల్లాల ప్రజలు కూడా ఖమ్మంలో స్థిరపడుతున్నారని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఖమ్మం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎంతవరకు వీలు ఉంటే అంతవరకు అభివృద్ధి చేస్తున్నాం... మౌలిక వసతులకు పెద్ద పీట వేస్తున్నాం.డ్రైనేజీ, అండర్ డ్రైనేజ్ కు ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నాం.రోడ్లు వెడల్పు చేస్తేనే అభివృద్ధి జరుగుతుంది.గోశాల కు రోడ్డు వెడల్పు చేస్తాం.
ముఖ్యమంత్రి గారి సహకారంతో అభివృద్ధి చేసుకుందాం.
సుఖశాంతులతో సంతోషంగా జీవించాలని కోరుకుంటున్న.
విద్య,వైద్యం అందుబాటులోకి తెచ్చాం.హైదరాబాద్ కంటే ఆసుపత్రులు, విద్యా వ్యవస్థను ఇక్కడ బలోపేతం చేస్తున్నాం.
ఖమ్మం లో నివసించాలని ఏపీ వాళ్ళు కూడా ఇక్కడికి వస్తున్నారు.మంత్రి వెంట కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డిఓ నరసింహారావు, మేయర్ నీరజ, పార్టీ నగర అధ్యక్షుడు దీపక్ చౌదరి, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు

# కేసీఆర్ ను తలుచుకుంటున్న మేడారం భక్తులు

- కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి, మంత్రులపై తీవ్ర విమర్శలు
- పత్రికలకే పరిమితమైన
కోట్ల రూపాయల మేడారం అభివృద్ధి
- ట్రాఫిక్ నియంత్రణలో పూర్తిగా విఫలమైన స్టార్ ఖాకీలు
- నిద్రనే కోరుకున్న టీజీఎస్ ఆర్టీసీ ఖాకీలు
- టన్నుల్లో బంగారం మొక్కులు ప్రసాదంగా 100 గ్రాములు
కూడా తిరిగి ఇవ్వక వాలంటీర్లు పెడుతున్న చిక్కులు
- గద్దెల వద్ద సెల్ఫీలతో స్టార్ లేని ఖాకీలు
- రోడ్డు ప్రక్కనే ఓపెన్ డ్రైనేజీల కంపు
- అందుబాటులో లేని టాయిలెట్లు
- బహిరంగ మూత్ర విసర్జనకు సిద్ధమవుతున్న స్త్రీలు



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**మేడారం జాతరలో ఏర్పడిన తీవ్రమైన అవ్యవస్థలను చూసి భక్తులు గత పాలకుడు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో కనిపించిన ప్రణాళిక, సమన్వయం ప్రస్తుతం పూర్తిగా కనిపించడంలేదని భక్తులు వ్యాఖ్యానిస్తున్నారు. కోట్లాది మంది భక్తులు వచ్చే మహా జాతరకు కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు.

**- కాంగ్రెస్ సీఎం, మంత్రులపై తీవ్ర విమర్శలు**
మేడారం జాతర నిర్వహణలో ప్రభుత్వ పర్యవేక్షణ లోపించిందని భక్తులు, స్థానికులు కాంగ్రెస్ ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం, మంత్రులు కేవలం ప్రకటనలకే పరిమిత మయ్యారని, క్షేత్రస్థాయిలో సమస్యలను పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**- పత్రికలకే పరిమితమైన కోట్ల రూపాయల మేడారం అభివృద్ధి**
మేడారం అభివృద్ధికి ఖర్చు చేసినట్లు ప్రకటించిన కోట్ల రూపాయలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. రహదారులు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల్లో ఎక్కడా అభివృద్ధి ఆనవాళ్లు కనిపించడంలేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు. నిధుల వినియోగంపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

**- ట్రాఫిక్ నియంత్రణలో పూర్తిగా విఫలమైన స్టార్ ఖాకీలు**
మేడారం జాతర ముగించుకుని స్వస్థలాలకు వెళ్లేందుకు బయలుదేరిన భక్తుల బస్సులను తాండ్వాయి మార్గంలో సుమారు ఎనిమిది గంటలపాటు నిలిపివేయడం పరిపాలనా నిర్లక్ష్యానికి స్పష్టమైన ఉదాహరణగా మారింది. రాత్రి 2 గంట నుండి ఉదయం 11 గంటల వరకు అడవి మార్గంలో బస్సులను నిలిపివేయడం ద్వారా ప్రజల ప్రాణ భద్రత, మౌలిక హక్కుల పట్ల పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాట్లు లేకుండా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలను గంటల తరబడి బస్సుల్లోనే ఉంచడం మానవీయతకు విరుద్ధమని, ఇది రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును ప్రత్యక్షంగా హరిస్తున్న చర్యగా పరిగణించాల్సి ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు, సమయ నియంత్రణ, అత్యవసర సేవల సమన్వయం వంటి ప్రాథమిక అంశాల్లో ఉన్నతాధికారులు విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా భద్రతను కాపాడాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ఈ స్థాయిలో నిర్లక్ష్యం ప్రదర్శించడం ఆమోదయోగ్యం కాదని, ఇంత పెద్ద స్థాయి జాతరలో ముందస్తు ప్రణాళిక లేకుండా వ్యవహరించడం పరిపాలనా వైఫల్యంగానే కాకుండా ప్రజా బాధ్యతల ఉల్లంఘనగా కూడా పరిగణించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మేడారం జాతరలో భక్తులు ఇంతటి అవస్థలు ఎదుర్కోవడం గమనార్హమని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

**- టీజీఎస్ ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యం ప్రజా సేవా విధులకు భంగం**

**- ప్రజా సేవా బాధ్యత ఉల్లంఘన:**
మేడారం జాతర నుంచి కొత్తగూడెం వెళ్లే బస్సులో విధులు నిర్వహించిన డ్రైవర్, కండక్టర్ ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం టీజీఎస్ ఆర్టీసీ ప్రజా సేవా బాధ్యతలకు విరుద్ధమని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**- మానవీయ అవసరాల నిరాకరణ:**
బస్సులో చిన్నపిల్లలు ఉన్నప్పటికీ దారి మార్గంలో టిఫిన్ సెంటర్ల వద్ద బస్సును ఆపాలని ప్రయాణికులు విన్నవించుకున్నా పట్టించుకోకుండా గమ్యం చేరే వరకు బస్సు ఆపకపోవడం మానవీయత లేని వ్యవహారంగా అభివర్ణిస్తున్నారు.

**- జీవించే హక్కుపై ప్రభావం (ఆర్టికల్ 21):** రాత్రి 2 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రయాణికులు ఎటువంటి అల్పాహారం లేకుండా ప్రయాణించాల్సిన పరిస్థితి కలగడం



రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కుకు భంగం కలిగించిన చర్యగా పరిగణించాల్సిన అవసరం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**- ప్రయాణికుల భద్రత పట్ల నిర్లక్ష్యం:**
దీర్ఘకాలం ఆకలి, నీరసం పరిస్థితుల్లో ప్రయాణికులను ఉంచడం ద్వారా వారి ఆరోగ్య భద్రతను ప్రమాదంలోకి నెట్టినట్లుగా మారిందన్న విమర్శలు ఉన్నాయి.

**- అధికార దుర్వినియోగ ఆరోపణలు:**
ప్రశ్నించిన ప్రయాణికులపై "మేము లోకల్ వాళ్ళం కాదు", "డిమాండ్ చేయవద్దు", "బస్సు నుంచి దింపేస్తాం" అంటూ బెదిరింపులకు పాల్పడటం ప్రభుత్వ ఉద్యోగుల హోదాకు తగని ప్రవర్తనగా పేర్కొంటున్నారు.

**- ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన:**
ప్రజలతో మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఆర్టీసీ ఉద్యోగులు రుబాబుగా మాట్లాడటం సేవా నియమావళికి విరుద్ధమని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

**- పరిపాలనా బాధ్యత నిర్ధారణ అవసరం:**
ఈ ఘటనపై టీజీఎస్ ఆర్టీసీ తక్షణమే స్పందించి, విధులలో నిర్లక్ష్యం వహించిన డ్రైవర్, కండక్టర్‌పై శాఖాపరమైన విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**- ప్రజలకు క్షమాపణ చెప్పాలన్న డిమాండ్:**
ప్రజలకు కలిగిన అసౌకర్యానికి టీజీఎస్ ఆర్టీసీ అధికారికంగా క్షమాపణ చెప్పి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**- టన్నుల్లో బంగారం మొక్కులు 100 గ్రాములు కూడా ఇవ్వక వాలంటీర్ల వ్యవహారం**

భక్తులు సమర్పించిన టన్నుల బంగారం మొక్కుల వ్యవహారంలో పారదర్శకత లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రసాదంగా కనీస పరిమాణంలోనైనా బంగారం తిరిగి ఇవ్వడంలో వాలంటీర్లు ఇబ్బందులు పెడుతున్నారని భక్తులు వాపోతున్నారు. ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్యగా అభివర్ణిస్తున్నారు.

**- గద్దెల వద్ద సెల్ఫీలతో బిజీ అయిన ఖాకీలు**
భద్రత, క్రమశిక్షణ పర్యవేక్షణ చేయాల్సిన పోలీసులు గద్దెల వద్ద సెల్ఫీలకు పరిమితమయ్యారన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. విధి నిర్వహణ కంటే ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలు ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి.
రోడ్డు పక్కనే ఓపెన్ డ్రైనేజీల దుర్గంధంమేడారం జాతర ప్రాంతంలో రోడ్ల పక్కన ఓపెన్ డ్రైనేజీలు భక్తులకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. దుర్గంధంతో పాటు ఆరోగ్య ప్రమాదాలు ఉన్నా సంబంధిత శాఖలు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. కోట్ల అభివృద్ధి మాటలు క్షేత్రస్థాయిలో మాత్రం నిర్లక్ష్యమేనని ఆరోపిస్తున్నారు.

**- అందుబాటులో లేని టాయిలెట్లు మహిళల అవమానం**
మహిళా భక్తులకు కనీస మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బహిరంగ మూత్ర విసర్జనకు మహిళలు సిద్ధమవ్వాల్సిన పరిస్థితి రావడం అత్యంత అవమానకరమని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి.

**- ప్రజల స్వేచ్ఛా గమనానికి అడ్డంకి:**
మేడారం నుంచి స్వస్థలాలకు బయలుదేరిన భక్తుల బస్సులను తాండ్వాయి మార్గంలో రాత్రి 2 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు నిలిపివేయడం ద్వారా ప్రజల స్వేచ్ఛా గమన హక్కును (ఆర్టికల్ 19) ఉల్లంఘించిన చర్యగా భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**- జీవించే హక్కుపై భంగం:**
మంచినీరు, మరుగుదొడ్లు, వైద్య సహాయం వంటి మౌలిక సౌకర్యాలు లేకుండా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలను గంటల తరబడి అడవి మార్గంలో నిర్బంధించడం రాజ్యాంగంలోని జీవించే హక్కు (ఆర్టికల్ 21)కు విరుద్ధమని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**- పరిపాలనా నిర్లక్ష్యం స్పష్టం:**
భారీ జనసందోహం ఉన్నప్పటికీ ముందస్తు ట్రాఫిక్ ప్లానింగ్, ప్రత్యామ్నాయ మార్గాల గుర్తింపు, సమయ నియంత్రణ వంటి ప్రాథమిక బాధ్యతలను ఉన్నతాధికారులు నిర్వర్తించకపోవడం పరిపాలనా వైఫల్యానికి నిదర్శనంగా మారింది.

**- పోలీస్ విధుల ఉల్లంఘన:**
ప్రజల భద్రత, సౌకర్యాల నిర్వహణ పోలీస్ చట్టం ప్రకారం కీలక బాధ్యత అయినప్పటికీ, బస్సులను అడవి మార్గంలో గంటల తరబడి నిలిపివేయడం ద్వారా విధి నిర్వహణలో ఘోర నిర్లక్ష్యం చోటుచేసుకున్నదన్న విమర్శలు ఉన్నాయి.

**- మానవ హక్కుల అంశంగా మారిన ఘటన:**
మలవిసర్జనకు కూడా వీలు లేకుండా ప్రజలను ఉంచడం మానవ గౌరవానికి విరుద్ధమని, ఇది మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాల్సిన పరిస్థితిని తీసుకొచ్చిందని పలువురు పేర్కొంటున్నారు.

**- బాధ్యత నిర్ణయించాల్సిన అవసరం:**
ట్రాఫిక్ నియంత్రణలో జరిగిన ఈ లోపానికి బాధ్యులైన అధికారులపై విచారణ చేపట్టి, బాధ్యత నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్న డిమాండ్ పెరుగుతోంది.

**- ప్రభుత్వంపై ప్రశ్నార్థకం:**
ఇంతటి స్థాయి జాతరలో ప్రజలు ఎన్నడూ లేని విధంగా అవస్థలు ఎదుర్కోవడం ప్రభుత్వ ప్రణాళికా లోపాన్ని బయటపెట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పరిపాలనా సామర్థ్యంపై తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## మేడారం జాతర ఎంతగానో మారింది

**రోడ్ల వెడల్పుతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగాయి**
**- ఈ సారి జాతరలో చైల్డ్ ట్రాక్ మేనేజ్‌మెంట్ సిస్టంతో సత్ఫలితాలు**
**- డీజీపీ శివధర్‌రెడ్డి.. తల్లులకు మొక్కులు**




**మేడారం(ములుగు):** అదివాసీల సహకారం తో పోలీసులు జాతరలో ఉత్సాహంగా విధులు నిర్వహించారని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. వనదేవతలను దర్శించుకున్న డీజీపీ.. కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించిన సీసీ పుటేజీల్లో జాతరలో భక్తుల రద్దీ, జాతరకు వచ్చే దారుల్లో ఉన్న ట్రాఫిక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే జాతరలో పిల్లలు, వృద్ధులు తప్పిపోతే అచూకీ తెలుసుకోవడానికి గత జాతరల్లో జాప్యం జరిగేదని,కానీ ఈ జాతరలో కొత్తగా చైల్డ్ ట్రాక్ మేనేజ్‌మెంట్ సిస్టం అనే కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టి పిల్లలు, వృద్ధుల చేతులకు హ్యాండ్ బ్యాండ్ పెట్టడం ద్వారా క్యూఆర్ కోడ్ ద్వారా తప్పిపోయిన పిల్లలు, వృద్ధులను కనుక్కోవడం సులువ గా మారిందన్నారు తద్వారా బాధితులతో పాటు పోలీస్‌శాఖకు సంతృప్తిని కల్గించం దన్నారు. పోలీస్‌శాఖలో విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న ట్రెయినీ ఐపీఎస్, డీఎస్పీలు పని నేర్చుకునేందుకు జాతరలో విధులు కేటాయించామన్నారు. తాను ట్రైనీ ఐపీఎస్‌గా ఉన్నప్పుడు మేడారం వచ్చానని, అప్పటికీ ఇప్పటికీ జాతరలో చాలా మార్పులు వచ్చా యన్నారు. జాతరకు వచ్చే అన్ని మార్గాల్లో రోడ్లను వెడల్పు చేసి, ట్రాఫిక్ జామ్ అయితే పక్క నుంచి పోయేందుకు ప్రత్యా మ్నాయ మార్గాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ జామ్‌కు అస్కారం లేకుండా పొయిందన్నారు. డ్రోన్ లను ఏర్పాటు చేయడం ద్వారా జాతరలో ప్రతీ మూలకు జరుగుతున్న కార్యకలాపాల ను పరిశీలించేందుకు అనువుగా మారిందన్నారు. డీజీపీ వెంట మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, వరంగల్, రామగుండం పోలీస్ కమిషనర్లు సన్‌ప్రీత్ సింగ్, అంబర్ కిషోర్ ఝా తదితరులు పాల్గొన్నారు

## ఘోరం ప్రియుడి భార్యను చంపేసిన ప్రియురాలు.





**నల్లగొండ, జనవరి 31:** జిల్లాలోని నాంపల్లి మండలం కేతేపల్లిలో దారుణం జరిగింది. ఓ మహిళ తన ప్రియుడి భార్యపై పెట్రోల్ పోసి నిప్పటించింది. నగేష్ భార్య మమత (25)ను వంపు సుజాత అనే మహిళ కిరాతకంగా హతమార్చింది. ఈ ఘటనలో ఆరు నెలల బాబుకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. కేతేపల్లి గ్రామానికి చెందిన కుందేళ్ల నగేష్‌కు అదే గ్రామానికి చెందిన సుజాతతో వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో నగేష్ భార్య మమతను సుజాత నిర్దాక్షిణ్యంగా చంపేసింది. మమతపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. మంటలకు తాళలేక మమత వీధిలోకి పరిగెత్తింది.చివరకు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించింది. ఈ ఘటనలో మమత చంటి బిడ్డకు కూడా మంటలు అంటుకుని.. తీవ్ర గాయాలయ్యాయి. బాబును వెంటనే చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బడ్జెట్‌లో తెలంగాణకు ఈ సారైనా ఊరట కలుగుతుందా

**హైదరాబాద్ :** రాష్ట్ర విభజన జరిగి పదేండ్లు దాటింది. తెలంగాణకు రావాల్సిన కీలక నిధులు, ప్రాజెక్టులు, అనుమతులు ఇంకా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే నిలిచిపోయాయి. దాదాపు 12 విభాగాలకు సంబంధించి 47 అంశాలు కేంద్రం వద్ద పెండింగ్?లో ఉన్నాయి. దీంతో బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం అనేక ఆశలు పెట్టుకుంది. హైదరాబాద్ చుట్టూ సుమారు 350 కి.మీ రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అనుమతులతో పాటు రూ.34,367 కోట్లు కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరింది. ఓఆర్?ఆర్? నుంచి ఆర్ఆర్ఆర్ "రేడియల్ రోడ్ల కోసం రూ.45,000 కోట్లు అవసరమవుతుంది. నుంచి కలుపుతూ కొత్తగా 10 రేడియల్ రోడ్ల అభివృద్ధి ప్రతిపాదలను సీఎం ఇప్పటికే కేంద్రానికి సమర్పించారు. వీటికి రూ.45,000 కోట్ల నిధుల మంజూరు కోరింది.హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణహైదరాబాద్ మెట్రో ఫేజ్--2 కోసం రూ.44,028 కోట్లు కోరింది. హైదరాబాద్ మెట్రో విస్తరణలో భాగంగా మెట్రో రైలు ఫేజ్--2 ప్రాజెక్టు కోసం ఫేజ్ 2ఏ, ఫేజ్ 2బీ ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్లో ఉన్నాయి.గోదావరి--మూసీ అనుసంధానం్న గోదావరి నుంచి మూసీకి నీటిని మళ్లించే లింక్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రూ.6,000 కోట్ల ఆర్థిక సాయం కోరింది వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ (ఖ+ఙ) ప్రాజెక్టుకు కేంద్ర నిధులుహైదరాబాద్ సమగ్ర మురుగు నీటి మాస్టర్ ప్లాన్ (ఆవీ=ఖు 2.0 / స్పెషల్ ప్రాజెక్ట్)బందర్ పోర్ట్ -- హైదరాబాద్ డ్రై పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ హైవే -- రూ.17,000 కోట్లు"బందర్ పోర్ట్" నుంచి హైదరాబాద్ సమీప డ్రై పోర్ట్ వరకు కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోదం. దాదాపు రూ.17 వేల కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టాలని కోరింది.విమానాశ్రయాల అభివృద్ధిఆదిలాబాద్, కొత్తగూడెం, బసంత్ నగర్ విమానాశ్రయాలు, ఇటీవలే వరంగల్ మామునూర్ ఎయిర్? పోర్ట్ లకు ఆమోదం తెలిపింది.రైల్వే కనెక్టివిటీ -- కొత్త తెలంగాణలో 8 కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్నాయి
వికారాబాద్--కృష్ణ కొత్త రైలు మార్గం, కల్వకుర్తి--మాచర్ల రైలు లైన్, గద్వాల్--దోర్నకల్ రైలు మార్గం కాచిగూడ--జగ్గయ్యపేట రైలు మార్గం, పటాన్‌చెరు--ఆదిలాబాద్ రైలు లైన్, బోధన్--లాతూర్ రోడ్ లైన్, అక్కన్నపేట బైపాస్ రైలు లైన్, పాండురంగాపురం--భద్రాచలం రోడ్ లైన

## ఐపీఎస్ వసుంధర యాదవ్.. మేడారం జాతరలో ట్రెండింగ్



**మేడారం** మహా జాతర ఇవాల్టితో ముగుస్తుంది. వనం వీడి జనం మధ్యకు వచ్చిన వనదేవతలు మూడు రోజుల పాటు భక్తుల పూజలందుకున్నారు. తిరిగి ఈ రాత్రి వనప్రవేశంతో మేడారం మహా జాతర పరిసమాప్తం కానుంది. ఇక మేడారంలో భక్తుల రదీ కొనసాగుతోంది. తెలంగాణ కుంభమేళా అని, ఆసియాలోకెల్లా అతి పెద్ద గిరిజన జాతర అని, ఇసకేస్తే రాలనంత జనసంద్రం అని.. ఈ ఉపమానాలన్నీ ఇన్నాళ్లూ చెప్పుకోవడం వినడం వరకే. ఇప్పుడవి రియాలిటీలో కనిపిస్తున్నాయి. రెండుకళ్లూ చాలనంత దివ్యంగా ఉంది మేడారం గద్దెల ప్రాంగణం.కాగా ఈసారి మేడారం జాతరలో లేడీ ఐపీఎస్ ఆఫీసర్ వసుంధర యాదవ్ తన డ్యాన్స్‌తో నెట్టింట వైరల్‌గా మారారు. గిరిజన డాన్స్‌తో నెటిజన్ల మనసులు గెలుచుకున్నారు. మినిస్టర్ సీతక్క, ములుగు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అక్కడ ఉన్న మిగతా సిబ్బందితో ఆమె చేసిన డ్యాన్స్ ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది. ఎంతో కష్టపడితే కానీ సివిల్స్ ర్యాంక్ రాదు. అదీ ఐపీఎస్ దక్కాలంటే ఎంతో పట్టుదల, క్రమశిక్షణ అవసరం. గొప్పగా చదివి, కరోర శిక్షణ దాటి.. బాధ్యతతో తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్న ఈ లేడీ ఆఫీసర్ గురించి.. కొందరు మేడారం మోనాలిసా.. కాస్త దిగజారి కామెంట్స్ చేస్తున్నారు. అలాంటివారు హద్దుల్లో ఉంటే మంచిద్.

నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక



# దర్శి మున్సిపల్ కమిషనర్ ఇంట్లో ఏసీబీ సోదాలు.అక్రమాస్తులపై ఆరా



**ప్రకాశం, జనవరి 31:** ప్రకాశం జిల్లా దర్శి మున్సిపల్ కమిషనర్ యాదల మహేశ్వర రావు ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి ఏసీబీ సోదాలు చేపట్టింది. దర్శి, నరసరావుపేటలోని మహేశ్వర రావు ఇళ్లలో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అలాగే ఆయన బంధువులు, స్నేహితుల నివాసాల్లోనూ సోదాలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడగట్టుకున్నారని మున్సిపల్ కమిషనర్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే సోదాలు కొనసాగుతున్నాయి.దర్శి, నరసరావుపేట, గుంటూరు, వినుకొండ, సత్తెనపల్లి ప్రాంతాల్లో ఆరు ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు ఏసీబీ అధికారులు. ఈ సోదాల్లో పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మహేశ్వర రావు ఎంత మొత్తంలో అక్రమార్జన చేశారన్న వివరాలను ఏసీబీ అధికారులు నేడు సాయంత్రం వెలువరించే అవకాశముంది.

# వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబుపై దాడికి యత్నం



**అమరావతి :** వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు పై శనివారం టీడీపీ శ్రేణులు దాడికి యత్నించారు. కర్రలు,రాడ్లతో గుంటూరు రోడ్లపై హంగామా సృష్టించారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారని చేసిన ఆరోపణపై విచారణ జరిపిన సీబీఐ అలాంటిదేమీ లేదని తేల్చి చెప్పింది. దీంతో తిరుమల లడ్డూపై చేసిన ఆరోపణలు ఖండిస్తూ వైసీపీ శనివారం రాష్ట్రవ్యాప్తంగా వేంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద పాప ప్రక్షాళన కార్యక్రమాన్ని నిర్వహించింది .ఈ కార్యక్రమానికి అంబటి రాంబాబు గుంటూరులోని గోరంట్లకు కారులో వెళ్తుండగా మార్గ మధ్యలో టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. ఒకరిద్దరూ టీడీపీ శ్రేణులు కారుపై చేతితో బాదారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా దాడి యత్నాన్ని ఆపలేకపోయారు. చివరకు పోలీసు బందోబస్తు మధ్య అంబటిని అక్కడి నుంచి బలవంతంగా పంపించి వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మూకలు రాష్ట్రంలో అరచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఉందా అంటూ ప్రశ్నించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే తనపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కర్రలు రాడ్లు పట్టుకుని తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

# ఏపీ అంతటా వైసీపీ ఆధ్వర్యంలో పాప ప్రక్షాళన పూజలు



**అమరావతి :** తిరుమల లడ్డూ లో జంతువుల కొవ్వు కలిసిందంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేసిన తప్పుడు ఆరోపణలపై వైసీపీ శనివారం పాప ప్రక్షాళన పూజలు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించింది .ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి నేతలు హిందువుల మనోభావాలతో ఆటలు ఆడుకున్నారని ఆరోపించారు. జంతువుల కొవ్వు కలపలేదని సీబీఐ కూడా తేల్చి చెప్పిందని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సీఎం, డిప్యూటీ సీఎం , మంత్రులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం సీతమ్మధార వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ మేయర్ హరి వెంకట కుమారి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. తిరుపతి లడ్డూపై తప్పుడు ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమికి మంచి బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నారు.

# ఆ ప్రభుత్వ అధికారి నియామకం చెల్లదు.




**అమరావతి, జనవరి 31:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రభుత్వ అధికారి నియామకంపై సంచలన ఆదేశాలు జారీ చేసింది. ఏపీ ప్రభుత్వ గతేడాది ఆగస్టు 6న పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా డాక్టర్ టి దామోదరనాయుడిని పునర్ నియమించింది. అయితే ఏపీ ప్రభుత్వం దామోదరనాయుడి నియామకంపై జారీ చేసిన ఉత్తర్వుల్ని హైకోర్టు రద్దు చేసింది. ఈ నియామకం నిబంధనలకు విరుద్ధమంటూ తీర్పు ఇచ్చారు. దామోదర్‌నాయుడు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన సంగతి తెలిసిందే. కానీ ఏపీ ప్రభుత్వం పదవీ విరమణ చేసిన దామోదరనాయుడిని మళ్లీ అదే పోస్టులు నియమించింది. గతేడాది 6న ప్రభుత్వం జీవో నంబర్ 285ను జారీ చేసింది.దామోదరనాయుడి నియామకంపై ఏపీ హైకోర్టు పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఈ నియామకాన్ని రద్దు చేయాలని ఏపీ పశుసంవర్ధక ఆఫీసర్స్ సర్వీసు అసోసియేషన్, ఏపీ పశు సంవర్ధక గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం, ఏపీ పశువైద్యుల అసిస్టెంట్ సర్జెన్స్ సర్వీసు అసోసియేషన్ అధ్యక్షులతో పాటుగా పశుసంవర్ధకశాఖ అదనపు డైరెక్టర్ కోరారు. పిటిషనర్ల తరఫున ఇద్దరు లాయర్లు వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం దామోదరనాయుడిని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా నియమించడం సరికాదని కోర్టులో వాదించారు. ఆయన నియామకంతో సీనియార్టీ ప్రకారం డైరెక్టర్ పోస్టుకు అర్హత ఉన్న అధికారులకు అన్యాయం జరుగుతుంది అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయనకు ఆ పోస్టు ఇచ్చారని కోర్టుకు తెలిపారు. ఈ వాదనల్ని విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్.. తీర్పును మాత్రం రిజర్వు చేశారు. తాజాగా పశు సంవర్ధకశాఖ డైరెక్టర్‌గా డాక్టర్ టి దామోదరనాయుడిని పునర్ నియామకాన్ని రద్దు చేస్తూ తీర్పును వెల్లడించారు.దామోదరనాయుడు గతేడాది జులై నెలలో పదవీ విరమణ చేశారు. అయితే ఆ వెంటనే ఆగస్టు 6న.. ఏపీ ప్రభుత్వం ఆయన్ను తిరిగి అదే పోస్టులు నియమించింది. ఏడాది పాటూ ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆయన పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే దామోదరనాయుడు పునర్ నియామకాన్ని సర్వీస్ పొడిగింపుగా గుర్తించమని.. ఉపాధి కల్పన కోసం చేపట్టే కొత్త నియామకంగా పరిగణిస్తామని ప్రభుత్వం తెలిపింది.

# అంబటిపై జగన్ వెంటనే చర్యలు తీసుకోవాలి: వర్ల రామయ్య




**అమరావతి:** వైసీపీ నేత అంబటి రాంబాబుపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ.. రాజకీయ పార్టీనా? లేక రౌడీల పార్టీనా? అంటూ ప్రశ్నలు సంధించారు. అంబటి రాంబాబు వ్యవహారం హద్దులు దాటిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుపై అంబటి ఉపయోగించిన భాష.. సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, అతడికి సంస్కారం లేదనడానికి ఇది నిదర్శనమని విమర్శించారు.ప్రజలకు ఇప్పటికే అంబటి ప్రవర్తన గురించి తెలుసని.. కానీ ఇంత అప్రాచ్యుడని రాష్ట్ర ప్రజలకు తెలియదన్నారు. చంద్రబాబు లాంటి నాయకుడిపై అశ్లీల పదజాలం ప్రయోగించినా.. ఆయన స్థాయిని ఏమాత్రం తగ్గించలేరని వర్ల రామయ్య అన్నారు. అంబటి వాడిన భాషను అతని కుటుంబ సభ్యులు సమర్థిస్తారా? లేక ఛీ కొడతారా? అనే ప్రశ్నను ప్రజల ముందుంచారు. ఇలాంటి వ్యక్తిని భరిస్తున్న కుటుంబ సభ్యుల సహనాన్ని అభినందించాల్సిందేనని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.గతంలో జగన్ శ్రీమతిపై నోరుజారిన టీడీపీ నేతపై వెంటనే కేసులు పెట్టి అరెస్ట్ చేసిన సందర్భాలను గుర్తు చేసిన వర్ల రామయ్య.. ఇప్పుడు అంబటి రాంబాబు విషయంలో జగన్ ఏం చర్యలు తీసుకుంటారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ అధ్యక్షుడిగా జగన్ వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోతే.. అంబటి వ్యాఖ్యలను జగన్ సమర్థించినట్లు భావించాల్సి వస్తుందని హెచ్చరించారు.టీడీపీ వర్గాలను రెచ్చగొట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలనే వైసీపీ ప్రయత్నాలు సాగవని వర్ల రామయ్య స్పష్టం చేశారు. అంబటి ప్రవర్తనకు ప్రజలు గత ఎన్నికల్లోనే తగిన బుద్ధి చెప్పారని, అయినా అతని తీరు మారకపోవడం సిగ్గుచేటన్నారు. అంబటి రాంబాబు లాంటి వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతల విషయంలో పోలీసులు ఎలాంటి రాజీ పడకూడదని వర్ల రామయ్య పేర్కొన్నారు.

# వైసీపీ ప్రచారం పూర్తిగా అసత్యం : మంత్రి పయ్యావుల కేశవ్



**అమరావతి, జనవరి 31:** టీటీడీ లడ్డూ కల్తీ వ్యవహారంలో వైసీపీకి ఎలాంటి క్లీన్ చిట్ రాలేదని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌స్పష్టం చేశారు. వైసీపీ తమకు క్లీన్ చిట్ వచ్చినట్లు చేసుకుంటున్న ప్రచారం పూర్తిగా అసత్యమని, దేవదేవుడి విషయంలో పాపం చేసి సంబరాలు చేసుకోవడానికి ఆ పార్టీ నేతలకు సిగ్గుండాలని విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం స్వామివారి లడ్డూ పవిత్రతను కాపాడేందుకు అనేక పకడ్బందీ నిబంధనలు పెట్టిందని.. కానీ, వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ నిబంధనలను సడలించి కల్తీకి బీజం వేసిందని అన్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలోనే 2022లో సీఎఫ్‌టీఆర్ఐ(సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) నెయ్యి పేరిట సరఫరా అయిన పదార్థాల్లో జంతు అవశేషాలు ఉన్నాయని నిర్ధారించిందని.. ఆ నివేదికను నాటి వైసీపీ ప్రభుత్వం తొక్కిపెట్టడంతో పాటు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మంత్రి విమర్శించారు. దేవుడి ప్రసాదానికి ముడిసరకు పంపిణీని ఆర్థిక అంశంగా మాత్రమే గత పాలకులు చూశారన్నారు. వైవీ సుబ్బా రెడ్డి పీఏ చిన్నప్పన్నకు హవాలా మార్గంలో వచ్చిన డబ్బు ఎవరెవరికి వెళ్లిందో తేలాల్సి ఉందన్నారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ల్యాబ్ అయిన ఎన్‌డీడీబీ(నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు) జంతు అవశేషాలు ఉన్నాయని నిర్ధారణ చేసిన అంశాన్నే సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారని.. ఇదే విషయం సిట్(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) అనుబంధ ఛార్జ్ షీట్ 35వ పేజీలో స్పష్టంగా ఉందని మంత్రి వివరించారు.వైసీపీ చెబుతున్నట్లుగా క్లీన్ చిట్ ఎక్కడ వచ్చిందో వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని పయ్యావుల కేశవ్ డిమాండ్ చేశారు. చేసిన తప్పుకు క్షమాపణలు కోరాల్సింది పోయి, తప్పే జరగనట్లు ప్రజలను మోసం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. చేసిన పాపానికి సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేస్తారా అంటూ ఫైర్ అయ్యారు. జరుగుతున్న విపరీత ప్రచారాలు చూసి తట్టుకోలేకే వాస్తవాలను ప్రజల ముందు పెడుతున్నామే తప్ప.. తిరుమల శ్రీవారి విషయంలో రాజకీయం ఉద్దేశం తమకు లేదని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.

# జగన్ అవినీతి మూలాల్లోంచి వైసీపీ పుట్టింది : మంత్రి గొట్టిపాటి రవికుమార్



**పశ్చిమగోదావరి, జనవరి 31 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి అవినీతి మూలాల్లోంచి పుట్టిన పార్టీ.. వైసీపీ అని ఎద్దేవా చేశారు. శనివారం భీమవరంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించి, పలు కార్యక్ర మాల్లో పాల్గొన్నారు. అక్కడి మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు.మహిళల సాధికారతకు ఎన్టీఆర్ కృషి..తెలుగు ప్రజలకు గుర్తింపు తెచ్చిన ఏకైక వ్యక్తి దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వ్యాఖ్యానించారు. మహిళలకు సమాన ఆస్తి హక్కు కల్పించి.. వారి సాధికారత కోసం ఎన్టీఆర్ కృషి చేశారని చెప్పుకొచ్చారు. సంక్షేమంలో ఎన్టీఆర్ స్ఫూర్తిని నేడు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ కొనసాగిస్తున్నారని తెలిపారు. వైసీపీ నాయకులు అసత్య ప్రచారా లతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు.వైసీపీ అసత్య ప్రచారం.తిరుమలకి ఉన్న గౌరవాన్ని వైసీపీ భ్రష్టుపటి ంచిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఫైర్ అయ్యారు. తిరుమల కల్తీ నెయ్యి విషయంలో వైసీపీ అసత్య ప్రచారం చేస్తోందని ఆగ్రహించారు. టీటీడీకి డిక్లరేషన్ సమర్పించడాన్ని జగన్ తుంగలో తొక్కారని దుయ్యబట్టారు. 70 శాతం పూర్తయిన పోలవరాన్ని నాశనం చేశారని ఫైర్ అయ్యారు. ఆంధ్రులకు రాజ ధాని లేకుండా చేసిన దుర్మార్గుడు జగన్ మోహన్ రెడ్డి అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఏపీ ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇ-సైకిళ్లపై రూ.10 వేల రాయితీ



**అమరావతి, జనవరి 31:** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూటమి ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇచ్చిం ది. ఇ-సైకిళ్లపై భారీ రాయితీ కల్పిస్తోంది. పర్యావరణ హితం కోసం ఈ ఇ- సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు అధికారులు వెల్లడిం చారు. ఈ మేరకు ఇప్పటికే ఈ-మోటో రాడ్స్ పరిశ్రమతో ప్రభు త్వం ఒప్పందం చేసుకుంది. కాగా, ఈ సైకిళ్లు ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 40 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తాయని అధికారులు తెలిపారు. అంతేకాకుండా ఈ సైకిళ్లను పంపిణీ చేయడంలో ఏపీ ప్రభుత్వం గిన్నిస్ రికార్డు సృష్టించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా చిత్తురూ జిల్లా కలెక్టర్ గిన్నీస్ సర్టిఫికెట్ అందుకున్నారు.రూ. 10 వేల రాయితీ. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాన్ని పర్యావరణ హితంగా మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఇ- సైకిళ్లను అందించా లని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కుప్పం ప్రాంతంలో ఇ-సైకిళ్లను ప్రవేశపెట్టారు. వాస్తవానికి ఒక్కో సైకిల్ ధర రూ. 35 వేలుగా ఉంది. కానీ ప్రభుత్వం రూ. 10 వేల రాయితీ ఇస్తుండ టంతో రూ. 25 వేలకే వీటిని సొంతం చేసుకోవచ్చు. ఇ- సైకిళ్ల పంపిణీలో గిన్నీస్ రికార్డు..కుప్పంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు.. లబ్ధిదారులకు ఇ- సైకిళ్లు పంపిణీ చేశారు. తూంసీలోని ప్రజావేదిక వద్దకు దాదాపు 3 కిలోమీటర్ల ఇ-సైకిల్‌పై ర్యాలీగా చేరుకున్నారు సీఎం చంద్రబాబు. కాగా, కుప్పంలో 24 గంటల వ్యవధిలో 5,555 ఇ- సైకిళ్ల పంపిణీ చేపట్టి చిత్తూరు జిల్లా గిన్నిస్ రికార్డు సాధించింది. దీంతో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు పత్రాన్ని చిత్తూరు జిల్లా కలెక్టర్ అందుకున్నారు. కాగా, కుప్పంలోనే ఈ ఇ-సైకిళ్లను ఇ-మోటరాడ్ అనే సంస్థ అసెంబుల్ చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. కొత్త చరిత్రకు కుప్పం శ్రీకారం చుట్టిందని చెప్పారు. కుప్పంలో 5,555 ఇ-సైకిళ్లు పంపిణీ చేసి చరిత్ర సృష్టించామని తెలిపారు. అయితే గిన్నిస్ రికార్డు వచ్చిందని కాదని.. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఇ- సైకిళ్లకు ఇంటిపై ఉత్పత్తయ్యే విద్యుత్‌తోనే ఛార్జింగ్ చేసుకోవచ్చని.. ఈ సూపర్ సైకిల్ పైసా ఖర్చు లేకుండానే దూసుకెళ్తుందని చెప్పారు. ఎన్నికల్లో సైకిల్‌కు ఓటేశారని.. అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించామని చెప్పారు సీఎం చంద్రబాబు.

# ఆరోజు పవన్ కళ్యాణ్ అన్న చేసిన సాయం జీవితాంతం గుర్తుంచుకుంటా



**అమరావతి, జనవరి 31:** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు మంత్రి నారా లోకేశ్. తాను మొదటి సారి పవన్‌ను కలిసిన సందర్భం గురించి చెప్పారు. సీఎం చంద్రబాబు అరెస్ట్ అయిన సమంయలో పవన్ తనతో మాట్లాడిన విధానం, తమ కుటుంబానికి అండగా ఉన్న విధానం తనపై ప్రభావం చూపించి ందన్నారు. అది తన జీవితాంతం గుర్తుపెట్టుకుంటానని లోకేశ్ అన్నారు. ఈ మేరకు కాకినాడ జేఎన్‌టీయూలో జరిగిన హలో లోకేశ్ కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు.జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ మధ్య అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి అమితమైన గౌరవం ఉంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో గెలిచాక ప్రమాణ స్వీకార కార్యక్రమంలో.. పవన్ కళ్యాణ్ వద్దంటున్నా నారా లోకేశ్ ఎంతో గౌరవంగా ఆయన కాళ్లకు నమస్కరించడం వాళ్లిద్దరి మధ్య ఉన్న అనుబంధానికి నిదర్శనం. తాజాగా పవన్ కళ్యాణ్ తమ కుటుంబానికి చేసిన సాయాన్ని నారా లోకేశ్ గుర్తుచే సుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌తో తన తొలి భేటీ గురించి చెప్పారు.కాకినాడ జేఎన్‌టీయూలో జరిగిన 'హలో లోకేష్' కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన చాలా కూల్‌గా సమాధానాలు ఇచ్చారు. ఈ క్రమంలో పవన్, లోకేశ్.. ఇద్దరూ సొంత అన్నదమ్ముల కంటే ఎక్కువ అనుబంధంతో మెలుగుతున్నారు.. అసలు మీ బంధం ఎప్పుడు, ఎక్కడ, ఎలా మొదలైంది? అని ఓ విద్యార్థి నుంచి ప్రశ్న వచ్చింది. దీనికి లోకేశ్ సమాధానమిస్తూ.. "తాను ఏపీలో 2014 ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత మొదటిసారి జనసేన అధినేతగా ఉన్న పవన్ కల్యాణ్‌ను కలిశాను. అప్పుడు సీఎం చంద్రబాబు ఆయన్ను డిన్నర్‌కు ఆహ్వానించారు. అప్పడే ఆయన్ను మొదటిసారి చూడటం.. అంతకుముందు సినిమాల్లోనే చూశా" అని లోకేశ్ తెలిపారు.అది నా జీవితాంతం గుర్తుపెట్టుకుంటా..ఆనాటి నుంచి తమ బంధం కొనసాగిందని నారా లోకేశ్ చెప్పుకొచ్చారు. అయితే చంద్రబాబును 2023 సెప్టెంబర్లో అరెస్ట్ చేసి రాజమండ్రి జైలుకు తరలించినప్పుడు.. పవన్ అక్కడికి వచ్చారని చెప్పారు. ఆరోజు పవన్ కళ్యాణ్ తనతో మాట్లాడిన విధానం, తమ కుటుంబానికి అండగా నిలిచిన విధానం తనపై ఎంతో ప్రభావం చూపిందన్నారు. దీన్ని తాను జీవితాంతం సందర్భంగా మాట్లాడుతూ.. అంతా బాగున్నప్పుడు అందరూ పలకరిస్తారని, అందరూ ఇంటికి వస్తారని విద్యార్థులతో లోకేశ్ అన్నారు. కానీ కష్టం వచ్చినపుడు చాలా తక్కువ మంది మనకు అండగా నిలబడతారు అని అన్నారు. అలాంటి వారే నిజమైన మిత్రులు అని విద్యార్థులకు లోకేశ్ చెప్పారు.కాగా, ఈ కార్యక్రమంలో తన జీవితంలోని పలు విషయాల గురించి నారా లోకేశ్ విద్యార్థులతో పంచుకున్నారు. తాను అమెరికా విద్యావిధానంలో చదివానని.. అక్కడ హాజరుకు కూడా మార్కులు ఉంటాయని చెప్పారు. మార్కుల కోసమైనా తాను కాలేజీ బంక్ కొట్టలేదని లోకేశ్ చెప్పారు. ఇక తనకు 90 శాతం అటెండెన్స్ ఉంటే.. తన భార్య బ్రాహ్మణికి వంద శాతం ఉండేదని కాలేజీ రోజులను లోకేశ్ గుర్తుచేసుకున్నారు.

# ఎన్‌సీపీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర పవార్ ఎన్నిక



**ముంబై:** దివంగత ఎన్‌సీపీ చీఫ్ అజిత్ పవార్ సతీమణి, రాజ్యసభ ఎంపీ సునేత్ర పవార్ ఎన్‌సీపీ శాసనసభాపక్ష నేత గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లెజిస్లేటివ్ బిల్డింగ్‌లో శనివారంనాడు ఎన్‌సీపీ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. సునేత్ర పేరును ఎమ్మెల్యే దిలీప్ వాల్సే పాటిల్ ప్రతిపాదించగా, ఎన్‌సీపీ మంత్రి ఛగన్ భుజ్‌బుల్ బలపరిచారు. అనంతరం ఏకగ్రీవంగా పార్టీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర ఎన్నికయ్యారు. అజిత్ పవార్ స్థానంలో రాష్ట్ర మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర పవార్ సాయంత్రం 5 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. దీంతో మహారాష్ట్రలో తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా ఆమె రికార్డు నెలకొల్పనున్నారు. సునేత్ర పవార్ 2024 లోక్‌సభ ఎన్నికల వరకూ అంతగా ప్రచారంలోకి రాలేదు. ఆ ఏడాది బారామతి నుంచి ఎన్‌సీపీ అభ్యర్థిగా ఆమె పోటీ చేశారు. అయితే ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే చేతిలో ఆమె ఓడిపోయారు. అనంతరం రాజ్యసభకు సునేత్ర ఎన్నికయ్యారు. అజిత్ పవార్ మరణాంతరం ఎన్‌సీపీ వర్గాలు విలీనం కానున్నాయనే ప్రచారం జరిగింది. మహాయుతి కూటమిలో సునేత్ర చేరుతారా లేదా అనేది తమకు తెలియదని ఎన్‌సీపీఎస్‌పీ, శరద్ పవార్ కుటుంబ సభ్యులు తెలిపారు. అజిత్ పవార్ కుటుంబం, పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా బీజేపీ సపోర్ట్ చేస్తుందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ వ్యాఖ్యానించారు. సునేత్ర ప్రమాణస్వీకారం విషయం మీడియా ద్వారానే తనకు తెలిసిందని శరద్ పవార్ మీడియాకు శనివారంనాడు తెలిపారు. ఎన్‌సీపీ, ఎన్‌సీపీఎస్‌పీ వర్గాలు విలీనం కావాలని అజిత్ పవార్ ఆశించారని, ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగుతాయని వివరించారు.

# బంగాల్‌లో టీఎంసీ సర్కార్ ఉంటే దేశానికే ముప్పు




**బంగాల్ :** బంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బంగాల్‌లో టీఎంసీ ప్రభుత్వం 'చొరబాటుదారులకు ఆశ్రయం' కల్పిస్తోందని, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేశ భద్రతనే పణంగా పెడుతోందని ఆయన మండిపడ్డారు. ఉత్తర 24 పరగణాల జిల్లా బరాక్‌పుర్‌లో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'మా, మట్టి, మనుష్' (అమ్మ, మట్టి, మనిషి) నినాదంతో అధికారంలోకి వచ్చిన మమత పాలనలో, నేడు ఆ మూడూ ప్రమాదంలో పడ్డాయని ఆయన ఎద్దేవా చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మమత ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, దేశ రక్షణ కోసం బంగాల్‌లో బీజేపీ జెండా ఎగరడం అత్యవసరమని అమిత్ షా తేల్చిచెప్పారు. 'మా, మట్టి, మనుష్', అన్నీ ప్రమాదంలోనే!మమత బెనర్జీ స్లోగన్‌ను ఉదహరిస్తూ అమిత్ షా విశ్లేషించారు. "మమత దీదీ 'మా, మట్టి, మనుష్' నినాదంతో అధికారంలోకి వచ్చారు. కానీ నేడు బంగాల్‌లో ఈ మూడూ సురక్షితంగా లేవు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు. వారికి భద్రత కరవైంది. బంగాల్ నేలను చొరబాటుదారులు మింగేస్తున్నారు. ఇక్కడి సామాన్య ప్రజలు మమత సిండికేట్ ఆగడాలతో, దోపిడీలతో నలిగిపోతున్నారు" అని షా విమర్శించారు. అమిత్ షా తన ప్రసంగంలో చొరబాట్ల అంశాన్ని ప్రధానంగా లేవనెత్తారు. ఇది కేవలం రాష్ట్ర సమస్య కాదని స్పష్టం చేశారు."బంగాల్‌లో చొరబాటుదారులు యథేచ్ఛగా వస్తున్నారు. ఇది ఇప్పుడు కేవలం బంగాల్ సమస్య కాదు, మొత్తం దేశ భద్రతకే ముప్పుగా మారింది. సరిహద్దుల్లో కంచె వేయడానికి భూమి ఇవ్వాలని కోర్టులు ఆదేశించాయి. అయినా సరే మమత ప్రభుత్వం సరిహద్దు భద్రతా దళానికి భూమి ఇవ్వడం లేదు. ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారు. ఎందుకంటే ఆ చొరబాటుదారులు టీఎంసీకి ఓటు బ్యాంకుగా మారారు" అని అన్నారు. "రాష్ట్రంలోని పోలీసులు, అధికారులు అక్రమ వలసదారులను అడ్డుకోవడం లేదు. నకిలీ పత్రాలు సృష్టించి వారిని దేశమంతటా పంపిస్తున్నారు. దీనివల్ల దేశంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి." అని ఆరోపించారు. రావణుడిలా అహంకారంమమత బెనర్జీ తీరును రామాయణంలోని రావణుడితో పోల్చుతూ షా వ్యాఖ్యలు చేశారు. "రాముడు సముద్రంపై వారధి కడుతున్నప్పుడు, ఈ భూమ్మీద నన్ను ఓడించ వారే లేరని రావణుడు అహంకరించి అనుకున్నాడు. కానీ ఏం జరిగిందో అందరికీ తెలుసు. మమత జీ, మీరు కూడా అలాగే అనుకుంటున్నారు. కానీ ఈసారి బీజేపీ సునామీని ఆపలేరు. వచ్చే ఎన్నికల్లో మాకు 50 శాతానికి పైగా ఓట్లు వస్తాయి. భారీ మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుంది" అని జోస్యం చెప్పారు. "కేంద్ర ప్రభుత్వం వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరపాలని నిర్ణయించింది. కానీ పార్లమెంటులో దీనిపై చర్చను టీఎంసీ ఎంపీలు అడ్డుకున్నారు. కేవలం చొరబాటుదారులను సంతోష పెట్టడానికే మమత ఇలా చేస్తున్నారు. వందేమాతరాన్ని వ్యతిరేకి ంచడం అంటే మోదీని వ్యతిరేకించడం కాదు, బంగాల్‌ను, భారతదేశ గౌరవాన్ని అవమానించడమే" అని మండిప డ్డారు.అవినీతి మంటలుబంగాల్‌లో అవినీతి ఏ స్థాయికి చేరిందో చెప్పడానికి ఇటీవలి అగ్నిప్రమాదాన్ని షా ఉదహరించారు. "ఇటీవల ఆనందాపుర్‌లోని మోమో ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం జరిగింది. అది ప్రమాదం కాదు, మమత సర్కార్ అవినీతి ఫలితం. ఆ ఫ్యాక్టరీ యజమానులను ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదు? వారు అధికార పార్టీకి సన్నిహితులు కాబట్టే వదిలేశారా? అసలు బంగాల్‌లో పరిపాలన ఉందా?" అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో అవినీతి మచ్చున్న మంత్రులకు టికెట్లు ఇవ్వొద్దని సవాల్ విసిరారు. టీఎంసీ బెదిరింపులకు మతువా నమశూద్ర వర్గాలు భయపడొద్దని షా ధైర్యం చెప్పారు. వారి ఓటు హక్కును ఎవరూ లాక్కోలేరని భరోసా ఇచ్చారు. బంగాల్‌లో 'దేశభక్తుల ప్రభుత్వాన్ని' స్థాపించడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# శాసనసభాపక్షనేతగా సునేత్ర పవార్- మహా డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం ఎప్పుడంటే



**మహారాష్ట్ర :** ఎన్‌సీపీ అధినేత, దివంగత అజిత్ పవార్ సతీమణి, రాజ్యసభ ఎంపీ సునేత్రా పవార్ మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమం త్రిగా ప్రమాణం చేసేందుకు రంగం సిద్ధమైంది. సాయంత్రం 5 గంటలకు ఆమె ప్రమాణం చేయనున్నారని అధికార వర్గాలు తెలిపాయి. శనివారం తెల్లవారుజామున బారామతి నుంచి ముంబయి చేరుకున్న సునేత్రా పవార్‌ను ఆ పార్టీ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరేలు సునేత్రా పవార్‌ను కలిశారు. ఆ తర్వాత మధ్యాహ్నం జరిగిన శాసనసభాపక్ష సమావేశంలో సునేత్రా పవార్‌ను ఎన్‌సీపీ నేతగా ఎన్నుకున్నారు. 2024 వరకు రాజకీయాలకు దూరంగా ఉన్న సునేత్రా పవార్ గతేడాది జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఎన్‌సీపీ తరఫున బారామతి నుంచి పోటీ చేసి ఎన్‌సీపీ-ఎస్‌పీ వర్గం అధినేత శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత ఎన్?సీపీ తరఫున రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఉపముఖ్యమంత్రిగా సునేత్ర పవార్! మరోవైపు, ఎన్‌సీపీ మహారాష్ట్ర యూనిట్ చీఫ్ సునీల్ తట్కరే మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ నాయకులు, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌ను కలిసి సునేత్ర పవార్‌ను శాసనసభాపక్ష నాయకురాలిగా నియమిస్తూ జారీ చేసిన లేఖను అందజేస్తారని పేర్కొన్నారు. శాసనసభాపక్ష సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు జరిగిందని, ఆ సమావేశంలో ఆమెను నాయకురాలిగా ప్రకటించామని చెప్పారు. మరోవైపు, ఎమ్మెల్యేల పార్టీ సమావేశానికి ముందు, ఎన్‌సీపీ నాయకులు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే దివంగత అజిత్ పవార్ అధికారిక నివాసంలో సునేత్ర పవార్‌ను కలిశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితిపై ఆమెతో చర్చలు జరిపారు. శాసనసభాపక్ష సమావేశానికి ముందు ఎన్‌సీపీ నాయకులు దివంగత అజిత్ పవార్‌కు నివాళులర్పించారు. అలాంటి పరిస్థితుల్లోనూ వారు అవకాశాల కోసం చూస్తున్నారు! ఇదిలా ఉండగా, శివసేన నాయకుడు సంజయ్ రౌత్ అధికార బీజేపీపై విమర్శలు గుప్పించారు. ఎన్‌సీపీ అధినేత, మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణంలోనూ బీజేపీ అవకాశాల కోసం చూస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అజిత పవార్ భార్య సునేత్రా పవార్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేసే ప్రస్తావనపై మట్లాడానికి ఆయన నిరాకరించారు. "అజిత్? పవార్ సంతాప దినాలతో బీజేపీకి సంబంధం లేదు. వారు అంతటి బాధాకరమైన పరిస్థితిలో ఉన్నా, వారు మాత్రం అవకాశాల కోసం ఎదురుచూ స్తున్నారు. ఈ విషయం గురించి మాట్లాడానికి ఇది సరైన సమ యం కాదు. సంతాప దినాలు ముగిసిన తర్వాత నేను ఈ విష యం గురించి చర్చిస్తాను." అని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. మరోవైపు, ఉప ముఖ్యమంత్రి విషయంపై శరద్ పవార్ చేసిన వ్యాఖ్యల గురించి విలేకరి ప్రశ్నించారు. ఆ సమాచారం కేవలం బీజేపీ అగ్రనాయకులు లేదా ఎన్‌సీపీ నాయకులకు తెలిసి ఉండవచ్చని ఆయన చెప్పారు. విలీనానికి అజిత్ అనుకూలంగా ఉండేవారు! అంతకుముందు, ఎన్‌సీపీ నాయకుడు అజిత్ పవార్ ఆకస్మిక మరణం నేపథ్యంలో మహారాష్ట్ర రాజకీయాల్లో తదుపరి పరిణామాలపై తీవ్ర చర్చ నడిచింది. ఈ క్రమంలో అజిత్ పవార్ చిన్నాన్న శరద్ పవార్ స్పందించారు. ఎన్‌సీపీ రెండు వర్గాలు విలీనానికి అజిత్ అనుకూలంగా ఉండేవారని గుర్తుచేసుకున్నారు. అయితే, విలీనంపై అంతకుముందే చర్చలు జరిగాయని, ఫిబ్రవరి 12న రెండు వర్గాలు కలిసిపోవాలని అజిత్ కోరుకున్నాడని వెల్లడించారు. కానీ, దురదృష్టవశాత్తూ విమాన ప్రమాదంతో ఆ చర్చలు ఆగిపోయాయని వ్యాఖ్యానించారు. ఎహారాష్ట్రలో అధికారిక కూటమి మహాయుతిలో ఎన్‌సీపీ భాగం. ఇప్పుడు అజిత్ పవార్ స్థానంలో సునేత్ర డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేస్తే ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె నిలుస్తారు. శనివారం సాయంత్రం కార్యక్రమం జరగనుందని, ఇందులో ఎన్‌సీపీ (ఎస్‌పీ) నేత శరద్ పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలే పాల్గొనకపోవచ్చని సమాచారం.


# నాకు తెలియదు సునేత్రకు డిప్యూటీ సీఎంపై శరద్ పవార్



**మహారాష్ట్ర :** మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా దివంగత అజిత్ పవార్ సతీమణి, రాజ్యసభ ఎంపీ సునేత్ర పవార్ ప్రమాణ స్వీకారం చేయడంపై ఎన్‌సీపీ-ఎస్‌సీపీ అధినేత శరద్ పవార్ స్పందించారు. ఆ విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదని ఆయన స్పష్టం చేశారు. తనకు కూడా మీడియా ద్వారానే విషయం తెలిసిందని పేర్కొన్నారు. శనివారం బారామతిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పలు వ్యాఖ్యలు చేశారు. ఎన్‌సీపీకి చెందిన రెండు వర్గాలు ఏకమవ్వాలన్నదే అజిత్ పవార్ ఆశయమని తెలిపారు. 'ప్రమాణ స్వీకారం గురించి మాకు ఎలాంటి సమాచారం లేదు. మీడియాలో వచ్చిన వార్తల ద్వారానే మేము తెలుసుకున్నాం. ఆ విషయంపై నాకు ఏమీ తెలియదు. ఈ నిర్ణయం పార్టీ స్థాయిలో తీసుకుని ఉండవచ్చు. ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే వంటి కొందరు నేతలు ఈ అంశంలో చొరవ తీసుకున్నారు అనుకుంట. వారు ఏదో నిర్ణయం తీసుకుని ఉండవచ్చు' అని శరద్ పవార్ తెలిపారు. అజిత్ పవార్ మరణం అనంతరం వెంటనే రాజకీయ నిర్ణయాలు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించగా, ముంబయిలోని మహాయుతి ప్రభుత్వ నేతల స్థాయిలో నిర్ణయాలు జరుగుతున్నాయని శరద్? పవార్ తెలిపారు. 'కుటుంబంలో ఏదైనా సమస్య వస్తే కుటుంబం మొత్తం కలిసే ఉంటుంది. కుటుంబంలో ఎలాంటి సమస్యలు లేవు. ఈ చర్చలన్నీ ఇక్కడ జరగడం లేదు. అవన్నీ ముంబయిలోనే జరుగుతున్నాయి. ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే సహా ఇతర సీనియర్ నేతలు ఈ అంశాలపై చర్చిస్తున్నారు. జరుగుతున్న పరిణామాలు అవన్నీ వారి తీసుకున్న నిర్ణయాల్లాగే కనిపిస్తున్నాయి. దీనిపై నేను వ్యాఖ్యానించను' శరద్ పవార్ అన్నారు. అజిత్ పవార్ కోరిక నెరవేరాలని భావిస్తున్నట్లు శరద్ పవార్ తెలిపారు. 'అజిత్ పవార్, శశికాంత్ శిందే, జయంత్ పాటిల్ రెండు వర్గాల విలీనంపై చర్చలు ప్రారంభించారు. విలీనానికి తేదీ కూడా నిర్ణయించారు. ఫిబ్రవరి 12న విలీనం జరగాల్సి ఉంది. అయితే, ఆ తేదీకి ముందే అజిత్ మనలను విడిచి వెళ్లిపోయారు అజిత్ పవార్ ప్రజా సమస్యలను లోతుగా అర్థం చేసుకుని, వారికి న్యాయం దక్కేలా పనిచేసేవారు. బారామతి ప్రజలు ఎప్పుడూ ఆయనకు అండగా నిలిచారు. ఆయన తన బాధ్యతల్లో ఎప్పుడూ వెనుకాడలేదు. ఆయన మృతి మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. ఈ పరిస్థితుల్లో మనం ధైర్యంగా ముందుకు సాగాలి. ప్రజల బాధలు తగ్గించే దిశగా పనిచేయాలి. ఆయన అనుసరించిన విలువలు, విధానాలను కొనసాగించాలి. ఆయన కుటుంబంలోని కొత్త తరం తప్పకుండా ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తుందని నాకు నమ్మకం ఉంది' అని శరద్ పవార్ అన్నారు. ఇక రెండు ఎన్‌సీపీ వర్గాల విలీనమైతే ఎన్‌డీఏలో చేరుతారా? అని అడగ్గా, ఇవన్నీ మీడియా వైపు జరుగుతున్న చర్చలే అని ఇక్కడ అలాంటిదేమి లేదని శరద్ పవార్ స్పష్టం చేశారు.. ఈనెల 27న జరిగిన విమాన ప్రమాదంలో ఎన్?సీపీ అధినేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. దీంతో ఎన్‌సీపీ రెండువర్గాలు విలీనమయ్యే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరిగింది. అయితే అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనుండటంతో ఎన్?సీపీ వర్గాల విలీనం దాదాపు లేనట్లే అనే తెరపైకి వచ్చింది.

అయితే సునేత్రా పవార్ మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఆమె తన కుమారుడితో కలిసి దక్షిణ ముంబయిలోని దేవగిరి నివాసానికి చేరుకున్నారు. శనివారం మధ్యాహ్నం సమావేశం కానున్న ఎన్?సీపీ శాసనసభాపక్షం, సునేత్రాపవార్‌ను తమనేతగా ఎన్నుకోనుందని ఆ పార్టీ సీనియర్ నేత ఛగన్ బుజ్‌బల్ తెలిపారు. అజిత్ పవార్ కుటుంబం, ఎన్?సీపీ ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు బీజేపీ మద్దతు ఉంటుందని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. కష్టకాలంలో అజిత్ పవార్ కుటుంబానికి, ఎన్?సీపీకి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏ సభలోనూ సభ్యురాలు కానీ సునేత్రా పవార్ అజిత్ పవార్ మృతితో ఖాళీ అయిన బారామతి ఉప ఎన్నికలో పోటీ చేసే అవకాశం ఉంది.

# ఈసారి నేను అసెంబ్లీలో అడుగుపెట్టడం ఖాయం



**చెన్నై:** డీఎండీకే ఫీనిక్స్ పక్షి లాంటిందని, పడిలేచిన కెరటంలా మళ్ళీ పైకొస్తుందని, ఈసారి తాను అసెంబ్లీలో అడుగుపెట్టడం తథ్యమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత ధీమా వ్యక్తం చేశారు. తెన్‌కాశి జిల్లా ఆలంకులం వద్ద రోడ్‌షోలో ఆమె మాట్లాడుతూ డీఎండీకే ఫినిక్స్ పక్షి లాంటిదని అలాగే తమ పార్టీ సుస్థిరంగా ఉంటుందన్నారు. విజయకాంత్ ముఖ్యమంత్రి అయ్యుంటే ఐదేళ్లపాటు పరిపాలించి ప్రజలకు సేవలందించి ఉండేవారని, అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రజలందరి హృదయాల్లో శాశ్వతస్థానం సంపాదించుకున్నారన్నారు. పార్టీ శ్రేణులంతా ఎదురుచూస్తున్నట్లే త్వరలో ఓ మంచి కూటమిలో పార్టీ స్థానం సంపాదించుకుని ఎన్నికల్లో విజయ ఢంకాను మోగిస్తుందని ఆమె పేర్కొ న్నారు. ఆలంకులం వద్ద తనకు స్వాగతం పలుకుతూ అసెంబ్లీ ముందు తాను నిలిచి ఉన్నట్లు బ్యానర్‌ను పోలీసులు తొలగించారని, బ్యానర్ తొలగించినంత మాత్రానా తాను అసెంబ్లీకి వెళ్ళలేనా అని ప్రశ్నించారు. పార్టీ యువజన విభాగం కార్యదర్శి విజయ ప్రభాకరన్ కూడా ప్రసంగించారు

# పశ్చిమ బెంగాల్‌లో కూలిన వంతెన మమతా ప్రభుత్వంపై బీజేపీ ఫైర్



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఒక బ్రిడ్జి కూలిపోయింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. ఈ సంఘటన నేపథ్యంలో సీఎం మమతా బెనర్జీ ప్రభుత్వంపై బీజేపీ మండిపడింది. ఆ రాష్ట్రంలో కూలిన వంతెనల జాబితాను బయటపెట్టింది. ) పశ్చిమ బెంగాల్‌లోని కూచ్ బెహార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం సీతల్‌కుచి బ్లాక్‌లోని దేబ్‌నాథ్‌పారా ప్రాంతంలో ఒక వంతెన కూలిపోయింది. పాత వంతెనపై భారీ వాహనం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు.కాగా, అధికార తృణముల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వంపై బీజేపీ మండిపడింది. మమతా బెనర్జీ పాలనలో పలు వంతెనలు కూలినట్లు ఆరోపించింది. మఝేర్‌హాట్ వంతెన, వివేకానంద ఫ్లైఓవర్, ఉల్టాడంగా ఫ్లైఓవర్, మంగంజ్ కెనాల్ వంతెన, కాక్‌ద్వీప్ వంతెనతో సహా పలు ప్రధాన బ్రిడ్జీలు కూలడాన్ని ప్రస్తావించింది. 'మమత పాలనలో చాలా వంతెనలు నరకానికి దారులుగా మారాయి' అని ఎక్స్ పోస్ట్‌లో బీజేపీ విమర్శించింది.

# బలూచిస్తాన్‌లో బీఎల్‌ఏ కాల్పులు 10 మంది పాక్ పోలీసులు, 37 మంది బీఎల్‌ఏ ఉద్యమకారులు మృతి



**పాకిస్తాన్ :** ఆధీనంలో ఉన్న ప్రత్యేక ప్రాంతం బలూచిస్తాన్‌లో ఆ ప్రాంతానికి చెందిన తిరుగుబాటు సంస్థ బీఎల్‌ఏ (బలూచ్ లిబరేషన్ ఆర్మీ) పాక్ భద్రతా సిబ్బందిపై దాడులకు దిగింది. దీంతో పాక్ పోలీసులు కూడా ఎదురుదాడులకు దిగారు. ఈ కాల్పుల్లో 10 మంది పాక్ పోలీసులు మరణించగా, 37 మంది వరకు బీఎల్‌ఏ ఉద్యమకారులు మరణించినట్లు తెలుస్తోంది. బలూచిస్తాన్ ప్రాంతంలోని ఐదు జిల్లాలకు చెందిన 12 ప్రదేశాల్లో, ఏకకాలంలో 'ఆపరేషన్ హీరోఫ్' పేరుతో బీఎల్‌ఏ దాడులకు దిగింది. పాకిస్తాన్ ఆర్మీ, భద్రతా సిబ్బందిపై గన్స్, ఇతర ఆయుధాలతో దాడి చేయడంతోపాటు ఆత్మాహుతి దాడులకు దిగింది. క్వెట్టా, మాస్తంగ్, నుష్కి, పస్ని, గ్వాదర్ జిల్లాల్లో బీఎల్‌ఏ దాడులు చేసింది. దీంతో పాక్ సిబ్బంది కూడా ఎదురు కాల్పులకు దిగి, బీఎల్‌ఏ దాడుల్ని తిప్పికొట్టారు. దీంతో ఇరువైపులా పలువురు హతమయ్యారు. 10 మంది పాక్ సిబ్బంది, 37 మంది బీఎల్‌ఏ తిరుగుబాటుదారులు మరణించారు. ఈ దాడులు చేసింది తామేనని బీఎల్‌ఏ ప్రకటించుకుంది. మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని బీఎల్‌ఏ ఈ దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఘటనల్లో సాధారణ ప్రజలు ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని పాక్ సిబ్బంది తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ దాడులపై పాక్ అధికారు స్పందిస్తూ.. బీఎల్‌ఏ సమన్వయంతో దాడులు చేసినప్పటికీ.. సరైన స్థాయిలో అమలు చేయలేదన్నారు. భద్రతా సిబ్బంది వేగంగా స్పందించడం వల్ల నష్ట తీవ్రత తక్కువగా ఉందని పాక్ అధికారులు తెలిపారు. పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో కొన్నేళ్లుగా తిరుగుబాటు ఉద్యమం నడుస్తోంది. పాకిస్తాన్ నుంచి వేరుపడాలని కోరుతూ బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ కొన్నేళ్లుగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో దళాలలకు, బీఎల్‌ఏకు మధ్య నిరంతరం ఘర్షణ కొనసాగుతూనే ఉంది.

# ఇతర దేశాల నుంచి అప్పులు తెచ్చాం చాలా సిగ్గుగా అనిపించింది: పాక్ ప్రధాని

**పాకిస్థాన్ :** చాలా కాలంగా ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతున్న పాకిస్థాన్ అప్పులతోనే నెట్టుకొస్తోంది. మిత్రదేశాల నుంచి రుణాలు తీసుకుని కాలం గడుపుతోంది. ఈ అప్పుల గురించి పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ తాజాగా మాట్లాడారు. మిత్ర దేశాలకు వెళ్లి అప్పులు అడగడం చాలా సిగ్గుగా అనిపించిందని అందరి ముందు ఆయన అంగీకరించారు. తాజాగా ఇస్లామాబాద్‌లో ఎగుమతిదారులు, వ్యాపారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు 'ఆర్మీ చీఫ్ మునీర్, నేను కలిసి రహస్యంగా మిత్ర దేశాల వద్దకు వెళ్లి అప్పులు అడిగాం. అలా అడగడం నాకు చాలా సిగ్గుగా అనిపించింది. ఎవరి దగ్గరైనా అప్పులు తీసుకోవడం ఆత్మగౌరవానికి పెద్ద దెబ్బ. వారు ఏమి డిమాండ్ చేసినా సరే.. అంగీకరించి తీరాల్సిందే. అయితే చాలా దేశాలు రుణాలు ఇచ్చే విషయంలో నిరాశపరచలేదు. పరిస్థితులతో సంబంధం లేకుండా పాక్‌కు మద్దతుగా నిలిచిన సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, చైనా వంటి దేశాలకు ధన్యవాదాలు' అని షరీఫ్ వ్యాఖ్యానించారుపాకిస్థాన్‌కు ఆర్థిక సహాయం చేసిన దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉందని షరీఫ్ అన్నారు ). ఇతర దేశాల నుంచి అప్పులు తీసుకోవాల్సి రావడంపై షరీఫ్ గతంలో కూడా నిరాశ వ్యక్తం చేశారు. అయితే పాక్ ఆర్థిక పరిస్థితి ప్రకారం అప్పులు చేయక తప్పని పరిస్థితి నెలకొందని గతంలో అసహాయత వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోవడం గురించి ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, రాజకీయ కక్షసాధింపు చర్యలను నిరసిస్తూ రేపు రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ నేతలు పిలుపునిచ్చారు.



**మహేశ్వరం ప్రతినిధి :** కేసీఆర్ పై రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త నిరసనల కు బిఆర్ఎస్ పిలుపు రేపు మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డీ శాంతియుతంగా ఎక్కడి కక్కడ నిరసన కార్యక్రమాలు రేపు రాష్ట్రంలోని 12,000 పైచిలుకు గ్రామాల్లో ప్రభుత్వ దిష్టి బొమ్మల దహన కార్యక్రమాలు ప్రతి మున్సిపల్ మరియు నియోజకవర్గ కేంద్రాల్లో మోటార్ సైకిల్ ర్యాలీలు, నల్ల జెండాలతో నిరసనలు, ధర్నాలు మరియు రాస్తారోకోలు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, రాజకీయ కక్షసాధింపు చర్యలను నిరసిస్తూ రేపు రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ సీనియర్ నేతలు మాజీ మంత్రులు మధుసూదనాచారి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి,

## సీఎం కప్ శంకరపట్నం మండల స్థాయి క్రీడలు



**శంకరపట్నం జనవరి/31:** శంకరపట్నం మండల స్థాయి క్రీడ పోటీలు ఫిబ్రవరి 02. 02. 2026, సోమవారం రోజున జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేశవపట్నంలో జరుగుతాయని ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. మండలంలోని వివిధ క్లస్టర్లో కేశవపట్నం, తాడికల్, కొత్తగట్టు, కన్నాపూర్, మెట్పల్లి, గద్దపాక, మొలంగూర్ క్లస్టర్స్ నుండి ఎంపికైన మహిళలు, పురుషులు క్రీడాకారులు తమ యొక్క రిజిస్ట్రేషన్ ఫారం తో పాటు ఆధార్ కార్డును జతపరిచి మండల స్థాయిలో ఉదయం 9 గంటలకు పాల్గొనాలని ఎంపీడీవో గోల్కొండ కృష్ణ ప్రసాద్ అన్నారు. మండల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆడెపు శ్రీనివాస్ వ్యాయామ ఉపాధ్యాయులు గారిని సంప్రదించగలరని తెలిపారు.

## కేశవపట్నం సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తుల కోసం 108 సేవలు అభినందనీయం




**శంకరపట్నం జనవరి/31:** శంకరపట్నం మండలంలోని కేశవపట్నం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా విచ్చేసిన భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని 108 అంబులెన్స్ ను ప్రోగ్రామ్ మేనేజర్ భూమా నాగేందర్ మరియు జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ ఆదేశాల మేరకు నాలుగు రోజులపాటు జరిగే మహా జాతరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా 24 గంటల పాటు 108 అంబులెన్స్ సిబ్బంది. విధులు చాలా బాగా నిర్వహించారని భూమా నాగేందర్ సంతోషం వ్యక్తం చేశారు. సయ్యద్ ఇమ్రాన్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో 108 ఈఎంటి గూడూరి సతీష్ రెడ్డి మరియు పైలట్ కాజా కాలీలుల్లా పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్స్ యాప్ ద్వారానే ఫర్టిలైజర్ కొనాలి

**పెద్ద శంకరంపేట,:** రైతులు యూరియా కొనుగోలు చేయాలంటే ఫర్టిలైజర్ యాప్ ద్వారానే కొనుగోలు చేయాల్సి ఉంటుందని మండల వ్యవసాయ అధికారి కృష్ణ అన్నారు శనివారం శంకరంపేట మండలంలో రైతులు యూరియా కొనుగోలు కొరకు ఫర్టిలైజర్ ఆప్ ద్వారా వివిధ ఫర్టిలైజర్ దుకాణాల నుండి కొనుగోలు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు . శనివారం నుంచే ఫర్టిలైజర్ యాప్ మన మెదక్ జిల్లాకు ప్రారంభించబడిందని రైతులందరూ ఇక ముందు కూడా యూరియా బస్తాలు కొనుగోలు చేయాలంటే తప్పకుండా ఫెర్టిలైజర్ ఆప్ ద్వారా బుకింగ్ చేసుకున్న ఎరువుల దుకాణానికి మాత్రమే వెళ్లి తీసుకోవలసి ఉంటుంది ఇందుకుగాను మొదటగా రైతులు చేయవలసిన పని ఏమిటి అంటే రైతులు తప్పకుండా మొబైల్ వాడవలసి ఉంటుంది తమ మొబైల్ లో ప్లే స్టోర్ నుండి ఫర్టిలైజర్ అని టైప్ చేసి ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ డౌన్లోడ్ చేసుకొని తమ మొబైల్ నెంబర్ ని టైప్ చేయాలి పట్టా పాస్ బుక్కు కు లింకు ఉన్న మొబైల్ నెంబరుకు ఓటిపి వస్తుంది ఓటిపి ఎంట్రీ చేసి సబ్మిట్ చేయాలి తద్వారా రైతుకు ఉన్న పట్టా పాస్బుక్ నెంబర్లు కనబడతాయి రైతు పట్టా పాస్ బుక్ నంబర్ను సెలెక్షన్ చేసుకొని సబ్మిట్ చేసినచో తమకున్న ఎకరాలు మొత్తం సూచించబడుతుంది. తరువాత ఎంత మొత్తంలో పంటలు పండించుచున్నారో ఆ ఎకరాలను ఎంట్రీ చేసిన తర్వాత ఏ పంట వేయుచున్నారో సెలక్షన్ చేసుకోవాలని అన్నారు తర్వాత ఏ ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లదలుచుకున్నాడో ఆ ఫర్టిలైజర్ ఉన్న మండలంను సెలక్షన్ చేసుకుని ఆ మండలంలో ఉన్న దుకాణాలలో ఇంకా యూరియా బ్యాగులు ఉన్నాయి అని చూసుకుని ఏ ఎరువుల దుకాణం నుండి కొనుగోలు చేయదలుచుకున్నాడో ఆ ఎరువుల దుకాణాన్ని సెలక్షన్ చేసుకున్నచో తద్వారా తమకు ఎన్ని యూరియా సంచులుఅవసరం ఉందో ఆప్ లో సూచించబడుతుంది మొదటిదఫా రెండోదఫా మూడోదఫా ఈ విధంగా సూచించబడుతుంది. బుకింగ్ పూర్తయిన తర్వాత బుకింగ్ ఐడి నెంబరు వస్తుంది ఈ ఐడి నెంబరు ను ఏ దుకాణం దారునైతే సెలక్షన్ చేసుకున్నామో ఆ ఎరువులు దుకాణానికి వెళ్లి ఈ ఐడి నెంబర్ ఇచ్చినచో డీలర్లు తమ ఫర్టిలైజర్ ఆప్ లో ఈ బుకింగ్ ఏంటి చేసి యూరియా బ్యాగులను నిర్ధారిస్తారు తర్వాత యధా విధంగా రైతులకు ఈ పాస్ ద్వారా యూరియా బ్యాగులను రైతులకు ఇవ్వడం జరుగుతుంది . ఒకవేళ రైతులు బుకింగ్ చేసుకొని ఎరువుల దుకాణానికి వెళ్లి తీసుకోకుండా ఉన్నచో 24 గంటలలో అది మీరు ఏమవుతుంది తర్వాత మళ్లీ రైతు బుకింగ్ చేసుకుని అవకాశం ఉంటుంది. ఓటిపి రాని రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించినచో వారు వారి లాగిన్ లలో మొబైల్ నెంబర్ అప్డేట్ చేసి ఇచ్చినచో ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ రైతులు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కావున రైతులందరూ ఫర్టిలైజర్ ఆప్ ని తమ మొబైల్లలో ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ తీసుకొని ఏ ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లదలుచుకున్నాడో ముందుగానే నిర్ధారించుకొని బుకింగ్ చేసుకోవాలని అన్నారు ఈ




కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ ఏ ఈ ఓ లు వినీత్ అఖిల్ సుభాష్ రైతులు దుకానుదారులు ఉన్నారు

# సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

### మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్

**పెద్ద శంకరంపేట :** భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని పెద్ద శంకరంపేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. శనివారం సంస్కార్ విద్యాలయంలో నిర్వహించిన సంప్రదాయ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సంస్కార్ విద్యాలయంలో ప్రతి సంవత్సరం విద్యార్థులతో పాటు పెద్దలు సైతం సాంప్రదాయ దినోత్సవం పేరుతో సంప్రదాయ దుస్తులు ధరించడంతోపాటు. పతంగులు ఎగురవేయడం తదితర కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయం అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో రాజా శేఖర్ రెడ్డి. రాజేందర్ గౌడ్. శ్రావణ్ కుమార్. రాజన్ గౌడ్. రామచంద్ర





చారి. పాఠశాల కరస్పాండెంట్ సీతారామారావు దేశ్పాండే ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# పాలెం మరియు పరిసర గ్రామాలకు తీరనున్న విద్యుత్ సమస్య …

### కొనసాగుతున్న నూతన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు


**బిజినపల్లి జనవరి 31:** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం గ్రామంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగు తున్నాయి. గ్రామంలో సంవత్సరాలుగా ఎదురవుతున్న లో వోల్టేజ్, తరచూ విద్యుత్ అంతరాయం వంటి సమస్యలకు ఈ కొత్త సబ్‌స్టేషన్‌తో శాశ్వత పరిష్కారం లభించనుంది. ప్రస్తుతం సబ్‌స్టేషన్‌లో స్ట్రక్చర్ ఏర్పాటు, బ్రేకర్ పరికరాల అమరిక, ట్రాన్స్‌ఫార్మర్లు, తదితర కీలక పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ ప్రారంభం ద్వారా పాలెం గ్రామంతో పాటు పరిసర గ్రామాలు, పాలెం, ఖానాపూర్, గుడ్లనర్వా, కోటాల గడ్డ గ్రామాలకు, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుంది. ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన మోటార్లకు సరిపడా విద్యుత్ అందడం, గృహ వినియోగదారులకు తక్కువ లోడ్ సమస్యలు తొలగిపోవడం, పరిశ్రమలు–వ్యాపారాలకు విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా జరగడం వంటి అనేక ప్రయోజనాలు



చేకూరానున్నాయి. గ్రామాభివృద్ధికి కీలకమైన ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తవుతుండటంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే పనులు పూర్తిచేసి సబ్‌స్టేషన్‌ను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు

# అరటిపండుతో అందమైన మెరిసే చర్మం.. ఇలా ఫేస్ ప్యాక్ చేసి వాడితే మిమ్మల్ని మీరే గుర్తు పట్టరు!

అరటిపండ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్న విషయం అందిరికీ తెలిసిందే. కానీ ఇవి మన చర్మ ఆరోగ్యానికి, మన అందాన్ని పెంచడానికి కూడా ఎంతో భాగా ఉపయోగపడుతాయన్న విషయం చాలా మందికి తెలియదు. అవును అరటిపండ్లలో ఉండే విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు, సహజ నూనెలు మీ చర్మానికి లోపలి నుండి పోషణనిస్తాయి, మృదువుగా, ప్రకాశవంతంగా ఉంచుతాయి. కాబట్టి అరటి పండుతో మన అందాన్ని ఎలా పెంచుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం. అందమైన, ఆరోగ్యకరమైన చర్మం కవాలని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. ఇందుకో రకరకాల ఉత్పత్తులను ఉపయోగిస్తారు. కానీ ఇందుకోసం ఎల్లప్పుడూ ఖరీదైన ఉత్పత్తులే వాడాల్సిన అవసరం లేదు. మన వంటగదిలో లభించే కొన్ని పదార్థాల ద్వారా కూడా మన చర్మానికి అందదంగా ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. అవును అలాంటి వాటిలో అరటిపండ్లు మనకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. అరటి పండు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది. మీరు చర్మం పొడిబారడం, నీరసం, నల్లటి మచ్చలు లేదా ముడతలు వంటి చర్మ సమస్యలతో బాధపడుతుంటే, అరటిపండు ఫేస్ మాస్క్ మీకు చాలా బెస్ట్‌గా ఉంటుంది. ఇది మీ చర్మాన్ని సహజంగా మెరిసేలా చేస్తుంది. అరటిపండు ఫేస్ ప్యాక్ ప్రత్యేకత ఏంటి అరటిపండులోని విటమిన్ ఎ చర్మం పొడిబారడాన్ని తగ్గిస్తుంది, అయితే విటమిన్ సి చర్మాన్ని ప్రకాశవంతం చేయడానికి, నల్లటి మచ్చలను పోగొట్టడానికి సహాయపడుతుంది. అరటిపండులోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి, ముడతలు, సన్నని గీతలు వంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సహాయపడతాయి. అరటిపండ్లు సహజ తేమ లక్షణాలను కలిగి ఉంటాయి, ఇవి చర్మాన్ని మృదువుగా, ప్రకాశ వంతంగా ఉంచడంలో సహాయపడతాయి. ఈ అరటిపండు ఫేస్ ప్యాక్ తయారు చేసుకునేందుకు మీకు ఎటువంటి ఖరీదైన పదార్థాలు అవసరం లేదు. అన్ని పదార్థాలు మీ వంటగదిలో సులభంగా దొరుకుతాయి. అరటిపండు ఫేస్ మాస్క్ కి కావలసిన పదార్థాలు 1 పండిన అరటిపండు 1 టీస్పూన్ తేనె 1 టీస్పూన్ నిమ్మరసం లేదా పాలు మీ చర్మ అవసరాలను బట్టి యాడ్ చేసుకోవాల్సిన పదార్థాలు మీకు ముడతలు ఉంటే, అరటిపండు పేస్ట్‌లో 1 టీస్పూన్ పెరుగు యాడ్ చేసుకోండి. మీరు నల్లటి మచ్చల గురించి ఆందోళన చెందుతుంటే, 1 టీస్పూన్ పసుపు లేదా కలబంద జెల్‌ను యాడ్ చేసుకోండి. మీ చర్మం పొడిగా ఉంటే, 1 టీస్పూన్ ఆలివ్ ఆయిల్ లేదా కొబ్బరి నూనె జోడించండి. అరటిపండు ఫేస్ మాస్క్ ఎలా తయారు చేసుకోవాలి? అరటిపండు ఫేస్ ప్యాక్ కోసం ఒక బాగా పండిన



అరటి పండు తీసుకొని దాని తొక్క తీసి శుభ్రమైన గిన్నెలో వేసుకొని మొత్తగా పిసకండి. మీ చర్మ అవసరాలకు అనుగుణంగా తేనె , ఇతర పదార్థాలను వేసి బాగా కలపండి. అది పేస్ట్ లా మారిన తర్వాత మీ ముఖాన్ని పూర్తిగా శుభ్రంగా కడుక్కొని.. మీ వేళ్లు లేదా బ్రష్ ఉపయోగించి మీ ముఖంపై అప్లై చేసుకోండి. ఈ మాస్క్ ని దాదాపు 15 నుండి 20 నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత, మీ ముఖాన్ని గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుని, కాసేపు ఆరబెట్టుకోండి చివరగా, తేలికపాటి మాయిశ్చరైజర్ లేదా కలబంద జెల్ రాయండి. క్రమం తప్పకుండా వారానికి రెండు సార్లు ఇలా చేస్తే కొన్ని రోజుల్లోనే మిమ్మల్ని మీరే గుర్తు పట్టలేని స్థితికి చేరుకుంటారు.

# టీ20 వరల్డ్ కప్ ప్రోమోలో పాకిస్థాన్‌ను ఒక రేంజ్‌లో ఆడుకున్న ఇండియా



క్రికెట్ ప్రపంచంలో ఇండియా-పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గ్రౌండ్‌లో బాల్ పడకముందే సోషల్ మీడియాలో యుద్ధం మొదలైపోతుంది. ఇక మ్యాచ్ దగ్గరపడుతోందంటే చాలు.. ఇరు దేశాల ఫ్యాన్స్ మధ్య మాటల తూటాలు పేలుతుంటాయి. తాజాగా ఫిబ్రవరి 15న జరగబోయే హై-వోల్టేజ్ మ్యాచ్ కోసం స్టార్ స్పోర్ట్స్ వదిలిన ఒక వీడియో ఇప్పుడు నెట్టింట మంట పుట్టిస్తోంది. ఈ మధ్యకాలంలో యాడ్స్, ప్రోమోలతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కాస్త ఓవర్ యాక్షన్ చేస్తోంది. ఆస్ట్రేలియాతో సిరీస్ టైమ్‌లో పాత గొడవలను గుర్తుచేస్తూ వాళ్లు వదిలిన వీడియోకి గట్టి కౌంటర్ పడింది. స్టార్ స్పోర్ట్స్ రిలీజ్ చేసిన లేటెస్ట్ టీ20 వరల్డ్ కప్ ప్రోమోలో మన యూట్యూబర్ అభిషేక్ మల్హాన్ (ఫుక్రా ఇన్సాన్) పాకిస్థాన్ ఫ్యాన్‌ని ఓ రేంజ్‌లో ట్రోల్ చేశాడు. మన జెర్సీలు వేసుకున్న ఫ్యాన్స్‌తో కలిసి అభిషేక్ వేసిన సెటైర్లు మామూలుగా లేవు. “ఇండియా మీద గెలవడం మీవల్ల కాదులే” అనేలా ఉన్న ఈ వీడియో.. సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పాకిస్థాన్ పాత “మౌకా” యాడ్స్‌కి ఇది పర్ఫెక్ట్ రివెంజ్ అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రోమోలో అంత కాన్ఫిడెన్స్ కనిపించడానికి కారణం లేకపోలేదు. రీసెంట్ రికార్డులు చూస్తే పాకిస్థాన్ పరిస్థితి దారుణంగా ఉంది. మొన్న జరిగిన ఆసియా కప్‌లో ఇండియా ఏకంగా మూడుసార్లు (గ్రూప్ స్టేజ్, సూపర్ 4, ఫైనల్ రౌండ్స్ కలుపుకొని) పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించింది. గత 15 ఏళ్ల రికార్డ్స్ తీస్తే.. రెండు జట్ల మధ్య జరిగిన 32 మ్యాచ్‌ల్లో ఇండియా ఏకంగా 24 సార్లు గెలిచింది. ఎప్పుడో అరుదుగా, పొరపాటున పాకిస్థాన్ గెలిస్తే అది ‘అప్సెట్’ కింద లెక్కే తప్ప, వాళ్ల డామినేషన్ ఎక్కడా కనిపించడం లేదు. ఆసియా కప్ గెలిచాక జరిగిన డ్రామా అంతా ఇంతా కాదు. పొలిటికల్ కారణాల వల్ల ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధికారుల చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోవడానికి భారత క్రికెటర్లు ఇష్టపడలేదు. అందులో పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ చైర్మన్ మొహ్సిన్ నక్వీ కూడా ఉండటంతో, డిప్లొమాటిక్ టెన్షన్స్ గ్రౌండ్‌లో కూడా క్లియర్‌గా కనిపించాయి. ఈ గొడవలన్నీ ఫిబ్రవరి 15న జరగబోయే మ్యాచ్‌ను మరింత సీరియస్‌గా మార్చేశాయి. వచ్చే నెల 15న జరగబోయే ఈ బిగ్ ఫైట్‌కి శ్రీలంకలోని కొలంబో వేదిక కానుంది.

# పాకిస్థాన్‌పై వైభవ్ బదులు తీర్చుకుంటాడా..?



అండర్-19 వరల్డ్ కప్ 2026లో అసలైన సమరానికి సమయం ఆసన్నమైంది. ఫిబ్రవరి 1వ తేదీన క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే భారత్ వర్సెస్ పాకిస్థాన్ మహా సంగ్రామం జరగనుంది. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌లో అందరి కళ్లు టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే ఉన్నాయి. ఐపీఎల్ వేలంలో రికార్డు ధర పలికి వార్తల్లో నిలిచిన వైభవ్, ఈ మ్యాచ్‌లో చెలరేగితే భారత్‌కు విజయం నల్లేరుపై నడకే. అయితే పాకిస్థాన్‌పై వైభవ్‌కు ఉన్న గత రికార్డులు మాత్రం అంత ఆశాజనకంగాలేవు. ఈ నేపథ్యంలో పాత లెక్కలు సరిచేయడానికి వైభవ్ సిద్ధమవుతున్నాడు. వైభవ్ సూర్యవంశీ ఇప్పటివరకు పాకిస్థాన్‌పై మూడు అండర్-19 వన్డేలు ఆడాడు. అయితే ఈ మూడు మ్యాచ్‌ల్లో కలిపి అతను చేసిన పరుగులు కేవలం 32 మాత్రమే. సగటు కేవలం 10.66గా ఉంది. గత ఏడాది జరిగిన అండర్-19 ఆసియా కప్ ఫైనల్లో భారత్ ఓడిపోయినప్పుడు, వైభవ్ చేసిన 26 పరుగులే పాకిస్థాన్‌పై అతని అత్యధిక స్కోరు. అంటే, ఒక స్టార్ బ్యాటర్‌గా గుర్తింపు తెచ్చుకున్న వైభవ్‌కు పాక్ ఒక పెద్ద సవాలుగా మారింది. ఈసారి వరల్డ్ కప్ వేదికగా తనపై ఉన్న విమర్శలకు సమాధానం చెప్పడమే కాకుండా, తన వ్యక్తిగత రికార్డును మెరుగుపరుచుకునేందుకు ఇది గొప్ప అవకాశం. పాకిస్థాన్‌ను ఓడించడం కేవలం ప్రతిష్టాత్మకమే కాదు, టెక్నికల్‌గా కూడా భారత్‌కు చాలా ముఖ్యం. రేపటి మ్యాచ్‌లో భారత్ గెలిస్తే, పాకిస్థాన్ టోర్నీ నుంచి దాదాపు నిష్క్రమించినట్టే. ఈ మ్యాచ్ గురించి వైభవ్ సహచర ఆటగాళ్లు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కెప్టెన్ ఆయుష్ మ్హాత్రే, విహాన్ మల్హోత్రా, అభిజ్ఞాన్ కుండు, దీపేష్ దేవేంద్రన్, హేనిల్ పటేల్ ఈ మ్యాచ్‌ను ఒక సాధారణ ఆటగా పరిగణిస్తూనే, తమ అత్యుత్తమ ప్రదర్శన ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఒత్తిడికి లోనుకాకుండా సహజ సిద్ధమైన ఆట ఆడటమే తమ లక్ష్యమని వారు పేర్కొన్నారు. అండర్-19 వరల్డ్ కప్ చరిత్రను తిరగేస్తే భారత్, పాకిస్థాన్ జట్లు ఇప్పటివరకు 10 సార్లు తలపడ్డాయి. విశేషమేమిటంటే..రెండు జట్లు తలో 5 మ్యాచ్‌లు గెలిచి సమానంగా ఉన్నాయి. ఈ రికార్డును బట్టి చూస్తే రేపటి మ్యాచ్ ఎంత హోరాహోరీగా సాగనుందో అర్థం చేసుకోవచ్చు. భారత్ తన ఆరో విజయం కోసం చూస్తుంటే, పాక్ తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని తహతహలాడుతోంది. వైభవ్ సూర్యవంశీ క్రీజులో నిలబడితే పాక్ బౌలర్లకు కష్టాలు తప్పవు.


# 17 ఏళ్ల తర్వాత రోహిత్ సారథ్యంలో మళ్లీ చరిత్ర సృష్టించిన భారత్



క్రికెట్ ప్రపంచంలో టీ20 ఫార్మాట్‌కు ఉన్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తక్కువ టైమ్‌లో ఎక్కువ ఎంటర్టైన్మెంట్ ఇచ్చే ఈ మెగా టోర్నీలో టీమిండియా ప్రస్థానం చాలా డిఫరెంట్ గా సాగింది. కొన్నిసార్లు ఆకాశమంత ఎత్తులో ఉంటే.. ఇంకొన్ని సార్లు ఊహించని ఓటములతో కిందకు పడిపోయింది. పరుగుల వరద పారించినా.. వికెట్లు కూల్చినా మనోళ్ల తర్వాతే ఎవరైనా అనిపించినా ఐసీసీ మొదటి టీ20 ట్రోఫీ గెలిచిన తరువాత మాత్రం మళ్ళీ చాలా టైమ్ పట్టింది. 2007లో ధోనీ సేన సృష్టించిన వండర్ నుంచి 2024లో రోహిత్ శర్మ కళ్లలో నీళ్లు తెప్పించిన విక్టరీ వరకు అసలు టీమ్‌ఇండియా ప్రయాణం ఎలా సాగింది 2007లో సౌత్ ఆఫ్రికా వేదికగా జరిగిన మొదటి టీ20 వరల్డ్ కప్ ఒక మర్చిపోలేని జ్ఞాపకం. సచిన్, రాహుల్, గంగూలీ శకం ముగింపు తరువాత సీనియర్ ఆటగాళ్లు లేకుండా, ఎంఎస్ ధోనీ సారథ్యంలో యువ జట్టు బరిలోకి దిగింది. అంచనాలు ఏమాత్రం లేని స్థితి నుంచి అద్భుత ప్రదర్శనతో ఫైనల్ చేరింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఆ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠకు పరాకాష్ట. చివరి ఓవర్‌లో శ్రీశాంత్ పట్టిన ఆ క్యాచ్ భారత్‌ను మొదటిసారి టీ20 విశ్వవిజేతగా నిలబెట్టింది. ఈ విజయమే భారత్‌లో ఐపీఎల్ వంటి భారీ లీగ్ రావడానికి, టీ20 ఫార్మాట్ ప్రాచుర్యం పొందడానికి పునాది వేసింది. మొదటి టీ20 వరల్డ్ కప్ విజయం తరువాత టీమ్‌ఇండియాకు పెద్దగా కలిసి రాలేదు. వరుసగా సీనియర్లు ఫామ్ కోల్పోవడం కూడా జరిగింది. 2009లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీమ్‌ఇండియా, సెమీస్ చేరడంలో విఫలమైంది. అలాగే 2010లో వెస్ట్ ఇండీస్‌లో జరిగిన టోర్నీలో కూడా రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. ఈ రెండు టోర్నీల్లోనూ అంచనాలు భారీగా ఉన్నా, ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో రాలేదు. 2012లో శ్రీలంక వేదికగా జరిగిన టోర్నీలో భారత్ సెమీఫైనల్ చేరుతుందనుకున్నా, కేవలం కొద్ది తేడాతో ఆ అవకాశాన్ని మిస్ చేసుకుంది. ఇక 2014లో భారత్ తన ప్రతాపం చూపించింది. అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్ వరకు దూసుకెళ్లింది. కానీ టైటిల్ పోరులో శ్రీలంక చేతిలో ఆరు వికెట్ల తేడాతో ఓటమి పాలై రన్నరప్‌గా మిగిలిపోయింది. ఈ ఓటమి అప్పట్లో టీమ్‌ఇండియా ఫ్యాన్స్‌ను చాలా బాధించింది. అప్పటికే వన్డే వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత్, ఈ కప్పు కూడా గెలుస్తుందని అందరూ ఆశించారు. కానీ అనుకున్నట్లు జరగలేదు. 2016లో ఆతిథ్యమిచ్చిన భారత్ వరల్డ్ కప్‌లో ఫేవరెట్ జట్టుగా బరిలోకి దిగింది. అయితే సెమీఫైనల్‌లో వెస్ట్ ఇండీస్ మన కలలను చిదిమేసింది. ముంబైలో జరిగిన ఆ పోరులో విండీస్ ఏడు వికెట్ల తేడాతో గెలిచి భారత్‌ను టోర్నీ నుంచి పంపించేసింది. ఆ తర్వాత కరోనా వల్ల విరామం రావడంతో 2021లో దుబాయ్‌లో టోర్నీ జరిగింది. ఈ ఎడిషన్ భారత్‌కు ఒక పీడకల లాంటిది.

# ఆస్ట్రేలియా ఓపెన్ 2026 విజేతగా ఎలైనా రైబకినా

తొలి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను ముద్దాడిన రైబకినా ప్రతిష్టాత్మక టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్ 2026 మహిళల సింగిల్స్ విజేతగా కజకిస్థాన్ స్టార్ ఎలైనా రైబకినా నిలిచింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ అరీనా సబలెంకా 4-6, 6-4, 4-6 తేడాతో ఐదో సీడ్ ఎలైనా రైబకినా చేతిలో ఓటమిపాలైంది. అద్వితీయమైన ప్రదర్శనతో వరల్డ్ నెంబర్ వన్ సబలెంకాకు షాకిచ్చిన ఎలైనా రైబకినా కెరీర్‌లో తొలి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను ముద్దాడింది. ఓవరాల్‌గా ఎలైనా రైబకినాకు ఇది రెండో గ్రాండ్‌స్లామ్. అంతకుముందు వింబుల్డన్ 2022 టైటిల్ గెలిచింది. తాజా విజయంతో ఆస్ట్రేలియా ఓపెన్ 2023 ఫైనల్లో సబలెంకా చేతిలో ఎదరైనా పరాజయానికి రైబకినా ప్రతీకారం తీర్చుకుంది. ఆస్ట్రేలియా ఓపెనర్ 2026 విజేతగా నిలిచిన ఎలైనా రైబకినాకు రూ.25 కోట్ల 25 లక్షల రూపాయల ప్రైజ్‌మనీ లభించింది. ఈ గెలుపుతో రైబకినా తన కెరీర్ బెస్ట్ ర్యాంకింగ్ నెంబర్ 3కి చేరుకోనుంది. సుమారు 2 గంటల 18 నిమిషాల పాటు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో ఎలెనా రైబకినా పై చేయి సాధించింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో ఒక దశలో రైబకినా 0-3తో వెనుకంజలో నిలిచింది. దాంతో సబలెంకా విజయం ఖాయమని అంతా అనుకున్నారు. కానీ రైబకినా నేలకు కొట్టిన బంతిలా పుంజుకొని వరుస గేమ్‌లు గెలిచి సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. తొలి సెట్‌లో ఆధిపత్యం చెలాయించిన రైబకినా 37 నిమిషాల్లోనే 6-4తో గెలిచింది. రెండో సెట్‌లో సబలెంకా పుంజుకోవడంతో పోరు హోరాహోరీగా మారింది. 55 నిమిషాల పోరాటం తర్వాత 6-4తో సబలెంకా రెండో సెట్ కైవసం చేసుకుంది. దాంతో నిర్ణయాత్మక మూడో సెట్ ఆడాల్సి వచ్చింది. అత్యంత ఉత్కంఠగా సాగిన ఈ సెట్‌లో రైబకినా వెనుకంజలో నిలిచినా.. పట్టు విడవకుండా పోరాడి 46 నిమిషాల్లో సెట్‌ను కైవసం చేసుకోవడంతో పాటు తొలి టైటిల్‌ను ముద్దాడింది. ఈ ఓటమిని తట్టుకోలేకపోయిన సబలెంకా తన సీట్లో కూర్చొని వెక్కి వెక్కి ఏడ్చింది. మూడో సెట్‌లో 3-0తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ మ్యాచ్ చేజారడాన్ని ఆమె తట్టుకోలేకపోయింది. ఇప్పటి వరకు నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన సబలెంకా.. మరో నాలుగు ఫైనల్లో ఓటమిపాలైంది. ఈ సీజన్‌లో ఒక సెట్ కూడా కోల్పోకుండా విజయాల పరంపర కొనసాగించిన సబలెంకాకు రైబకినా బ్రేక్ వేసింది. 2001, 2002 ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఛాంపియన్ అయిన జెన్నిఫర్ కాప్రియాటి చేతుల మీదుగా రైబకినా టైటిల్ అందుకుంది.



# గాయంతోనే జ్వెరెవ్‌ను చిత్తు చేసిన అల్కరాజ్!



మెల్ బోర్న్ వేదికగా జరుగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ 2026లో టెన్నిస్ ప్రపంచం ఓ అద్భుతమైన పోరాటాన్ని వీక్షించింది. టెన్నిస్ ఫ్యాన్స్ దశాబ్దాల పాటు గుర్తుంచుకునే అద్భుత ఘట్టం రోడ్ లేవర్ ఎరీనాలో ఆవిష్కృతమైంది. స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్, జర్మనీ దిగ్గజం అలెగ్జాండర్ జ్వెరెవ్‌ల మధ్య 5 గంటల పాటు సాగిన మెగా వార్‌లో అల్కరాజ్ విజేతగా నిలిచాడు. తొడ, నడుము గాయంతో విలవిల్లాడుతున్నా ఏ మాత్రం పట్టువదలకుండా పోరాడి తన కెరీర్లో మొదటిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్నాడు. మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతున్న సమయంలో కార్లోస్ అల్కరాజ్ తీవ్రమైన నొప్పితో కోర్టులోనే కుప్పకూలాడు. ఆయనకు మెడికల్ టైమ్-అవుట్ ఇవ్వడంపై జ్వెరెవ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ అంపైర్‌తో వాగ్వాదానికి దిగాడు. కండరాలు పట్టివేస్తే టైమ్-అవుట్ ఇవ్వకూడదనే నిబంధనను ఆయన గుర్తు చేశాడు. అయితే అల్కరాజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆట కాసేపు నిలిచిపోయింది. తొలి రెండు సెట్లను 6-4, 7-6(5)తో గెలుచుకున్న అల్కరాజ్‌కు, గాయం తర్వాత జ్వెరెవ్ గట్టి పోటీ ఇచ్చాడు. తర్వాతి రెండు సెట్లను టై-బ్రేకర్లలో గెలిచిన జ్వెరెవ్ మ్యాచ్‌ను నిర్ణయాత్మక ఐదో సెట్‌కు తీసుకెళ్లాడు. ఐదో సెట్‌లోనూ జ్వెరెవ్ 3-1తో ముందంజలో ఉన్నప్పుడు అల్కరాజ్ కథ ముగిసిందని అందరూ భావించారు. కానీ కాలికి బ్యాండేజీతోనే సింహంలా పోరాడిన అల్కరాజ్.. వరుస గేమ్ పాయింట్లతో 7-5తో చివరి సెట్‌ను కైవసం చేసుకుని మ్యాచ్‌ను ముగించాడు. వచ్చే ఆదివారం జరగబోయే ఫైనల్‌లో అల్కరాజ్ విజయం సాధిస్తే, టెన్నిస్ చరిత్రలో అత్యంత పిన్న వయసులో ‘కెరీర్ గ్రాండ్ స్లామ్’ (నాలుగు ప్రధాన టైటిల్స్ గెలవడం) పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. ఓపెన్ ఎరాలో ఈ ఘనత సాధించిన ఎనిమిదో ఆటగాడిగా ఆయన నిలుస్తారు. ఫైనల్‌లో అల్కరాజ్, నొవాక్ జకోవిచ్ లేదా యానిక్ సినర్‌తో తలపడనున్నారు. ఆదివారం మెల్‌బోర్న్ పార్క్ ఓ సరికొత్త చరిత్రకు సాక్షిగా నిలవబోతోంది.

నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక





## ల్యాండ్ మార్క్ మూవీ..

### టాలీవుడ్ కింగ్ 'టార్గెట్' అదేనా?

టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున సోలో హీరోగా సిల్వర్ స్క్రీన్ పై కనిపించి చాలా కాలమే అయింది. రీసెంట్ గా వచ్చిన కూలీ, కుబేర వంటి చిత్రాల్లో నెగెటివ్ షేడ్స్ లేదా సైడ్ క్యారెక్టర్స్ కే పరిమితమైన నాగ్ నుంచి ఓ సాలిడ్ కమర్షియల్ మూవీ రావాలని అభిమానులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఆ వేచి చూసే రోజులకు ఎండ్ కార్డ్ పడినట్టే కనిపిస్తుంది.కెరీర్ లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ సినిమాను నాగార్జున సైలెంట్ గా సెట్స్ పైకి తీసుకెళ్లారు. కోలీవుడ్ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై స్వయంగా నాగార్జున గ్రాండ్ గా నిర్మిస్తున్నారు.గతేడాది ఎలాంటి హడావుడి లేకుండా పూజా కార్యక్రమాలు నిర్వహించిన మేకర్స్, అప్పటి నుంచి సీక్రెట్ గా షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు పోస్టర్ గానీ, కాన్సెప్ట్ వీడియో గానీ విడుదల చేయకపోవడం విశేషం. ప్రస్తుతం హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. టాకీ పార్ట్ దాదాపు పూర్తి దశకు చేరుకున్నట్టు సమాచారం.షూటింగ్ పూర్తయ్యే వరకు కూడా సీక్రెట్ గా ఉంచాలన్నది నాగార్జున ప్లాన్. అందుకే మేకర్స్ ఎలాంటి అప్‌డేట్స్ ఇవ్వడం లేదు. అయితే సమ్మర్ చివరికి చిత్రీకరణ పూర్తి చేసి, దసరా టార్గెట్ గా గ్రాండ్ రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. సరైన సమయానికి రిలీజ్ డేట్ ప్రకటించేలా నాగ్ ప్లాన్ చేసుకుంటున్నారు. టైటిల్ కూడా అప్పుడే అనౌన్స్ చేయనున్నారని సమాచారం.అయితే లాటరీ కింగ్ అనే టైటిల్ ను కూడా పరిశీలిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రావాల్సి ఉంది. అదే సమయంలో చిత్రంలో నాగార్జునకు జోడీగా టబు నటించనున్నట్టు ఇటీవల ఆయన కన్ఫర్మ్ చేశారు. వీరిద్దరి మధ్య రొమాంటిక్ యాంగిల్ కూడా ఉండనున్నట్లు సమాచారం. నాట్యం ఫేమ్ సుస్మితా భట్ మరో హీరోయిన్ గా ఎంపికైనట్టు ప్రచారం సాగుతోంది.కథ ఆధారంగా నాగ్ మూడు వేర్వేరు గెటప్స్‌లో కనిపిస్తారని, మొత్తం ముగ్గురు హీరోయిన్లు ఉంటారని టాక్. జోనర్ విషయానికి వస్తే యాక్షన్, ఎమోషన్స్ ఉన్న కథతో సినిమా రూపొందుతోందట.



## మాట నిలబెట్టుకున్న రామ్ చరణ్...

### 500 మంది డ్యాన్సర్లకు ఉచిత ఆరోగ్య బీమా

ఝగ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన ఉదార స్వభావాన్ని మరోసారి చాటుకున్నారు. టాలీవుడ్ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లోని సుమారు 500 మంది సభ్యులు, వారి కుటుంబాలకు ఉచితంగా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు ముందుకు వచ్చారు. గతంలో తన పుట్టినరోజు సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, హెల్త్ కార్డుల పంపిణీకి సంబంధించిన ప్రతిపాదనను తాజాగా ఆమోదించారు.

సినిమా షూటింగ్‌లలో ఎంతో శ్రమించే డ్యాన్సర్లు ప్రమాదాలకు గురైనప్పుడు లేదా అనారోగ్యం బారిన పడినప్పుడు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే సదుద్దేశంతో చరణ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం ద్వారా ప్రతి డ్యాన్సర్ కుటుంబానికి సమగ్ర ఆరోగ్య బీమా అందనుంది. ఇందుకోసం ఆయన సుమారు రూ.50 లక్షల వరకు వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది.తన తండ్రి, మెగాస్టార్ చిరంజీవి బాటలోనే సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న చరణ్, ఈ కార్యక్రమాన్ని తన భార్య ఉపాసనతో కలిసి పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం 'పెద్ది' వంటి భారీ చిత్రాలతో బిజీగా ఉన్నప్పటికీ, సినీ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడంపై డ్యాన్సర్ సంఘాలు, పరిశ్రమ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. చరణ్ తీసుకున్న ఈ నిర్ణయం 500 కుటుంబాలకు వైద్యపరమైన భరోసా కల్పించిందని, ఆయన నిజమైన హీరో అని ప్రశంసిస్తున్నాయి.

## హైప్ క్రియేట్ చేసినా.. ప్రేక్షకులు ఆదరిస్తారా అన్నదే ముఖ్యం

### సినిమాల తీరుపై నటుడు విజయ్ సేతుపతి కామెంట్స్



తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ యాక్టర్ విజయ్ సేతుపతి. ప్రస్తుతం అరవింద్ స్వామితో కలిసి గాంధీ టాక్స్ సినిమాలో నటిస్తున్నాడు. సాదాసీదా నటనతో ప్రేక్షకులను కట్టిపడేయడం ఈ టాలెంటెడ్ నటుడి స్పెషాలిటీ అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నాడు మక్కళ్ సెల్వన్. ఈ రోజుల్లో చాలా మంది యాక్టర్లు, డైరెక్టర్లు తమ సినిమాలు ప్రేక్షకులను ఆకర్షించేందుకు హైప్ క్రియేట్ చేసేందుకు ఏదో ఒక విషయాన్ని హైలెట్ చేయాలని ప్రయత్నిస్తుంటారని తెలిసిందే. విజయ్ సేతుపతి తన అప్‌కమింగ్ మూకీ సినిమా 'గాంధీ టాక్స్' గురించి మాట్లాడాడు.. డైలాగ్స్ లేకుండా ఎమోషన్స్‌తో ప్రేక్షకులతో దగ్గరయ్యేందుకు రెడీ అవుతున్నారు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి. ప్రేక్షకులకు వినోదం కోసం థియేటర్లకు వస్తారు కాబట్టి ఫిల్మ్‌మేకర్స్ ప్రేక్షకులు అర్థం చేసుకోలేని విధంగా సినిమా తీయొద్దని సూచించాడు విజయ్ సేతుపతి. ఓ వైపు ప్రయోగాలకు వెల్ కమ్ చెబుతూనే.. మరోవైపు ప్రేక్షకులు ప్రత్యేకించి డబ్బులు చెల్లించి సినిమా చూసేందుకు వస్తున్నప్పుడు వారికి ఖర్చు భారమనిపించేలా సినిమా ఉండకూడదని అన్నాడు విజయ్ సేతుపతి. గాంధీ టాక్స్ స్పెషల్ సినిమా ఏం కాదు.. కానీ సరికొత్త సినిమా చూసిన అనుభూతిని మాత్రం తప్పకుండా ఇస్తుందని ధీమా వ్యక్తం చేశాడు. సినిమా సంప్రదాయ ఫార్మాట్ ను ఫాలో అవకపోవడంతో గాంధీ టాక్స్ చిత్రాన్ని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో టీం మెంబర్స్ అంతా మొదట ఆందోళన చెందారని.. అయితే దగ్గరి స్నేహితులకు స్పెషల్ స్క్రీనింగ్ వేసిన తర్వాత పాజిటివ్ స్పందన వచ్చిందని.. దాంతో సినిమాపై నమ్మంక పెరిగిందన్నాడు విజయ్ సేతుపతి. అయితే వారిచ్చిన ఫీడ్ బ్యాక్ సినిమా మార్కెట్ కోసం ఉపయోగపడదని కూడా చెప్పాడు. టీం అంతా



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న డైరెక్టర్ అనిల్ రావిపూడి

టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇటీవల ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. సంక్రాంతికి విడుదలై రూ. 360 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ సినిమా భారీ విజయానికి కృతజ్ఞతగా ఆయన స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.దర్శనం అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడిన అనిల్ రావిపూడి, తన తదుపరి ప్రాజెక్ట్‌పై కీలకమైన అప్‌డేట్ ఇచ్చారు. తన నెక్స్ట్ సినిమాకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, మరో 10 నుంచి 15 రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటన చేస్తానని స్పష్టం చేశారు. దీంతో ఆయన తర్వాతి చిత్రం ఎవరితో ఉండనుందనే దానిపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం.. అనిల్ రావిపూడి తన తర్వాతి చిత్రాన్ని విక్టరీ వెంకటేశ్‌తో చేసే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇది భారీ మల్టీస్టారర్‌గా ఉండనుందని, ఇందులో తమిళ నటుడు కార్తీ లేదా మలయాళ స్టార్ ఫహద్ ఫాజిల్ కీలక పాత్రలో కనిపించవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు వినోదాత్మక చిత్రాలతో ఆకట్టుకున్న ఆయన, ఈసారి పూర్తి భిన్నమైన జానర్‌లో సినిమా తీసేందుకు స్క్రిప్ట్ వర్క్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

## హీరోగా దర్శకుడు.. నిర్మాతగా రజనీ కుమార్తె.. ఆసక్తికరంగా 'విత్ లవ్' ట్రైలర్




సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ నిర్మాణంలో ఓ కొత్త ప్రేమకథా చిత్రం రాబోతోంది. 'విత్ లవ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమాతో దర్శకుడు అభిషన్ జీవింత్ హీరోగా పరిచయం అవుతున్నారు. ఫిబ్రవరి 6న విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించి తాజాగా తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. గతంలో 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రానికి దర్శకత్వం వహించి గుర్తింపు తెచ్చుకున్న అభిషన్, ఈ సినిమాతో కథానాయకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మదన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మలయాళీ నటి అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తోంది. విడుదలైన ట్రైలర్ చూస్తుంటే, ఇదొక స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన ప్రేమకథగా అనిపిస్తోంది. యువతను ఆకట్టుకునే భావోద్వేగాలు, అందమైన విజువల్స్, ఆహ్లాదకరమైన సంగీతం ట్రైలర్‌లో ఆకట్టుకుంటున్నాయి.ఈ సినిమాకు సీన్ రోల్డాన్ సంగీతం అందిస్తుండగా, శ్రేయాస్ కృష్ణ సినిమాటోగ్రాఫర్. కావ్య అనిల్, సచిన్ నాచిప్పన్, తేని మురుగన్ వంటి వారు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సూపర్ స్టార్ కుమార్తె నిర్మిస్తున్న ఈ ప్రేమకథా చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి.

## ప్రిన్సెస్ ఆఫ్ టాలీవుడ్ స్టన్నింగ్ లుక్



సూపర్ స్టార్ మహేష్ బాబు గారాల పట్టి సితార ఘట్టమనేనికి తాజా ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. ఈ ఫోటోషూట్ లో అంతర్జాతీయ జువెలరీ బ్రాండ్ పీఎంజే కు సితార ప్రమోషన్ చేస్తోంది. ఇక వేదికపై సితార ఘట్టమనేని గ్లింప్స్ చూపరుల దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. సితార వయసు కేవలం 13. ఇంత చిన్న వయసులో అంతర్జాతీయంగా వేవ్స్ క్రియేట్ చేస్తోందనే చెప్పాలి. మిరుమిట్లు గొలిపే డిజైనర్ దుస్తుల్లో మహేష్ గారాల పట్టీ సితార ఘట్టమనేని ఎంతో క్యూట్ గా, అందంగా కనిపిస్తోంది. తాజాగా విడుదలైన ప్రకటన వీడియోలో సితార అచ్చం ఒక ప్రొఫెషనల్ మోడల్ లాగా గొప్ప ఆత్మవిశ్వాసంతో కనిపించడం హైలైట్. అలా ఠీవిగా కెమెరా ముందు నిలుచున్న తీరు, కళ్లతోనే కోటి భావాలు పలికిస్తూ, అందంగా స్మైలిస్తూ ఒక ప్రొఫెషనల్ మోడల్ నే తలపించింది. భవిష్యత్ లో గొప్ప స్టార్ అయ్యే లక్షణాలు సితారలో కనిపిస్తున్నాయని ఈ లుక్ చూడగానే ఘట్టమనేని అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. అందం, స్మైల్, ఎలివేషన్ పరంగా తన తండ్రికి తగ్గ వారసురాలు అంటూ కితాబిచ్చేస్తున్నారు.సితారకు ఇప్పటికే ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉంది. ఇంతకుముందు న్యూయార్క్ లోని -టైమ్స్ స్క్వేర్- బిల్ బోర్డ్ పై మెరిసిన అతి పిన్న వయస్కురాలిగా సితార రికార్డు సృష్టించింది. ఇక సితార లుక్ చూడగానే అచ్చం తన తండ్రిని తలపిస్తోందని చాలా మంది అభిమానులు కితాబచ్చేస్తున్నారు. ప్రిన్సెస్ ఆఫ్ టాలీవుడ్ అంటూ అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సితార చాలా చిన్న వయసులో మోడలింగ్ ద్వారా ఆర్జించిన 1 కోటి రూపాయల తొలి పారితోషికాన్ని తన తండ్రి చారిటీ కార్యక్రమాలకు డొనేట్ చేసేయడం నిజంగా ఆశ్చర్యపరిచింది. దీనిని చిన్నారుల గుండె ఆపరేషన్లకు ఖర్చు చేస్తున్నారు. మహేష్ తరహాలోనే సామాజిక సేవలో తాను సైతం అంటూ సితార ముందుకు వస్తోంది. తన జిజ్ఞాస అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.